30 Lessons for those who Fast (Telugu)


يهدى ولا يباع

**రమజాన్ మాసం**

మనం మరిచిపోలేని మధురమైన రోజులు.
ఆ నెలలోని తీపి జ్ఞాపకాలు
అల్లాహ్ భక్తులను సంవత్సరమంతా
అలరిస్తూనే ఉంటాయి.
అది పుణ్యకార్యాలు వెల్లివిరిసే వసంతకాలం.
అల్లాహ్ భక్తులకు ఎంతో పసందైన కాలం.
వరాలు కురిపించే ఆ కొద్ది కాలం
కరిగిపోయిన మరుక్షణం
రమజాన్ ప్రియుల్లో దానికోసం
మళ్ళీ నిరీక్షణం మొదలవుతుంది.


Shanti Margam Publication Trust
16-2-867/10, Akbar Bagh, Sayeedabad, Hyderabad-500 059, Cell : 9676144697
E-mail: shantimargam@gmail.com

# రమజాన్ ఉపవాస దీక్షకులకు 30 పాఠాలు



ఆయిద్ అబ్దుల్లాహ్ అల్‌కర్నీ

శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్ట్, హైదరాబాద్



# రమజాన్ ఉపవాస దీక్షకులకు 30 పాఠాలు

DIVYA QURAN
HYDERABAD
EDUCATION FOUNDATION

మూలం
ఆయిద్ అబ్దుల్లాహ్ అల్ [illegible]

అనువాదం
అనువాద విభాగం, శాంతి మార్గం పబ్లికేషన్

ప్రకాశకులు
**శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్ట్,**
హైదరాబాద్

**Upavasa Deekshakulaku 30 Pataalu**

**30 Lessons for those who Fast (Telugu)**


Written by : Ayid Abdullah Al-qarni

Telugu Translation : Shanti Margam Publication Translation Division



*© All Rights Reserved with Publishers*



First Edition : September 2009

Copies : 500

Hadya : Fee Sabeelillah

DTP & Printing : Al-Baseer Graphics, Hyd. 9441055065

Published by : **Shanti Margam Publication Trust**
16-2-867/10, Akbar Bagh,
Sayeedabad, Hyderabad-500 059.
Cell : 9676144697
E-mail: shantimargam@gmail.com


## విన్నపం

ఈ పుస్తకం ఆధునిక ప్రపంచ ప్రఖ్యాత ఇస్లామీయ పండితులు **ఆయిద్ అబ్దుల్లాహ్ అల్ కర్నీ** గారి మూల రచనకు స్వేచ్ఛానువాదం. ప్రస్తుతం దీనిని సంక్షిప్తంగా ప్రచురించడం జరుగుతోంది. వచ్చే రమజాను మాసం వరకు దీనిని సంపూర్ణంగా అరబీ మూలంతో ప్రచురించేందుకు పబ్లికేషన్ ప్రయత్నిస్తుంది ఇన్షాఅల్లాహ్.

ఈ పుస్తకంపై మీ సలహాలు, సూచనలను ఈ క్రింద తెలుపబడిన చిరునామాకు లేదా ఈ-మెయిల్‌కు పంపించ మనవి. మీ అమూల్యమైన సలహాలను మలి ముద్రణలో పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

**హాఫిజ్ ఎస్.ఎం. రసూల్ షర్ఫీ**


సెల్ : ***9676144697***

*E-mail: shantimargam@gmail.com*


## శ్రేయోభిలాషులకు మనవి

ఈ పుస్తకాన్ని కనీసం 500 కాపీలు లేదా 1000, 1500, 2000 ఇలా ఎన్ని కాపీలైనా ముద్రించి దైవమార్గంలో ఉచితంగా పంచి పెట్టాలని కోరుతున్న శ్రేయోభిలాషులు వివరాల కోసం **"శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్టు"** వారిని సంప్రదించగలరు.


***9676144697***

*E-mail: shantimargam@gmail.com*

# అనుక్రమణిక


| | | |
|---|---|---|
| 1. | దైవప్రవక్త (స) వారి ఉపవాస దివ్యోపదేశాలు | 09 |
| 2. | రమజాన్ ఉపవాసాల్లోని మర్మం | 15 |
| 3. | దైవగ్రంథం ఖుర్ఆన్ దివ్య మాసం రమజాన్ | 19 |
| 4. | ఉపవాసుల జపం | 23 |
| 5. | ఔదర్యాన్ని, త్యాగ నిరతిని నేర్పే శిక్షణా కాలం, రమజాన్ | 27 |
| 6. | రమజాన్ : రాత్రి వేళ నమాజుల్లో గడిపే కాలం | 31 |
| 7. | రమజాన్ నెలలో ముస్లిం ఇల్లు | 35 |
| 8. | హృదయమూ ఉపవాసం పాటిస్తుంది | 39 |
| 9. | "నోరు" కూడా ఉపవాసం పాటిస్తుంది | 43 |
| 10. | "కన్ను" ఉపవాసం పాటించే విధానం | 47 |
| 11. | వీనుల ఉపవాసం | 50 |
| 12. | కడుపు కూడా ఉపవాసం పాటిస్తుంది | 54 |
| 13. | ఉపవాసి వల్ల జరిగే తప్పులు | 59 |
| 14. | రమజాన్ మాసపు మధుర స్మృతులు | 64 |
| 15. | రమజాన్ క్షమావర్షం కురిసేకాలం | 67 |
| 16. | విశ్వాసం వికసించే వసంత కాలం | 72 |
| 17. | అల్లాహ్‌పై ప్రేమ పెరిగే ప్రియమాసం రమజాన్ | 78 |
| 18. | పిల్లలకు సద్బుద్ధులు నేర్పేందుకు సదవకాశం | 83 |
| 19. | దుబారా ఖర్చు ఓ దౌర్భాగ్యం | 87 |
| 20. | సదాచరణ, సత్సంబంధాల మాసం | 91 |
| 21. | రమజాన్ : ముస్లింల కొరకు కారుణ్యాల మాసం | 95 |
| 22. | రమజాన్ సంప్రదాయాలను మన సమాజంలో మళ్ళీ వికసించనిద్దాం | 100 |
| 23. | రమజాన్ సందర్భంగా ముస్లిం మహిళకు ఓ ఉత్తరం | 105 |
| 24. | రమజాన్ నెలలో ముస్లిం పండితులు పాటించవలసిన కొన్ని విషయాలు | 109 |
| 25. | రమజాన్ ఘోషణ - ముస్లిం సమయ పాలన | 113 |
| 26. | ప్రేమ, సోదరభావాలు వెల్లివిరిసే శుభమాసం రమజాన్ | 116 |
| 27. | ప్రజలను ఇస్లాం వైపుకు ఆహ్వానించేందుకు అనువైన వసంతం రమజాన్ | 120 |
| 28. | ఉపవాసి ప్రార్థనలు నిరాకరించబడవు | 125 |
| 29. | ఉపవాస దీక్షకులకు కానుకలు | 130 |
| 30. | రేపే ఈద్ - ఉపవాస దీక్ష విరమణ పండుగ | 133 |
| ★ | ముగింపు | 136 |




# పరిచయం

సకల స్తోత్రాలు అత్యంత పరిశుద్ధుడూ, శాంతి ప్రదాతా అయిన అల్లాహ్‌కే. నిరుపమాన శక్తులకు, గొప్పతనాలకు, గౌరవాలకూ ఆయన మాత్రమే ప్రభువు. రుజుమార్గమైన ఇస్లాం ధర్మం వైపు దారి చూపి, ప్రార్థనలతో, ఉపవాసాలతో మనకు ఒక ప్రత్యేక స్థానాన్ని ప్రసాదించినదీ ఆయనే.

ప్రవక్తల నాయకుడు, ఆదర్శ విశ్వ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై, ఇంకా అనునిత్యం ఆరాధనలు చేస్తూ, ఉపవాసాలు పాటిస్తూ ఉండే ఉత్తములైన ముస్లింలందరిపై పరమ ప్రభువైన అల్లాహ్ తన శాంతీ కటాక్షాలను, అనుగ్రహాలను కురిపించుగాక! అలాగే ప్రవక్త (స)వారి కుటుంబీకులపై, ఆయన అనుయాయులపై, వారి తరువాత ఈ లోకంలో ప్రభవించిన సద్గుణశీలురందరిపై కూడా అల్లాహ్ తన కటాక్ష వీక్షణాలను ప్రసరింపజేయుగాక! (ఆమీన్)

**"ఉపవాస దీక్షకులకు ముప్పై పాఠాలు"** అనే ఈ పుస్తకంలో నేను ప్రముఖమైన కొన్ని ఖుర్ఆన్ వాక్యాలను, సత్యమని ధృవీకరించబడిన కొన్ని ప్రవక్త ప్రవచనాలను, మరికొన్ని మనోహరమైన కవితలను, మనసులను మేల్కొలిపే రుజువచనాలనూ పొందుపరిచాను. సద్గుణ సంపన్నులు పరస్పరం సంభాషించు కోవటానికి ఎంతో ఉపకరం ఈ చిరుపుస్తకం. అలసిపోయిన ప్రయాణీకులను, పర్యాటకులను, బాటసారులను ఈ పుస్తకం విశ్రాంతతీరాల విహారం చేయిస్తుంది. పాఠకుల ప్రయాణ బడలికను తీర్చి వారికి ఎంతో హాయిగొలుపుతుంది. విహార యాత్రలకు బయలుదేరినప్పుడు ప్రజల మధ్య పరస్పరం ప్రేమాను రాగాలను పెంపొందించగల అపూర్వ కానుక ఈ పుస్తకం. బోధకులు తమ బోధనను పదునుపెట్టుకునేందుకు పనికివచ్చే అద్భుత పరికరమిది. ఉపాధ్యాయుల, ఉపన్యా

సకుల, నమాజుకు సారథ్యం వహించే ఇమాముల, మొదలగు వారందరి విజ్ఞానాభివృద్ధికి ఈ పుస్తకం తోడ్పడగలదని నేను ఆశిస్తున్నాను.

ఈ పుస్తకం మూడు ఉద్దేశాలను నెరవేరుస్తుంది :

**మొదటిది:** దివ్య ఖుర్‌ఆన్ వాక్యాలను, ధృవీకరించబడిన హదీసుల నుండి సంగ్రహించిన పదజాలాన్ని, మంచి సలహాలనూ మస్తిష్కంలో పదిలపరచుకునేందుకు ఈ పుస్తకం తోడ్పడుతుంది. సత్యమని రూఢీ కాని ఏ ఒక్క హదీసు కానీ, కల్పిత గాథలు కానీ ఈ పుస్తకంలో లేవు.

**రెండవది :** ఈ పుస్తకంలో చట్టపరమైన విషయాలను, ఆజ్ఞలను గురించి చర్చించటం నా ఉద్దేశం కాదు. ఎందుకంటే, ఇటువంటి విషయాల గురించి ఇప్పటికే మన ధార్మికవేత్తలు పుష్కలంగా పనిచేసి పెట్టారు. దీని గురించి వారు రాసిన పుస్తకాలతో మన గ్రంథాలయాలు నిండుగా ఉన్నాయి. ఈ రంగంలో ఇస్లామీయ పరిశోధకులు సంతృప్తికరమైన కృషి జరిపారు. ఇది ఎవరూ కాదనలేని సత్యం. అయితే "ఆధ్యాత్మికత", "దైవభీతి", "నీతి నడవడికలు", "మంచిని పెంచటం - చెడును త్రుంచటం" లాంటి అంశాలపై నేటికీ ఇంకా ఎన్నో పుస్తకాలు వెలువడవలసిన అవసరం చాలా ఉంది. అల్లాహ్ కోసం నేను తలపెట్టిన ఈ రచనా కార్యం ఆ అవసరాన్ని కొంతలో కొంతైనా తీరుస్తుందని ఆశిస్తున్నాను.

**మూడవది:** ఈ పాఠాలను అందంగా తీర్చిదిద్దటానికి నేను చాలా శ్రద్ధ తీసుకున్నాను. ఉత్తమ సాహితీ సోయగాలను వీటికి అద్దటానికి ప్రయత్నించాను. అందమైన భాషను, ధారాళమైన శైలిని ఇందులో ఉపయోగించాను. దీనికోసం మేము దివ్యఖుర్‌ఆన్ మరియు స్వచ్ఛమైన ప్రవక్త సంప్రదాయ బోధనా విధానాన్ని అందిపుచ్చుకున్నాము. ఖుర్‌ఆన్ హదీసుల్లో జీవజలంలా ప్రవహిస్తున్న భాషా సౌందర్యాన్ని ఈ పుస్తకం రూపకల్పన కోసం పుణికిపుచ్చుకున్నాము. సెలయేటి గట్టున చిన్న పొదరిండ్ల చల్లటి నీడల్లో సేదతీరేటి సత్యానందాన్ని, సాహిత్యానుభూతిని దీని పఠనం చదువరునికి కలిగిస్తుంది. మృదు మధురంగా సాగే పుస్తక పఠనం సంతోష సాగర తీరాలకు చేరుస్తుంది. సాహిత్యానందపు చిరుజల్లులు కురిపిస్తుంది. పుస్తకం చదువుతున్నంత సేపూ ఒక పాఠకుడు తాను చల్లటి నీడల్లో హాయిగా, ఆనందంగా విహరిస్తున్నట్టు గొప్ప అనుభూతిని పొందుతాడు.

దైవప్రవక్త (సఅసం) రమజాన్ నెలపొడుపు చూడగానే, " ఓ నెలవంకా!



సన్మార్గం, శుభాలకు ఆలవాలమా!! నా ప్రభువూ, నీ ప్రభువూ అల్లాహ్‌యే సుమా!!! ఓ ప్రభూ! ఈ చంద్రోదయాన్ని మా కొరకు శాంతికి, సమర్పణకు, రక్షణకు, విశ్వాసానికి సూచనగా చెయ్యి " అని ప్రార్థించేవారు.

నిజంగా రమజాన్ మాసం మనం మరిచిపోలేని మధురమైన రోజులు కదా! ఆ నెలలోని తీపు జ్ఞాపకాలు అల్లాహ్ భక్తులను సంవత్సరమంతా అలరిస్తూనే ఉంటాయి. అది పుణ్యకార్యాలు వెల్లివిరిసే వసంతకాలం. అల్లాహ్ భక్తులకు ఎంతో పసందైన కాలం. వరాలు కురిపించే ఆ కొద్ది కాలం కరిగిపోయిన మరుక్షణం రమజాన్ ప్రియుల్లో దానికోసం మళ్ళీ నిరీక్షణం మొదలవుతుంది. ఎంతో కఠినమైన ఆ నిరీక్షణా ఘడియలు దైవప్రియుల గుండెలకు కాలాన్ని మోసినంత భారం! అందుకే వారికి రమజాన్ నెలమీద చిరుకోపం!

సుదీర్ఘ వియోగానంతరం స్వల్పకాలిక సాక్షాత్కారమే రమజాన్ మాసం. అందుకే అనునిత్యం దైవారాధనా మాధుర్యం కోసం నోరూరే జిహ్వకు రవ్వంత రమజాన్ సంబరం సంతృప్తినివ్వదు. అందుకే రమజాన్ నెల సమీపించినప్పుడు అల్లాహ్ దాసులు దాని పట్ల తమ విరహ బాధను వ్యక్తం చేస్తూ ఈ విధంగా దానికి ఘనస్వాగతాలు చెబుతారు:

రమజాను మాసమా స్వాగతం
రోజాల మాసమా స్వాగతం

ప్రతి సంవత్సరం మమ్ము దర్శించు ప్రియతమా
పొంగిపొరలే ప్రేమతో నిన్ను కలిసేము
పరలోక విజయం ప్రసాదించమని ప్రభువును ప్రార్థించేము

ఓ ప్రభూ! మా ఉపవాసాలను అంగీకరించుము
నీ అనుగ్రహాలను మాపై అధికంగా కురిపించుము

రమజాన్ రాకకై నిరీక్షణ, నిద్రలేమితో బాధపడ్డ మాకు
వరాల మాసాన్ని కర్పూరంలా కరిగించి మరింత కష్టపెట్టకు

ప్రపంచమంతా విస్మయం చెందే వింత! కళ్లు కాయలు చేసుకొని ఎదురు చూసిన ఆ అతిథి రాకతో విశ్వాసుల హృదయ వీధుల్లో ఆనంద తాండవం మొదలవు తుంది. ముస్లింల మనోవనంలో మళ్లీ రమజాన్ మాసపు మధురానుభూతులు మొగ్గలు తొడుగుతాయి. సుదీర్ఘకాలం వర్షానికి నోచుకోక నెర్రలు విచ్చిన నేలపై ఒక్క తొలకరి జల్లుతో పచ్చదనం పురివిప్పినట్టు, పదకొండు మాసాల తర్వాత రమజాన్ నెలలో దైవదాసుని హృదయం శుభాల సరోవరాన్ని ఆస్వాదించి పులకించ పోతుంది. ఆ నెల సాంతం కురిసే కారుణ్య వర్షంలో తడిసి ముద్దయి పోతుంది. రమజాన్ మాసపు శుభాలు మాటల్లో వర్ణించలేనివి. అల్లాహ్ ఈ మాసంలో దాసుల పాపాలను అత్యధికంగా క్షమిస్తాడు.

**రమజాను మాసమా స్వాగతం - రోజాల మాసమా స్వాగతం**
**శుభకరాల మాసమా స్వాగతం - ప్రభువరాల మాసమా స్వాగతం**



పాఠం 1

# దైవప్రవక్త (స) వారి ఉపవాస దివ్యోపదేశాలు

సర్వ స్తోత్రాలూ అల్లాహ్‌కే. ఆయన తన శాంతినీ, అనుగ్రహాలను తన ప్రవక్తపై, ప్రవక్త ఇంటివారలపై, సహచరులపై, విశ్వాసులందరిపై కురిపించాలని మా ప్రార్థన.

ఇబ్నుల్ ఖయ్యిమ్ ఓ గొప్ప ఇస్లామీయ విద్వాంసులు. ఆయన ఓ సందర్భంగా అంటారు, "రమజాన్ నెలలో దైవప్రవక్త (స)వారి ఆదర్శం మనకు పరిపూర్ణ మార్గ దర్శకం. రమజాన్ మాసం తారసిల్లినప్పుడు ప్రజలు పలు రకాల ఆరాధనల్లో నిమగ్నమవటమూ ఆ ఆదర్శంలో అంతర్భాగం. దైవదూత జిబ్రయీల్ (అలైహి) దైవప్రవక్త (స)కు దివ్యఖుర్‌ఆన్ పాఠాలు బోధిస్తూ ఉండినది ఈ నెలలోనే. జిబ్రయీల్‌ను కలిసినప్పుడు ఆయన ప్రభంజనం కంటే అధికంగా ఔదార్యాన్ని ప్రదర్శించేవారని హదీసుల ద్వారా తెలుస్తుంది. సహజంగానే ఆయన చాలా ఉదార స్వభావులు. అయితే రమజాన్ నెల రాగానే ఆయన ఉదారత్వం ఇంకా ఊపందు కునేది. రమజాన్ నెల మొత్తం ఆయన దానధర్మాల్లో, సత్కార్యాలు చేయటంలో, దివ్యఖుర్‌ఆన్ పారాయణంలో, దైవారాధనలో, ధ్యానంలో, ప్రశాంతంగా అల్లాహ్ స్మరణలో గడిపేసేవారు.

రమజాన్ మాసపు ఆరాధన కోసం ఆయన ఇతర నెలల్లో కంటే ఎక్కువ సమ యాన్ని కేటాయించేవారు. రాత్రిళ్ళు ఎక్కువ సేపు ఆరాధనకే ప్రత్యేకించుకునేవారు. ఒక్కోసారి రాత్రంతా అల్లాహ్ ఆరాధనలోనే గడిచిపోయేది. అయితే తన అనుయాయులను మాత్రం ఆయన అంత విపరీతంగా ఆరాధన చేయవద్దని వారించేవారు. "మరి మీరు రాత్రంతా అదే పనిగా ఆరాధన చేస్తూ పోవటం లేదా దైవప్రవక్తా?" అని ఆరాధనా ప్రియులైన సహచరులు సందేహం వెలిబుచ్చితే, "నా శరీరం మీ శరీరాల వంటిది కాదు. నేను నా ప్రభువు సన్నిధిలో ఉంటాను. ఆయనే నాకు భోజనం తినిపిస్తాడు, పానీయమూ త్రాపిస్తాడు" అని ఆప్యాయంగా వారికి బోధించేవారు (ఈ హదీసు బుఖారి, ముస్లిం గ్రంథాలలో ఉంది). దైవప్రవక్త (స)

ఎడతెగకుండా ఉపవాసాలు పాటిస్తున్నప్పుడు అనూహ్యమైన రీతిలో అల్లాహ్ ఆయనకు విజ్ఞానం, వివేకం, దివ్య సందేశ శక్తులు ప్రసాదిస్తూ ఉండేవాడన్నమాట. ఆ శక్తిని ప్రాపంచిక మైన భోజన సామగ్రి లాంటిదని ఊహించుకోనక్కరలేదు. అదే నిజమయితే దాన్ని అసలు ఉపవాసంగా భావించటానికి వీలు ఎక్కడుంటుంది?

ప్రవక్త (స) నిత్యం తమ ప్రభువు ఆరాధన పట్ల సంతుష్టులై ఉండేవారు. ఆయన హృదయ ద్వారాలు అంతిమ లక్ష్యం నిమిత్తం బార్లా తెరుచుకొని ఉండేవి. ప్రభువు ధ్యానంలో ఆయన మనసు పరిపూర్ణ విశ్రాంతిని, సంతృప్తిని పొంద గలిగేది. ప్రభువు సామీప్యం మూలంగా ఆయన మానసిక స్థితిగతులు అత్యుత్తమంగా ఉన్నప్పుడు, ఇక ఆయన అన్నపానీయాలు మరిచి పోయేవారు. వాస్తవానికి ఆధ్యాత్మిక శక్తి మనిషిలో అంతర్గతమైన ఆత్మబలం మీద ఆధారపడి ఉంటుంది. ఈ శక్తి భోజన పానీయాలతో నిమిత్తమయినది కాదు. ఆ శక్తితో ప్రభువు జ్ఞానాన్ని చేరుకున్న మనిషికి ప్రపంచంలోని ఏ వస్తువూ హాని కలిగించజాలదు.

అల్లాహ్‌ను ధ్యానించే, ఆయన్ను ఆరాధించేవారందరిలో కెల్లా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యుత్తములు. దైవారాధన, దైవధ్యానం, దివ్యఖుర్ఆన్ పారాయణం విస్తృతంగా జరిగే శుభప్రదమైన మాసం రమజాన్. అందుకే దైవప్రవక్త (స) ఈ మాసంలో రాత్రులు అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, అల్లాహ్ పట్ల అత్యంత అణకువను కనబరుస్తూ గడిపేవారు. ఆయన సహాయాన్ని, తోడ్పాటును, విజయాన్ని, సన్మార్గాన్ని ప్రసాదించమని కడు దీనంగా వేడుకునేవారు. నమాజులో దివ్యఖుర్ఆన్ లోని సుదీర్ఘమైన అధ్యాయాలను పారాయణం చేస్తూ గంటల తరబడి అలాగే నిలుచొని ఉండేవారు. ఎంతో సేపు 'రుకూ' స్థితిలో వంగి ఉండేవారు. అల్లాహ్ సమక్షంలో మోకరిల్లి (సజ్దా చేసి), అదే స్థితిలో చాలాసేపు ఉండేవారు. ఆయనలో అల్లాహ్ ఆరాధన పట్ల కాంక్ష ఎంతో బలంగా ఉండేది. రాత్రి పూట ఆరాధనలో ఎంత ఎక్కువ సేపు నిలబడితే ఆయనకు అంత ఎక్కువ ఆత్మ బలం, ఆధ్యాత్మిక శక్తి ఒనగూరుతూ ఉండేవి. సర్వశక్తిమాన్యుడైన అల్లాహ్ ఆయన్ను సంబోధిస్తూ దివ్య ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా అన్నాడు:

**"ఓ వస్త్రమును కప్పుకున్నవాడా? కొద్దిసేపు మినహా రాత్రంతా (నమాజులో) నిలబడు." (ఖుర్ఆన్ 73 : 1)**



మరోచోట అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"రాత్రిపూట కొంతభాగం తహజ్జుద్ (నమాజు)లో ఖుర్ఆన్ పఠనం చెయ్యి. ఇది నీ కొరకు అదనం. త్వరలోనే నీ ప్రభువు నిన్ను "మఖామె మహ్మూద్"కు (ప్రశంసాత్మకమైన స్థానానికి) చేరుస్తాడు." (ఖుర్ఆన్ 17: 79)**

ఉపవాస దినాలలోనూ దైవప్రవక్త (స) ఇస్లాం ధర్మ వ్యాప్తి కోసం కృషి చేస్తుండే వారు. ఉపవాసం ఉంటూనే అల్లాహ్ ధర్మోన్నతి కోసం పోరాడుతూ (జిహాద్ చేస్తూ) ఉండేవారు. ఉపవాస రోజుల్లోనే తన సహచరులకు శిక్షణా తరగతులు నిర్వహించే వారు. ధర్మబోధనలు చేస్తుండేవారు. ఏదైనా లక్ష్యాన్ని గురిపెట్టుకొని దాన్ని సాధించాలనే ఉద్దేశం లేకుండా దైవప్రవక్త (స) రమజాన్ మాసపు ఉపవాసాలు మొదలు పెట్టకపోవటం ఆయన ఆచరణల్లో ఒకటి. రమజాన్‌లో ప్రతి రోజూ ఉషోదయానికి ముందే సహరీ ఆహారం తీసుకోవాలని ఆయన తన అనుచరులను ప్రోత్సహిస్తుండే వారు. సత్యమని ధృవీకరించబడిన ఒక హదీసు ప్రకారం ఆయన తన సహచరులకు ఇలా ప్రబోధించారు:

**"ఉషోదయానికి ముందే భోజనం ఆరగించండి. నిశ్చయంగా ఆ వేళలో (మీ కొరకు) శుభం ఉంది." (ఖుర్ఆన్)**

ఉషోదయానికి ముందు ఉండే సమయాన్ని శుభప్రదమైనదిగా పేర్కొనటం జరిగింది. ఎందుకో తెలుసా? అది రాత్రిలో చివరి మూడో వంతు సమయం. అల్లాహ్ మొదటి ఆకాశానికి దిగివచ్చే సమయం. ఆయన తన దాసులకు క్షమాభిక్ష పెట్టే సమయం అది. దివ్య ఖుర్ఆన్‌లో ఒకచోట ఇలా అనబడింది:

**"వారు రాత్రి చివరి ఘడియలలో క్షమాపణకై (అల్లాహ్‌ను) వేడుకుంటూ ఉంటారు." (ఖుర్ఆన్ 51 : 18)**

మరోచోట ఇలా చెప్పబడింది:

**"వారు ఓర్పు వహిస్తారు, సదా సత్యమే పలుకుతారు. విధేయత చూపుతారు. దైవమార్గంలో ఖర్చుచేస్తారు. రాత్రి చివరి భాగంలో క్షమాభిక్షకై వేడు కుంటారు." (ఖుర్ఆన్ 3:17)**

అంతేకాదు, ఉపవాసం ప్రారంభించే ఉద్దేశంతో ఉషోదయానికి ముందు భుజించే ఆహారం వల్ల మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పగటిపూట విశ్వాసికి దాని

వల్ల ఒంట్లో సత్తువ క్షీణించకుండా ఉంటుంది. దాంతో పగలు దైవారాధన చేసుకోవటానికి చాలా అనుకూలంగా ఉంటుంది.

అలాగే స్థిరమైన వాస్తవం మరొకటుంది. దైవప్రవక్త (స) పగలంతా ఉపవాసం పాటించినప్పటికీ సాయంత్రం సూర్యాస్తమయం అయిన వెంటనే ఆయన ఆహారం తీసుకోవటంలో త్వరపడేవారు. ఈ పద్ధతిని పాటించమని ఆయన తన అనుయాయులకూ ఆదేశించి ఉన్నారు. ఖాళీగా ఉండే కడుపు ఏదైనా తీపి పదార్థాన్ని తొందరగా గ్రహిస్తుంది. అందుకని సాధారణంగా ఆయన ఉపవాస విరమణ కోసం కొన్ని ఖర్జూర పండ్లు, కాసిన్ని నీళ్ళు ఉపయోగించేవారు. పలు ఉల్లేఖనాలు దైవప్రవక్త (స) ఇలా ప్రవచించినట్టు తెలుపుతున్నాయి:

**“నిశ్చయంగా ఉపవాసి చేసే ప్రార్థన తిరస్కరించబడదు.”**

అందుకని ఉపవాస సమయంలో ఆయన ఇహలోకంలోనూ, పరలోకంలోనూ తనకు శుభం ప్రాప్తించాలని ప్రార్థిస్తూ ఉండేవారు. సూర్యాస్తమయం అయిన వెంటనే మగ్రిబ్ నమాజు ఆచరించబడుతుంది కదా! ఆ నమాజుకు ముందే ఆయన ఉపవాస దీక్షను విరమించేవారు. సత్యమని ధృవీకరించబడిన ఒక హదీసు ప్రకారం, “ ఈ దిశ నుంచి రాత్రి ప్రవేశించి ఆ దిశ నుండి అది నిష్క్రమిస్తే ఇక ఉపవాసి తన దీక్షను విరమించాలి ” అని ఆయన ప్రబోధిస్తుండేవారు.

ముహమ్మద్ ప్రవక్త (స) రమజాన్ నెలలోనూ ప్రయాణాలు చేసేవారు. ఈ కాలంలో ఆయన కొన్ని సార్లు ఉపవాసాలు ఉండేవారు. మరికొన్ని సార్లు ఉపవాసాలు విడిచిపెట్టేవారు. ప్రయాణకాలంలో ఉపవాసం ఉన్నా లేకున్నా అది తమ ఇష్టమని దైవప్రవక్త (స) తన సహచరులకు బోధించేవారు. అయితే యుద్ధ సమయాల్లో శత్రువులతో తలపడటానికి శక్తి కావాలి కాబట్టి అటువంటి పరిస్థితుల్లో ఉపవాసాన్ని విరమించాలని ఆయన వారికి ఆదేశించేవారు. ‘బద్ర్’ మహాపోరాటం జరిగింది రమజాన్ నెలలోనే! ఈ పోరాటంలో ముస్లింలకు అల్లాహ్ నిరుపమానమైన విజయాన్ని చేకూర్చిపెట్టాడు. అయితే ఖత్తాబ్ కుమారులు ఉమర్ (రజి) చెప్పిన ప్రకారం దైవప్రవక్త (స) రెండు యుద్ధాల్లో ఉపవాసం ప్రారంభించారు, కాని తర్వాత దానిని మధ్యలోనే విరమించేసుకున్నారు. తిర్మిజీ, అహ్మద్ గ్రంథకర్తలు ఈ హదీసును తమ గ్రంథాల్లో క్రోడీకరించారు. ఎంత దూరం ప్రయాణం చేసినప్పుడు ఉపవాసం వదలివేయవచ్చు అనే విషయం మాత్రం నిర్ధారణ కాలేదు. దీని గురించి ప్రామాణికమైన ఆధారాలు కూడా ఏమీ లేవు.



కొన్నిసార్లు దైవప్రవక్త (స) సంభోగానంతరం అశుద్ధావస్థలో ఉండేవారు. అదే సమయంలో ఫజ్ర్ నమాజుకు వేళ అయ్యేది. అటువంటి పరిస్థితిలో ఆయన షరీఅత్‌బద్ధంగా స్నానం చేసి పరిశుద్ధులై ఉపవాస దీక్షను ప్రారంభించేవారు. దైవప్రవక్త జీవితంలో ఇలాంటి సంఘటనలు కూడా జరిగివున్నాయి. కొన్ని సమయాల్లో ‘రమజాన్’ ఉపవాసం పాటిస్తూ ఆయన తన భార్యను ముద్దు పెట్టుకున్నట్టు కూడా తెలుస్తోంది. ఉపవాస స్థితిలో నీళ్లు త్రాగకూడదు, కాని నోరు పుక్కిలించటానికి అనుమతి ఉంది కదా! అలాగే ఉపవాస స్థితిలో భార్యను ముద్దుపెట్టుకోవటంలోనూ తప్పు లేదని సోదాహరణంగా చెబుతుండేవారాయన.

ఒక వ్యక్తి నిజంగా మతి మరుపుకు లోనై తన ఉపవాసాన్ని విరమించుకున్నట్లయితే అతను మళ్ళీ ఆ ఉపవాసాన్ని పూర్తి చేయవలసిన అవసరం ఉండదని, అసలు అటువంటి పరిస్థితిలో ఉపవాస దీక్ష భగ్నమే కాదని, నిజానికి అల్లాహ్ స్వయంగా ఆ వ్యక్తికి తినిపించాడని, త్రాపించాడని దైవప్రవక్త (స) తీర్మానం చేశారు. ఉపవాస సమయంలో తినటం, త్రాగటం, కావాలని వాంతి చేసుకోవటం వల్ల ఉపవాస దీక్ష విరమించబడుతుందని ప్రవక్త ప్రవచనాలు మనకు ప్రబోధిస్తున్నాయి. అన్నపానీయాలు ఉపవాస దీక్షను నిర్వీర్యం చేసినట్లే భార్యతో సంభోగం కూడా ఉపవాస దీక్షను భగ్నం చేస్తుందని దివ్య ఖుర్‌ఆన్ ద్వారా మనకు స్పష్టమయింది.

రమజాన్ నెల చివరి పదిరోజులు ఏకాంత ధ్యానం (ఏతికాఫ్)లో, దైవారాధనలో గడపటం కూడా దైవప్రవక్త (స) వారి ఆచరణల్లో ముఖ్యమైనది. ఐహిక ఆసక్తులను విస్మరించి పూర్తిగా పది రోజుల పాటు నిరంతర ఆరాధనలతో తన అంతరాన్ని అల్లాహ్ ఆరాధనలో నిలిపి ఉంచటానికి ఆయన ఈ దీక్షకు ఉపక్రమించేవారు. ఈ సమయంలో ఆయన గారి మనోమయ జగత్తు సర్వం స్వర్గసాధనా కాంక్షతో నిండి ఉండేది. ఈ పది రోజులూ ఆయన ప్రజలతో సంబంధాలు తగ్గించుకునేవారు. ఎక్కువ సమయం అల్లాహ్ ఆరాధనలోనే వెచ్చించేవారు. ఎల్లప్పుడూ ప్రత్యేక ప్రార్థనల్లో, ఆరాధనల్లో నిమగ్నులై ఉండేవారు. ఆయన హృదయం అన్ని వేళలా ప్రభువు గుణగణాలను, విశేష లక్షణాలను ప్రస్తుతించటంలో లీనమై ఉండేది. ప్రస్ఫుటమైన అల్లాహ్ చిహ్నాలను, ఆయన సృష్టించిన ఈ అనంత విశ్వాన్ని, భూమ్యాకాశాలలో ఆయన ఉంచిన వింతలనూ, విశేషాలనూ గుర్తు చేసుకుంటూ ఉండేది. ఈ విధంగా ఆయన ఎంత జ్ఞాన సముపార్జన చేశారో, ఆయనకు ఎంత జ్ఞాన జ్యోతి ప్రసాదించ బడిందో, సృష్టికి సంబంధించిన ఎన్ని నిజాలు ఆయన

హృదయ సీమలో ఆవిష్కృతం అయి ఉంటాయో నిర్ణయించటం కష్టమే. సృష్టిలో అల్లాహ్‌ను అత్యధికంగా ఎరిగిన వ్యక్తి, అల్లాహ్ పట్ల నిరుపమాన భయభక్తులు గలిగిన వ్యక్తి, అల్లాహ్‌నే నమ్ముకొని, ఆయనపైనే ఆధారపడి జీవించిన వారందరిలోకెల్లా ఉత్తముడైన వ్యక్తి ముహమ్మద్ (స) ఒక్కరే అన్న నిజాన్ని పై సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. మనుషుల్లో మహామనీషి ఆయన. అల్లాహ్ మార్గం కోసం తన సర్వస్వాన్ని అర్పించిన ఘనుడు, త్యాగధనుడు.

అందుకే,

కస్తూరి తన సువాసనలు వెదజల్లుతూ ఉన్నంత కాలం, కపోతాల కూని రాగాలు ప్రతిధ్వనిస్తూ ఉన్నంతకాలం, కోయిల తన పాటలు ఆలాపిస్తూ ఉన్నంత కాలం అల్లాహ్ తన శాంతీకారుణ్యాలు ప్రవక్త ముహమ్మద్ (స)పై కురిపిస్తూ ఉండాలని వినయ పూర్వకంగా మా ప్రార్థన.



పాఠం 2

# రమజాన్ ఉపవాసాల్లోని మర్మం

అల్లాహ్ తన దాసుల కోసం విధించే చట్టాలలో ఎన్నో మర్మాలుంటాయి. ఆయన చేసే నిర్ణయాల్లో ఎన్నో రహస్యాలు నర్మగర్భితంగా నెలకొని ఉంటాయి. ఆయన సృష్టిలో లెక్కలేనన్ని లక్ష్యాలు ఇమిడి ఉన్నాయి. ఈ మర్మాలు, రహస్యాలు, లక్ష్యాలలో కొన్నిటిని మానవ మెదడు అర్థం చేసుకోవచ్చు, మరికొన్నిటిని అర్థం చేసుకోలేక పోవచ్చు. ఉపవాసం విషయానికి వస్తే దాని గురించి అల్లాహ్ నిర్ణయం ఇలా ఉంది:

**"ఓ విశ్వసించినవారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించ బడింది-మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది."**

***(ఖుర్‌ఆన్ 2 : 183)***

దీని ప్రకారం ఉపవాసం అనేది దైవభీతికి, ధర్మపరాయణతకు దారితీస్తుందని తెలుస్తోంది. ఉపవాసం పాటించే వ్యక్తి అల్లాహ్‌కు అత్యంత సన్నిహితుడౌతాడని కూడా చెప్పవచ్చు. ఉపవాస స్థితిలో మనిషి కడుపు ఆకలితో నకనకలాడిపోవచ్చు. అయితే దాంతోపాటు అతని హృదయమూ పరిశుద్ధమవుతుంది. సాయంత్రం పూట దాహం తీర్చుకొని ఉపవాసం విరమించినప్పుడు అతని కండ్లు చెమ్మగిల్లుతాయి. ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "ఓ యువకుల్లారా! మీలో మహర్ సొమ్ము చెల్లించగల స్తోమత వున్నవారు వివాహం చేసుకోవాలి. ఎందుకంటే, చూపులనూ, మర్మావయవాలను కాపాడుకోవటానికి అన్నింటికంటే ఉత్తమమైన మార్గం అదే. అలా చేసే స్తోమత లేనివారు ఉపవాసం పాటించాలి. అది అతని కొరకు డాలు లాగా పనిచేస్తుంది."

ఉపవాసం శరీరంలోని అన్నవాహికను, ధమనులను సంకోచింపజేస్తుంది. ఇవి షైతాన్ ప్రసార మార్గాలుగా ప్రసిద్ధం. ఏమైనప్పటికీ ఉపవాసం ఈ మార్గాల్లో షైతాన్ దౌష్ట్యాలను అరికడుతుంది. అలాగే ఉపవాసం లైంగిక కోరికలను,

ఆలోచనలనూ, అవిధేయతా ప్రోత్సాహకాలను బలహీనపరుస్తుంది. 'ఆత్మ' భారాన్ని తగ్గించి అందులో చురుకుదనం తీసుకువస్తుంది. ఒక ఉపవాసి తన లాగే ఉపవాసం పాటించే తోటి సామాజిక సోదరుల గురించి ఆలోచిస్తాడు. తన చుట్టూ బ్రతికే నిరుపేదలనూ, అవసరాల్లో అలమటిస్తున్న వారిని గుర్తిస్తాడు. వారికి తన సానుభూతిని ప్రకటిస్తాడు. తనకు చేతనయినంత వరకు వారికి సాయం చేయటానికి ముందుకు వస్తాడు.

ఉపవాసాన్ని ఓ శిక్షణాకాలంగా కూడా భావించవచ్చు. ఈ కాలంలో ఆత్మకు బలమైన శిక్షణ లభిస్తుంది. హృదయం పరిశుద్ధమవుతుంది. చూపులకు బిడియం అలవడుతుంది. అవయవాలు సురక్షితమవుతాయి. ఉపవాసం అనేది దాసునికి – అల్లాహ్‌కు మధ్య నర్మగర్భంగా ఉండే ఒక రహస్యం. ధృవీకృత హదీసు ఒకటి ఈ విషయాన్ని దైవప్రవక్త మాటల్లో ఇలా ప్రస్ఫుటం చేసింది:

**"అల్లాహ్ ప్రకటించాడు: మనిషి చేసే ప్రతి సత్కార్యం అతని సొంతానిదే, ఒక్క ఉపవాసం తప్ప. అది నాది. నేనే దానికి ప్రతిఫలం ప్రసాదిస్తాను."**

మనిషి ఉపవాసం పాటిస్తున్న సంగతిని ఒక్క అల్లాహ్ తప్ప మరెవరూ అర్థం చేసుకోలేరు. నమాజు, జకాతు, హజ్ లాంటి ఇతర ఆరాధనల కంటే ఇది పూర్తిగా విభిన్నం. వాటిని పాటిస్తున్నప్పుడు జనం చూసి వారిని ఆరాధనపరులుగా గుర్తించగలరు. కాని ఉపవాసం పాటిస్తున్న వ్యక్తిని చూసి అతను ఉపవాసి అని తెలుసుకోవటం అసంభవం. అంతటి రహస్యమైన ఆరాధన అది. అందుకే అల్లాహ్‌కూ అది ఎంతో ప్రీతికరం.

ఉపవాసం మనిషిని అల్లాహ్ సామీప్యానికి తీసుకువెళ్తుందని సదాచార సంపన్నులైన మన పూర్వీకులు వక్కాణించారు. పుణ్యకార్యాలు జుగ్రుకునే పవిత్ర మాసంగా, సత్కార్యాల కోసం పరస్పరం పోటీపడే సువర్ణ సమయంగా ఈ నెలను భావిస్తారు చాలామంది. అందుకే రమజాన్ నెల వచ్చిందంటే చాలు వారు సంతోషంతో కేరింతలు కొడతారు. అది వెళ్ళిపోగానే దిగాలు చెందుతారు. మన పూర్వీకులు ఉపవాసపు పరమార్థాన్ని గ్రహించారు. అందుకనే రమజాన్ నెల అంటే వారికి అమితమైన ప్రేమ. రమజాన్‌లో వారు మునుపెన్నడూ లేని రీతిలో ఆరాధన చేసేవారు. నిరుపమాన త్యాగభావాన్ని కనబరిచేవారు. రాత్రిళ్లు ఎప్పుడూ నమాజులో నిలబడి ఉండేవారు. రుకూలో వంగి వుండేవారు. అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేస్తూ కనిపించేవారు. అల్లాహ్ జ్ఞాపకంలో కన్నీరు మున్నీరయ్యేవారు. అత్యంత అణకువతో అల్లాహ్‌ను ప్రార్థించేవారు. అల్లాహ్ ధ్యానం, దైవగ్రంథ పారాయణం, ధర్మజ్ఞాన సముపార్జన, ధర్మబోధన, పరస్పర హితోపదేశం – శుభప్రదమైన రమజాన్ మాసంలో ఇవే వారి నిత్య కృత్యాలు.



ప్రారంభకాలంలోని ముస్లింలకు ఉపవాసం ఆనందాన్ని, ఆత్మశాంతిని సమకూర్చేది. ఉపవాసంతో వారి హృదయాలు మరింత విశాలమయ్యేవి. అందుకనే ఉపవాస లక్ష్యాలకు అనుగుణంగా వారు తమ ఆత్మలకు శిక్షణనిచ్చుకునేవారు. ఉపవాసం ద్వారా పొందే జ్ఞానంతో తమ హృదయాలను పరిశుద్ధపరచుకునేవారు. తమ నోళ్ళనూ, కళ్ళనూ పాపకార్యాల నుంచి పరిరక్షించుకుంటూ ఉండేవారు. దైవగ్రంథ పారాయణం చేస్తూ కన్నీరు మున్నీరుగా విలపించేవారు. విశ్వసనీయమైన ఎన్నో ఆధారాల ద్వారా స్పష్టంగా ఈ విషయాలు తెలుస్తున్నాయి.

ఉపవాసం ముస్లింల ఐకమత్యానికి పట్టుగొమ్మలా పరిఢవిల్లుతుంది. ప్రపంచంలోని ముస్లింలంతా ఒకే సమయంలో ఉపవాసం ప్రారంభించి, తిరిగి ఒకే సమయంలో ఉపవాసాన్ని విరమించటం అందుకు ఓ సజీవ సాక్ష్యం. ఉపవాస కాలంలో సామాన్యంగా అందరూ సోదరభావంతో కలసి భోజనం చేస్తారు. చెడు పోకడలనూ, దుష్కార్యాలను ఉపవాసం కడిగివేస్తుంది. దీని గురించే ప్రవక్త (సఅసం) అన్నారు: "ఒక శుక్రవారం (జుమా) నుంచి మరో శుక్రవారం, ఒక ఉమ్రా నుంచి మరో ఉమ్రా, ఒక రమజాన్ నుంచి మరో రమజాన్ వాటి మధ్య జరిగే పాపాలకు పరిహారం అవుతుంది. అయితే ఆ మధ్యకాలంలో పెద్దపాపాల (కబాయిర్)కు పాల్పడి ఉండకూడదు."

ఇక శారీరకంగా చూస్తే, ఉపవాసం దేహ ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. శరీరం నుంచి మలినాలను విసర్జింపజేస్తుంది. కడుపును సాంత్వన పరుస్తుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. గుండెకు నెమ్మదినిస్తుంది. ఆత్మను ఉత్తేజపరుస్తుంది. నడవడికను క్రమబద్ధం చేస్తుంది. ఉపవాసం పాటించే వ్యక్తి ఆత్మ వినమ్రమవుతుంది. మనసు ప్రశాంతమవుతుంది. కోరికలకు కళ్ళెం పడుతుంది. అతని హృదయం అల్లాహ్ సామీప్యతను సంపాదిస్తుంది. ఫలితంగా అల్లాహ్ అతని ప్రార్థనలను నెరవేరుస్తాడు.

ఉపవాసంలో మరో గొప్ప మర్మం దాగి ఉంది. అదేమంటే, దాసుడు అల్లాహ్ సంతోషం కోసం ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తాడు. అల్లాహ్ ప్రీతికోసం తన

కోరికలను త్యజించుకుంటాడు. అన్నపానీయాలు మానేస్తాడు. ఉపవాసం మూలంగా ఒక ముస్లిం కోరికలను జయించగలుగుతాడు. మనసుపై అదుపు సాధిస్తాడు. అసలు సగం ఓపిక ఉపవాసమే. కనుక సరైన కారణం లేకుండా ఉపవాసం వదలిపెట్టే వ్యక్తికి తన మనసుపై అదుపు ఉండదు. అతను కోరికలను జయించలేడు.

మొత్తానికి జీవితంలో కష్టాలను భరించటానికి, జిహాద్, త్యాగం లాంటి కఠోర ధర్మ విధులను నిర్వర్తించటానికి కావలసిన నైతిక శక్తిని, బలాన్ని సాధించి పెట్టేది, అందుకు తగ్గట్టు క్రమశిక్షణను ఇచ్చేదే ఉపవాసం. పూర్వం తాలూత్ అనే రాజు శత్రువులతో యుద్ధం చేయటానికి సైన్యంతో బయలుదేరాడు. ఆ సమయంలో అతని సైన్యాన్ని అల్లాహ్ ఒక నది ద్వారా పరీక్షించిన సంఘటన చాలా ఆసక్తికరంగా ఉంటుంది. నది ఎదురైనప్పుడు తాలూత్ తన సైనికులతో ఇలా అన్నాడు:

**తాలూత్ సైన్యాన్ని తీసుకుని బయలుదేరినప్పుడు ఇలా ప్రకటించాడు : "చూడండి! అల్లాహ్ మిమ్మల్ని ఒక కాలువ ద్వారా పరీక్షించబోతున్నాడు. అందు లోని నీళ్ళను త్రాగినవాడు నా వాడు కాడు. త్రాగనివాడు మాత్రమే నా వాడు. చేత్తో గుక్కెడు నీరు తీసుకుని త్రాగితే ఫరవాలేదు." కాని కొద్ది మంది తప్ప మిగిలిన వారంతా ఆ నీళ్ళను (కడుపునిండా) త్రాగేశారు.**

***(ఖుర్ఆన్ 2 : 249)***

సహనం కలిగివుండేవారు, కోరికలను అదుపులో పెట్టుకునే వారు మాత్రమే విజయం సాధించగలుగుతారు. దీనికి పూర్తి భిన్నంగా మనోవాంఛలకు బానిసలయ్యే వారు జీవనపోరాటంలో వెన్నుచూపి పారిపోతారు.

### ఉపవాస సారాన్ని మనం ఇలా క్లుప్తీకరించుకోవచ్చు

ఉపవాసం మనిషిలో దైవభీతిని కలుగుజేస్తుంది. అల్లాహ్‌కు వినమ్రునిగా మారుస్తుంది. కోరికలకు కళ్ళెం వేస్తుంది. ఉపవాసం ఉండే మనిషికి మనసు మీద నియంత్రణ సులువు అవుతుంది. త్యాగనిరతిని పెంపొందింపజేస్తుంది. అవయవాల మీదే కాక అంతరంగంపై కూడా మనిషికి అదుపు లభిస్తుంది. మంచి ఆరోగ్యాన్నిస్తుంది. పాపాలను తుడిచిపెట్టేస్తుంది. ముస్లింలలో సాంఘిక చైతన్యం అభివృద్ధి చెందుతుంది. సోదరభావం పెంపొందుతుంది. ఆకలిగొన్న వారిపట్ల, అవసరాల్లో ఉన్నవారి పట్ల దయాభావం జాగృతమవుతుంది.



## పాఠం 3

# దైవగ్రంథం ఖుర్ఆన్ దివ్య మాసం రమజాన్

దివ్యఖుర్ఆన్ రమజాన్ మాసాన్ని ప్రేమిస్తుంది. రమజాన్ మాసం దివ్య ఖుర్ఆన్‌ను అభిమానిస్తుంది. ఈ రెండిటిదీ ఆత్మీయబంధం. అల్లాహ్ ఇలా ప్రబోధించాడు:

**రమజాను నెల -ఖుర్ఆన్ అవతరింపజేయబడిన నెల. అది మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి. కనుక మీలో ఎవరు ఈ నెలను చూస్తారో వారు ఉపవాసాలుండాలి. (ఖుర్ఆన్ 2 : 185)**

"లౌహె మహ్‌ఫూజ్" అనబడే సురక్షిత ఫలకంలో నుండి దివ్యఖుర్ఆన్ మొత్తం భూమిపై గల మొదటి ఆకాశంపైకి ఈ నెలలోనే అవతరింపజేయబడింది. దివ్య ఖుర్ఆన్ అవతరించటం ఈ నెలకు దైవికంగా ప్రాప్తించిన ఒక మహా గౌరవం. అందుకే దైవప్రవక్త (స) ప్రత్యేకించి రమజాన్ నెలలో జిబ్రయీల్ దూతతో కలిసి ఖుర్ఆన్ అధ్యయనం చేసేవారు. ఆయన ఖుర్ఆన్ శ్రద్ధగా ఆలకించేవారు. దాని భావం గురించి యోచించేవారు. పారాయణం చేసేవారు. దాని పిలుపులకు స్పందించే వారు.

రమజాన్ నెలలో ఉపవాసం పాటిస్తూ ఖుర్ఆన్ పారాయణం చేసే వ్యక్తి ఆ నెల సాంతం మహోన్నతమైన గ్రంథంతోపాటు జీవిస్తాడు. ఆ గ్రంథ ఔన్నత్యం గురించి అల్లాహ్ ఇలా ప్రకటించాడు:

**"ఇదొక శుభప్రదమైన గ్రంథం. ప్రజలు దీని వాక్యాలపై చింతన చేసేటందుకు, బుద్ధిజీవులు దీని ద్వారా గుణపాఠం నేర్చు కునేందుకు మేము దీనిని నీ వైపుకు పంపాము." (ఖుర్ఆన్ 38 :29)**

**"ఏమిటి, వారు ఖుర్ఆన్ గురించి లోతుగా ఆలోచించరా? లేక వారి హృదయాలపై తాళాలు పడి ఉన్నాయా?" (ఖుర్ఆన్ 47 : 24)**

**"ఏమిటీ, వారు ఖుర్‌ఆన్ గురించి యోచన చేయరా? ఒకవేళ ఇది గనక అల్లాహ్ తరపు నుంచిగాక ఇంకొకరి తరపు నుంచి వచ్చి ఉంటే అందులో వారికి ఎంతో వైరుధ్యం కనపడేది." (ఖుర్‌ఆన్ 4 : 82)**

రమజాన్ నెలలో ఖుర్‌ఆన్ పారాయణానికి ఉండే ఆ రుచి, ఆ మాధుర్యమే వేరు! ఆ నెలలో ఖుర్‌ఆన్ పారాయణం మనిషిలో నూతనోత్తేజాన్ని నింపుతుంది. మౌఢ్యం కాని విశ్వాసాన్ని అతనిలో జాగృతపరుస్తుంది. అంతేకాదు, పారాయణ కర్తకు వినూత్న శక్తిని ప్రసాదిస్తుంది. ఇస్లాం ప్రారంభంలో ఖుర్‌ఆన్ అవతరణకు సంబంధించిన సర్వ స్మృతులనూ అది జ్ఞాపకంలోకి తెస్తుంది. సామూహికంగా ఖుర్‌ఆన్ పారాయణం చేసిన సంఘటనలు, సదాచార సంపన్నులైన మన పూర్వీకులు ఖుర్‌ఆన్ పట్ల ఆకర్షితులై, దాని పారాయణం కోసం అత్యధిక సమయాన్ని వినియోగించటం మొదలగు తీపి జ్ఞాపకాలన్నీ కూడా మన మనోసీమలో మెదలుతాయి. దైవప్రవక్త (స) ఒకసారి తన సహచరులకు ఉపదేశిస్తూ, "ఖుర్‌ఆన్ పఠించండి. నిశ్చయంగా అది రేపు తీర్పు దినాన దైవసన్నిధిలో మీకోసం సిఫారసు చేస్తుంది" అన్నారు. "ఖుర్‌ఆన్ నేర్చుకొని ఇతరులకు నేర్పించేవారు మీలో అందరికంటే ఉత్తములు" అని కూడా ప్రవక్త (స) ప్రబోధించి ఉన్నారు. "అల్ బఖర మరియు ఆలి ఇమ్రాన్ అనే పుష్పద్వయాన్ని పారాయణం చేస్తూ ఉండండి. తీర్పు దినాన అవి రెండు మేఘాల రూపంలోనో లేక పక్షుల గుంపు రూపంలోనో వచ్చి తమ చదువరులకు నీడను కల్పిస్తాయి" అన్న మాట కూడా దైవప్రవక్త (స) ప్రబోధించినదే.

ఆయన ఇంకా ఇలా ప్రబోధించారు: "ఖుర్‌ఆన్ పండితుడై ఉండి దాన్ని పఠించే వ్యక్తి (తీర్పుదినాన) గౌరవనీయులు, పుణ్యాత్ములైన దైవదూతల వెంట ఉంటాడు. ఖుర్‌ఆన్‌ను పఠించటంలో తడబడుతూ, శ్రమకోర్చి పారాయణం చేసేవాడు రెట్టింపు పుణ్యాన్ని పొందుతాడు."

రమజాన్ నెల రాగానే మన పూర్వీకులు ప్రాపంచిక వ్యవహారాలన్నిటిని ప్రక్కకు నెట్టి ఖుర్‌ఆన్ పారాయణంతోపాటు ఆధ్యాత్మిక ప్రయాణానికి సంసిద్ధులయ్యే వారు. రమజాన్ రాకతో ఇమామ్ మాలిక్ ఒక్క ఖుర్‌ఆన్ పారాయణం తప్ప ఇతర ఏ విషయానికీ ప్రాముఖ్యత ఇచ్చేవారు కాదని చారిత్రక ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. విద్యార్థులకు ఖుర్‌ఆన్ హదీసులు బోధించటం, ఇస్లామీయ చట్టపరమైన విషయాల్లో ప్రజలకు సలహాసహకారాలు అందించటం సాధారణ రోజుల్లో ఆయన నిత్యకృత్యాలు.



అయితే రమజాన్ నెల వస్తే చాలు ఆయన ఈ పనులన్నీ పక్కన పెట్టేసి ఒక్క ఖుర్‌ఆన్ పారాయణంలోనే నిమగ్నులయి ఉండేవారు. రమజాన్ అంటే ఖుర్‌ఆన్ మాసమని చెబుతుండేవారు. ఒక్క ఇమామ్ మాలిక్ అనే కాదు, రమజాన్ నెలలో మన పూర్వీకులందరి ఇండ్ల నుంచీ తేనెటీగలు పాడుతున్నట్టు కమ్మని ఖుర్‌ఆన్ పారాయణం వినిపిస్తూ ఉండేది. ఉపవాసపు నెలసాంతం వారి ఇండ్లు ఖుర్‌ఆన్ పారాయణపు నవకాంతుల్ని వెదజల్లుతూ ప్రజల గుండెల్లో నూతన ఆనందాల్ని నింపుతూ ఉండేవి. కమ్మటి స్వరాలతో వారు ఖుర్‌ఆన్‌ను మధురాతి మధురంగా పారాయణం చేసేవారు. అందులోని వింత విషయాల వద్ద ఆగి విస్మయం వెలిబుచ్చేవారు. శిక్షకు సంబంధించిన హెచ్చరికలు వినగానే వణకిపోయేవారు. నరకం గురించి తెలుసుకొని కన్నీరుమున్నీరుగా విలపించేవారు. స్వర్గ ప్రస్తావనలు వస్తే అమితానందాన్ని వ్యక్తపరిచేవారు. ఆదేశాత్మక వాక్యాలు పఠించినప్పుడు వాటిని పాటించాలని మనసులో గట్టిగా నిశ్చయించుకునేవారు. వారింపు విషయాలకు దూరంగా ఉంటామని ప్రతినబూనేవారు.

ఇది సత్యమని ధృవీకరించబడిన విషయం. ఒకసారి ఇబ్నె మస్‌వూద్ (రజి) దైవప్రవక్త (స) ముందు నిసా అధ్యాయంలోని మొదటి భాగం పారాయణం చేస్తున్నారు. అలా పఠిస్తూ పఠిస్తూ ఆయన, "ఓ ముహమ్మద్ (స)! మేము ప్రతి సమాజం నుంచి ఒక సాక్షిని తెచ్చి, వారిపై నిన్ను సాక్షిగా పెట్టినప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంది?" అనే వాక్యం దగ్గరికి వచ్చేసరికి దైవప్రవక్త (స), "ఇక చాలు, ఆపండి" అన్నారు. ఇబ్నె మస్‌వూద్ (రజి) తలపైకెత్తి చూస్తే, దైవప్రవక్త (స) కన్నీళ్ల పర్యంతమై ఉన్నారు. ఆయన కండ్ల వెంబడి అశ్రుధారలు ప్రవహిస్తూ కనిపించాయి.

మరో ఉల్లేఖనం ప్రకారం, ఒకసారి అబూమూసా (రజి) దివ్య ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్నారు. అయితే తన పారాయణం దైవప్రవక్త (స) ఆలకిస్తున్న సంగతి ఆయన గమనించలేదు. కాసేపటి తర్వాత దైవప్రవక్త (స) ఆయనతో, "నేను నైపుణ్యభరితమైన నీ పారాయణం ఆలకించాను. బహుశా నువ్వు గమనించలేదేమో! ఏమైనా దావూద్ ప్రవక్తకు ప్రసాదించబడిన స్వరమాధుర్యంలోని ఒకింత నీకు కూడా లభించినట్లుంది" అన్నారు. అబూ మూసా దైవప్రవక్త (స)కు బదులిస్తూ, "దైవప్రవక్తా! మీరు నా పారాయణం ఆలకిస్తున్న సంగతి నేను గమనించి ఉన్నట్లయితే మరింత మనోహరంగా, శ్రావ్యంగా పారాయణం చేసి ఉండేవాడిని కదా!" అన్నారు.

ఈ సందర్భంగా మరో సంఘటన కూడా గుర్తుకు తెచ్చుకుంటే బాగుంటుంది.

ఖత్తాబ్ కుమారులు ఉమర్ (రజి) తన సహచరులతోపాటు కూర్చొని ఉన్నప్పుడు, "అబూ మూసా! మాకు మా ప్రభువును గుర్తు చేయవూ?" అని వేడుకునేవారు. అంతే, అబూమూసా ముందుకు వచ్చి మధురమైన తన కంఠంతో ఖుర్ఆన్ పారాయణం చేసేవారు. ఆయన పారాయణం విన్నవారందరూ కన్నీరుమున్నీరుగా విలపించేవారు.

ఆ తర్వాతి తరాల ప్రజల్లో పురుడు పోసుకున్న అనుచిత కోరికలు వారిని అల్లాహ్ గ్రంథాన్ని వినకుండా చేశాయి. మనుషుల అభిరుచులు మారిపోయాయి. విద్యా సంగ్రహణానికి గ్రహణం పట్టింది. ప్రజల అవగాహనా శక్తికి సుస్తీ చేసింది.

దివ్య ఖుర్ఆన్ గ్రంథాన్ని వదలిపెట్టి మత గురువుల పుస్తకాలకు పెద్దపీట వేసిన రోజు నుంచే ముస్లిం సమాజంలో పతనం మొదలయింది. శుద్ధ సమాజం లోనూ ప్రతి చోటా చాపక్రింద నీరులా కల్తీ వ్యాపించింది. ఫలితంగా ముస్లిం సమాజంపై ఘోరమైన విపత్తులూ విరుచుకుపడ్డాయి. ఖుర్ఆన్ పదాలకు చెప్పబడిన అనుచిత తాత్పర్యాలు, వెలికి తీయబడిన విపరీతార్థాలు ముస్లిం సమాజాన్ని ముక్క చెక్కలు చేసి పడేశాయి. ప్రజల్లో ధైర్య సాహసాలు క్షీణించాయి. సమాజాన్ని సన్మార్గంలో నడిపింపజేయటం ఖుర్ఆన్ ఉద్దేశం. హృదయ రోగాలకు స్వస్థతను చేకూర్చే సంజీవని ఖుర్ఆన్. ఆసాంతం అది ఒక జ్ఞానం, ఒక సంస్కృతి. మనిషి జీవితానికి, ప్రాణానికి, మోక్షానికి తిరుగులేని ఆధారం. సంతోషమైనా, ఆనందమైనా ఖుర్ఆన్ ద్వారానే ప్రాప్తిస్తుంది. ఇహలోక బహుమానమైనా, పరలోక పారితోషికమైనా ఖుర్ఆన్ చలువే. అది విశ్వప్రభువు ప్రబోధనం. మానవ జీవన సంవిధానం. సమసిపోని విజ్ఞానం.

అలాంటప్పుడు రమజాన్ నెలలో....., ఒక్క రమజాన్ నెలలోనే ఏమిటి, మిగతా నెలల్లోనూ మనం ఖుర్ఆన్‌తో పాటు జీవించకపోవటం ధర్మమేనా? ఖుర్ఆన్ మహత్యాన్ని గుర్తెరిగి దాని వెలుగుజిలుగులతో, దాని పారాయణం వల్ల సంప్రాప్త మయ్యే సుఖసంతోషాలతో మన హృదయాలను నింపుకోకపోవటం న్యాయమా? మనలో మార్పు అనేది రాదా?



## పాఠం 4

# ఉపవాసుల జపం

ఉపవాసుల కోసం శ్రావ్యమైన ధ్వనులూ, మధురమైన గానాలూ, నిర్విరామ స్మరణలూ ఉంటాయి. ఉపవాసులు అందరికంటే ఎక్కువగా అల్లాహ్‌ను ధ్యానిస్తూ ఉంటారు. "సుబ్‌హానల్లాహ్" (అల్లాహ్! నీవు పరమ పవిత్రుడవు), "అల్ హమ్దు లిల్లాహ్" (సకల స్తోత్రాలూ అల్లాహ్‌కే), "అల్లాహు అక్బర్" (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు), "అస్తగ్‌ఫిరుల్లాహ్" (నేను అల్లాహ్‌ను క్షమాపణలు వేడుకుంటున్నాను) అనుకుంటూ ఉపవాసులు అల్లాహ్‌ను నిత్యం స్మరిస్తూనే ఉంటారు. ఉపవాస సమయంలో పగలు సుదీర్ఘమైనదిగా అనిపిస్తే, క్షణం క్షణం అల్లాహ్ స్మరణలో లీనమై అసలు సమయాన్నే మరిచిపోతారు అల్లాహ్ దాసులు. ఫలితంగా సుదీర్ఘమైన ఆ పగలు కొన్ని నిమిషాల్లోనే అంతమైనట్టు వారికి అనిపిస్తుంది. ఉపవాస దీక్షలో ఉన్నవారు అల్లాహ్ స్మరణతో ఆకలి బాధనూ జయిస్తారు. అందులో అమితానందాన్ని ఆస్వాదిస్తారు. వారు అల్లాహ్‌ను ధ్యానిస్తారు. అల్లాహ్ కూడా వారిని జ్ఞాపకం ఉంచుకుంటాడు.

**"అందుకే మీరు నన్ను స్మరించండి, నేను మిమ్మల్ని జ్ఞాపకముంచుకుంటాను. నాకు కృతజ్ఞులై ఉండండి. కృతఘ్నతకు పాల్పడకండి."**

**(ఖుర్ఆన్ 2 : 152)**

అలాగే ఉపవాస దీక్షకులు అల్లాహ్‌కు కృతజ్ఞులై ఉంటారు. కనుక ఆయన వారిపై తన అనుగ్రహాలను కురిపిస్తాడు.

**"మీరు గనక కృతజ్ఞులుగా మెలిగితే, నేను మీకు మరింత అధికంగా అనుగ్ర హిస్తాను."** **(ఖుర్ఆన్ 14 : 7)**

నిజమైన ఉపవాస దీక్షకులు నిలుచున్నా, కూర్చున్నా, పడుకున్నా నిత్యం అల్లాహ్‌నే స్మరిస్తూ ఉంటారు. వారి మనసులు అల్లాహ్ స్మరణతో తృప్తి చెందుతాయి. వారి ఆత్మలు అల్లాహ్ పట్ల ప్రేమతో సంతోషమయమై ఉంటాయి. పరలోకంలో పరమ

ప్రభువును దర్శించుకునే సౌభాగ్యం లభిస్తుందన్న ఆశ వారి హృదయాలకు ఎంతో ఊరటనిస్తుంది. "అల్లాహ్‌ను స్మరించేవాడు సజీవుడు, స్మరించనివాడు మృతుడు" అని దైవప్రవక్త (స) ప్రవచించి ఉన్నారు. అల్లాహ్‌ను స్మరించని మృతజీవులు ఈ లోకంలో చాలా మంది ఉన్నారు. పైకి వీరు జీవిస్తారు, తింటారు, త్రాగుతారు, స్వేచ్ఛగా తిరుగుతారు, ఆనందిస్తారు. కానీ తమ జీవిత పరమార్థం ఏమిటో వారికి అస్సలు తెలియదు.

ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఒకసారి, "ముఫ్రిదూన్‌లు మించి పోయారు" అని అన్నారు. అది విని సహచరులు, "ముఫ్రిదూన్‌లు అంటే ఎవరు దైవప్రవక్తా?!" అని అడిగారు. అందుకు ఆయన సమాధానమిస్తూ, "అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే స్త్రీ పురుషులు" అని చెప్పారు. దైవధ్యానంలో నిమగ్నులైన ఉపవాసులు సత్కార్యాలు చేయటంలో అందరికంటే ముందుంటారు. స్వర్గానికి చేరువలో ఉంటారు. నరకాగ్నికి బహుదూరంలో ఉంటారు. వారి కర్మలపత్రాల నిండుగా సత్కార్యాలే ఉంటాయి. వాటిలో సదాచార సంపన్నత పొంగిపొర్లుతూ ఉంటుంది. అటువంటి వారికి శుభాకాంక్షలు! శుభాభినందనలు!!

ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరై, "దైవప్రవక్తా! ఇస్లాం ఆదేశాలు నాకు చాలా ఎక్కువగా కనిపిస్తాయి. కనుక నేను స్థిరంగా ఆచరించదగిన ఆచరణ ఒకటి నాకు తెలియజేయండి" అని కోరాడు. దైవప్రవక్త (స) అతనికి, "నీ నోటిని ఎల్లప్పుడూ అల్లాహ్ నామ స్మరణలో లీనమై ఉండేలా చూసుకో" అని ఉపదేశించారు.

అల్లాహ్‌ను ఎక్కువగా ధ్యానించేవారి ఉచ్ఛ్వాస నిశ్వాసల్లోనూ, పెదవుల కలయికల్లోనూ, శరీరంలోని ప్రతి కదలికలోనూ నిత్యం దైవధ్యానమే దర్శనమిస్తుంది. ధ్యానంతో, ఆరాధనతో వారు ఉత్తమ బహుమానానికి అర్హులవుతారు. ఉన్నత ఆశయాలు కలిగివుంటారు. ఎంత గొప్ప త్యాగానికయినా సిద్ధమవుతారు.

ఇకపోతే అల్లాహ్ ధ్యానాన్ని నిర్లక్ష్యం చేసేవారు తీవ్రమైన ఆందోళనకు, ఒత్తిడికి, బాధలకు గురవటం ఖాయం. వాటి నుంచి బయటపడే తరుణోపాయం ఉంది. కాని దాన్ని ఆచరించటానికి వారు సిద్ధంగా లేరు. వారి అంతర్గత రోగాలకు చికిత్స ఉంది. కాని వారు దాన్ని గ్రహించలేక పోతున్నారు.

**"విశ్వసించిన వారి హృదయాలు అల్లాహ్ స్మరణ ద్వారా తృప్తి చెందుతాయి. తెలుసుకోండి! అల్లాహ్ స్మరణ ద్వారానే హృదయాలు నెమ్మదిస్తాయి."**

**(ఖుర్ఆన్ 13:28)**



"గొప్పతనమూ, సమస్త స్తోత్రాలూ అల్లాహ్‌కే అని పలికే వ్యక్తి కోసం స్వర్గంలో ఒక ఖర్జూర చెట్టు నాటబడుతుంది" అని ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచించి ఉన్నారు. మరి పొద్దస్తమానం నిద్రపోతూనో లేక గంటల కొద్ది విలువైన సమయాన్ని వృథా కాలక్షేపంలోనో గడిపేవారు ఆ విధంగా స్వర్గంలో ఎన్ని ఖర్జూర చెట్ల సౌభాగ్యాన్ని కోల్పోయి ఉంటారో కదా?!

" అల్లాహ్ పరమ పవిత్రుడు, సకల స్తోత్రాలూ అల్లాహ్‌కే. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడు. అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు" అని పలకటం సూర్యుడు ఉదయించే (ప్రపంచంలోని) వస్తువులన్నింటి కంటే నాకు ప్రియమైనది" అని దైవప్రవక్త (స) పలికి ఉన్నారు. అసలు ఈ ప్రపంచంలో ఏముంది? ఇక్కడి వెండి బంగారాలు, భవనాలు ఏపాటి విలువైనవి? అన్నట్టుగా దైవప్రవక్త (స) వ్యవహరించే వారు. ఈ దృక్పథంతోనే ఆయన ప్రాపంచిక సిరిసంపదలకు వెలకట్టేవారు. సూర్య కిరణాలు చేరని చోటంటూ ఈ భూ ఉపరితలం మీద ఏదీ లేదు. కాని "అల్లాహ్ పరమ పవిత్రుడు, సకల సోత్రాలూ అల్లాహ్‌కే. అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు" అనే ఒక్క చిన్న మాటకు కూడా ఆ వస్తువులేవీ సరితూగలేవు. మరి తమ సమయాన్ని ఇటువంటి అత్యంత విలువైన పలుకులతో సుసంపన్నం చేసుకోవాలని కోరేవారు ఎవరు? అలా చేస్తే రేపు ప్రళయ దినాన ఆ పలుకులే వారిని వెలుగు, ఆనందం, సంతోష రూపాల్లో స్వాగతిస్తాయి సుమా!

దైవప్రవక్త (స) ఒకసారి తన సహచరులకు హితబోధ చేస్తూ, "మీ ఆచరణల్లో అత్యంత శ్రేష్ఠమైన ఒక ఆచరణ గురించి నేను మీకు తెలుపనా? అది మీ యజమాని దృష్టిలో అత్యంత పవిత్రమైనది. అన్నింటికంటే ఎక్కువగా మీ అంతస్తుల్ని పెంచు తుంది. వెండి బంగారాల కన్నా శ్రేష్ఠమైనది. మీరు శత్రువులతో తలపడి వారి మెడలు నరకటం, వారు మీ మెడలు నరకటం కన్నా అది ఎంతో గొప్పది" అన్నారు. అందుకు సహచరులు, "తప్పకుండా తెలియజేయండి దైవప్రవకా!" అని విన్నవించుకున్నారు. దానికాయన, "మహోన్నతుడైన అల్లాహ్‌ను స్మరించటమే ఆ ఆచరణ" అని చెప్పారు.

సదాచార సంపన్నులైన మన పూర్వీకుల దినచర్య ఎలా ప్రారంభమయ్యేదో తెలుసుకుంటే ఇంకా బాగుంటుంది. వారు ప్రాతఃకాలపు (ఫజ్ర్) నమాజు చేసిన తర్వాత బాగా పొద్దు పొడిచే దాకా అల్లాహ్‌ను ధ్యానిస్తూ కూర్చుంచేవారు. మరికొంత

మంది ఖుర్‌ఆన్ గ్రంథం తెరిచి అందులో అల్లాహ్ వాక్యాలను, దైవాజ్ఞలను అధ్యయనం చేస్తూ కూర్చునేవారు. దాంతో వారి అంతరంగం ప్రకాశవంతం అయ్యేది. వారి కర్మల పత్రాలు పుణ్యాలతో నిండిపోయేవి. రమజాన్ నెలలో అల్లాహ్ స్మరణతో సంతోషాన్ని పొందనివాడు, తన ప్రభువు పవిత్రతను కొనియాడుతూ కాలం గడపని వాడు పరమ దౌర్భాగ్యుడు. ఈ విషయంలో అసలు సందేహమే అక్కర్లేదు.

మరి జీవితంలోని ప్రతి క్షణాన్ని ఈ గొప్ప ఆరాధన కోసం వెచ్చించాలని తపన పడేవారు మనలో ఎవరూ లేరా?



# పాఠం 5 ఔదర్యాన్ని, త్యాగ నిరతిని నేర్పే శిక్షణా కాలం, రమజాన్

పరమ ప్రభువైన అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా సెలవిచ్చాడు:

**"మీరు మీ కోసం ఏ మంచిని (పుణ్యకార్యాన్ని) ముందుగా పంపినా, దాన్ని అల్లాహ్ దగ్గర అత్యుత్తమ పుణ్యఫలం రూపంలో అత్యధికంగా పొందుతారు."**

**(ఖుర్‌ఆన్ 73 : 20)**

ఆయన ఇంకా ఇలా అంటున్నాడు:

**"అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చుచేసేవారి ఉపమానం ఇలా ఉంటుంది: ఒక విత్తనాన్ని నాటగా, అది మొలకెత్తి అందులో నుంచి ఏడు వెన్నులు పుట్టుకువస్తాయి. ప్రతి వెన్నులోనూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదేవిధంగా అల్లాహ్ తాను కోరినవారికి సమృద్ధి వొసగుతాడు. అల్లాహ్ పుష్కలంగా ప్రసాదించేవాడు, ప్రతిదీ తెలిసినవాడు." (ఖుర్‌ఆన్ 2 : 261)**

ఒక ప్రామాణికమైన హదీసులో ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) సహజంగానే ప్రజలందరిలోకెల్లా ఎక్కువ దానశీలురు. అయితే రమజాన్ నెలలో జిబ్రయీల్ దూతను కలిసినప్పుడు ఆయన ఇంకా ఎక్కువ ఔదార్యం కనబరిచేవారు. నిజం చెప్పాలంటే ఆ సమయంలో ఆయన ఔదార్యం ప్రభంజనం కంటే వేగంగా ఉంటుంది. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టమని, అవసరాల్లో ఉన్నవారిని ఆదుకోమని, నిరుపేదలకు చేయూతనివ్వమని ఉపవాసం ప్రోత్సహిస్తుంది. రమజాన్ మాసం దైవమార్గంలో ఖర్చుచేసే వారి కాలం. త్యాగం చేయాలని, పరులకు ఎంతో కొంత ఇవ్వాలని ఉవ్విళ్లూరే సదాచార సంపన్నులకు రమజాన్ మాసం ఓ సువర్ణావకాశం. అల్లాహ్ మీకేదైనా ప్రసాదించి ఉంటే అందులో కొద్దిగా నిరుపేదల కోసం త్యాగం చేయండి. ధనం నీరు లాంటిది. నీరు ప్రవహిస్తూ ఉంటే తియ్యగా, తాజాగా ఉంటుంది. దాని ప్రవాహాన్ని అడ్డుకున్నట్లయితే అది మురిగి, కలుషితమయి విషంగా మారిపోతుంది.

త్యాగం ఎంత గొప్పది! దానం ఎంత మహోన్నతమైనది! ఔదార్యం ఎంత సుందరమైనది! "ప్రతిరోజూ ఇద్దరు దైవదూతలు దిగివస్తారు. వారిలో ఒకదూత, 'అల్లాహ్! ఖర్చుపెట్టేవాడికి ప్రతిఫలాన్ని ప్రసాదించు' అని ప్రార్థిస్తే, రెండో దూత, 'అల్లాహ్! కూడబెట్టుకునే వాడి సంపదను నాశనం చెయ్యి' అని ప్రార్థిస్తూ ఉంటాడ"ని దైవప్రవక్త (స) ప్రబోధించారు.

ఆ విధంగా అల్లాహ్ దాసులు ఎవరైనా ఆయన మార్గంలో ఎంతో కొంత ధనం ఖర్చు చేసినప్పుడు దాని మూలంగా అల్లాహ్ వారి భౌతిక, ఆధ్యాత్మిక, మానసిక స్థితిగతుల్లో సౌలభ్యాన్ని సమకూరుస్తాడు. అతని జీవనావసరాలకు సరిపోయే వస్తువుల్లో వృద్ధిని ప్రసాదిస్తాడు. "నీరు మంటను ఆర్పేసినట్లే, దానధర్మాలు రాబోయే ఆపదలను తప్పిస్తాయి" అని దైవప్రవక్త (స) ప్రవచించి ఉన్నారు. చెడు పనులు మనసుల్లో మంటను రాజేస్తాయి. ఆత్మల్లో వేడిని రగిలిస్తాయి. జీవితాన్ని నిప్పుల కుంపటిగా మార్చేస్తాయి. ఒక్క దానధర్మాలు మాత్రమే ఆ అగ్నిజ్వాలల్ని చల్లార్చగలవు. దానం మనోవేడిని చల్లబరుస్తుంది. ఆత్మలో పరిమళాన్ని గుభాళింపజేస్తుంది. ప్రతి చెడు కార్యాన్ని పరిపూర్ణమైన రీతిలో తొలగిస్తుంది.

" మనిషి ప్రాపంచిక జీవితంలో చేసి వెళ్లిన దానధర్మాలు పరలోకంలో అతనికి నీడ కల్పిస్తాయి. ఆ రోజు మానవులకు సంబంధించిన పరస్పర సమస్యలన్నీ తెమలే దాకా అతను ఆ నీడ పట్టునే ఉంటాడు" అని ప్రవక్త (స) ప్రబోధించారు. దానధర్మాలు విశాలమైన నీడను కలిగి ఉండటం, ఆ నీడలో మనుషులు ప్రతిఫల దినాన సేదతీరటం, ఆ నీడ ఇహలోకంలో ఆచరించిన దానధర్మాలకు తగ్గట్టు అద్భుతంగా ఉండటం, వింటుంటేనే ఎంతో ఆశ్చర్యంగా ఉంది కదూ?!

రుజువర్తనులైన మన మూడవ ఖలీఫా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) గొప్ప ధనవంతులు. ఆ కాలంలో ముస్లింలు "తబూక్" అనే ప్రాంతంలో ఓ గొప్ప యుద్ధం చేయవలసి వచ్చింది. ఆ సమయంలో ముస్లింలకు యుద్ధ సామగ్రి, ఇతర ఆయుధ పరికరాలు అవసరమయ్యాయి. కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం తన సంపదను, ఆస్తులన్నిటిని ఖర్చు పెట్టి ముస్లిం సేనలకు కావలసిన యుద్ధ సరంజామా అంతా ఆయన సమకూర్చారు. ప్రత్యేకంగా ముస్లింల కోసం ఆ కాలంలో మొత్తం ఒక బావినే కొనేశారాయన. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ మరో గొప్ప ధనవంతులైన సహాబీ (దైవప్రవక్త సహచరులు). అల్లాహ్ ప్రసన్నత కోసం ఆయన ఒకసారి, 700 ఒంటెలపై మోపబడి



ఉన్న తన వ్యాపార సామగ్రి మొత్తం మదీనా నగరంలోని పేద ప్రజలకు పంచి పెట్టేశారు.

- ఒక చిన్న రొట్టె ముక్కకూ, చుక్క పాలకూ, పట్టెడన్నానికీ నోచుకోకుండా పస్తులు గడుపుతూ ఉపవాసాలు పాటిస్తున్న అభాగ్య జీవులెందరో మన సమాజంలో బతుకు బండి లాగుతున్నారు.
- తలదాచుకోవటానికి ఇల్లు లేక, ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లటానికి కనీస వాహన వసతుల్లేక, కష్ట కాలంలో తమను ఆదుకునే స్నేహితులూ లేక సతమతమవుతున్న ఎంతో మంది దీనులూ మన చుట్టు ప్రక్కల్లో ఉపవాసం పాటిస్తున్నారు.
- తినేందుకు ఏమీ లేక పస్తులతోనే ఉపవాసం ప్రారంభించి, తిరిగి ఉపవాస విరమణ (ఇఫ్తార్) సమయంలోనూ గుక్కెడు మంచి నీళ్లతో సరిపెట్టుకొని పస్తుల్ని కొనసాగించే కష్ట జీవులకూ మన సమాజంలో కొదువ లేదు.

బహుశా ఇలాంటివారిని దృష్టిలో పెట్టుకునే దైవప్రవక్త (స), "ఎవరయినా ఒక ఉపవాసి ఉపవాసాన్ని విరమింపజేస్తే (అంటే ఇఫ్తార్ చేయిస్తే) ఆ ఉపవాసికి లభించినంత పుణ్యం అతనికీ లభిస్తుంది. అలా అని ఆ ఉపవాసి పుణ్యంలోనూ ఎలాంటి కోతా విధించబడదు" అని వక్కాణించారు. ఈ కారణంగానే సదాచార సంపన్నుల ఔదార్యం శుభప్రదమైన రమజాన్ మాసంలో అనూహ్యంగా పెరిగి పోతుంది. ఈ మాసంలో వారు దైవమార్గంలో అమితంగా ధనం ఖర్చుపెడతారు. ఎముక లేని చేత్తో దానధర్మాలు చేస్తారు. అసాధారణ త్యాగభావాన్ని కనబరుస్తారు. వారిలో చాలా మంది నిరుపేదలకు అన్నదానం చేస్తారు. రమజాన్ నెలలో ప్రతి రోజూ ఉపవాసులకు "ఇఫ్తార్" (ఉపవాస విరమణ) చేయిస్తారు. అలా చేసి వారు విశ్వ ప్రభువైన అల్లాహ్ నుంచి గొప్ప పుణ్యాన్ని, మహోన్నతమైన ప్రతిఫలాన్ని అందు కుంటారు.

సదాచార సంపన్నులైన మన పూర్వీకుల కాలంలో మస్జిదులు ఎల్లప్పుడూ పేదల కొరకు సమకూర్చబడిన ఆహార పదార్థాలతో నిండుగా ఉండేవి. మస్జిదులలో భోజన సదుపాయాలు కలిగించి అన్నార్తులు, అవసరార్థులు ఒక్కరు కూడా లేకుండేటట్టు చేసేవారు మన పూర్వీకులు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అల్లాహ్ దాసులు తమ తోటి నిరుపేదలకు అన్నపానీయాలతో సత్కరించినా,

వస్త్రదానంతో గౌరవించినా అందులో తమకు అల్లాహ్ ప్రసన్నతా ఉద్దేశం లేకపోతే దానివల్ల ఎలాంటి పుణ్యమూ రాదు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"మీరు గనక అల్లాహ్‌కు మంచి రుణం ఇస్తే (అంటే అల్లాహ్ మార్గంలో ఖర్చు పెడితే) దాన్ని ఆయన మీ కొరకు పెంచుతూపోతాడు. మీ పాపాలను కూడా క్షమిస్తాడు. అల్లాహ్ (తన దాసుల సేవలను) గుర్తించేవాడు, సహనశీలుడు." (ఖుర్ఆన్ 64 : 17)**

ఓ ఉపవాసీ! ఈ రోజు నువ్వు చేసే త్యాగం, నువ్వు ఇచ్చే దానం రేపు నువ్వు పేదరికంలో, అవసరంలో ఉన్నప్పుడు నీకు పనికి రావటానికి నీ ప్రభువుకు ఇచ్చుకుంటున్న రుణమేనని గ్రహించాలి. ఆ రేపు మరేదో కాదు, ప్రతిఫల దినమే. మనిషి చేతిలో చిల్లి గవ్వ కూడా ఉండని రోజు అది. అత్యంత దౌర్భాగ్యం కమ్ముకునే రోజు. లాభ నష్టాలు తేలే రోజు. ఓ ఉపవాసీ! దప్పిక గొన్న వానికి ఈ రోజు నువ్వు త్రాపించే గుక్కెడు నీళ్లు, శ్రమ జీవి గుండె చల్లదనం కోసం నువ్వు పోసే కాసిన్ని పాలు, ఆకలిగొన్న వానికి నువ్వు పెట్టే పట్టెడన్నం, అవసరంతో సతమతమవుతున్న మనిషికి నువ్వు చేసే కొద్దిపాటి ఆర్థిక సహాయం, బట్టలు లేని బీద ప్రజలకు నువ్విచ్చే వస్త్రదానం - ఇవన్నీ నీ స్వర్గారోహణకు సోపానాలని నువ్వు తెలుసుకోవాలి. ఓ ఉపవాసీ! అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. దానం కన్నా ఎక్కువగా నీ సంపదను పరిరక్షించే వస్తువు మరొకటి లేదు. జకాత్ కన్నా ఎక్కువగా మరే వస్తువూ నీ సంపదను పరిశుద్ధపరచదు. ఎంతోమంది ధనవంతులు అంతులేని తమ సిరిసంపదలను, నిధులు నిక్షేపాలను, ఎత్తయిన భవనాలను, మేడలను మిద్దెలను ఎలా సంపాదించారో అలాగే ఈ లోకంలో వదలిపెట్టి చనిపోయారు. కాని తాము జీవించి ఉన్నప్పుడు వారు వాటిని అల్లాహ్ మార్గంలో ఉపయోగించకపోవటం మూలంగా వారి తదనంతరం కూడా ఆ సంపద వారి పాలిట దుఃఖానికి, సంతాపానికి కారణ మయింది. రేపు ప్రళయ దినాన విజేతలెవరో, ఓటమి పాలయ్యేదెవరో నువ్వే చూస్తావు! సహాయం లభించేది మాత్రం కేవలం అల్లాహ్ తరఫు నుంచే సుమా!



# పాఠం 6 రమజాన్ : రాత్రి వేళ నమాజుల్లో గడిపే కాలం

**"ఓ వస్త్రమును కప్పుకున్నవాడా? కొద్దిసేపు మినహా రాత్రంతా (నమాజులో) నిలబడు. సగం రాత్రి లేదా దానికంటే కొంచెం తక్కువ చేసుకో. లేదా దానిని మరికొద్దిగా పెంచుకో. ఖుర్ఆన్‌ను మాత్రం బాగా - ఆగి ఆగి నింపాదిగా (స్పష్టంగా) పఠించు." (ఖుర్ఆన్ 73 : 1 -4)**

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన ప్రవక్తకు ఆదేశించినది ఇదే. మరి ఆదరణీయ ప్రవక్త (స) కూడా తన ప్రభువు ఆజ్ఞానుసారం అదే విధంగా నడచుకున్నారు. రాత్రి వేళల్లో ఆయన గంటల తరబడి దైవ సన్నిధిలో నమాజు చేస్తూ నిల్చునేవారు. అత్యంత అణకువతో, వినమ్రతతో కదు దీనంగా అల్లాహ్‌ను ఆరాధించేవారు.

దివ్య ఖుర్ఆన్‌లోనే మరో చోట అల్లాహ్ తన ప్రియ ప్రవక్తకు ఇలా ఆదేశించాడు:

**"రాత్రిపూట కొంతభాగం తహజ్జుద్ (నమాజు)లో ఖుర్ఆన్ పఠనం చెయ్యి. ఇది నీ కొరకు అదనం. త్వరలోనే నీ ప్రభువు నిన్ను 'మఖామె మహ్మూద్'కు (ప్రశంసాత్మకమైన స్థానానికి) చేరుస్తాడు." (ఖుర్ఆన్ 17 : 79)**

అంతేకాదు, మీరు ఈ లోకంలో రాత్రివేళ అల్లాహ్ ఆరాధనలో గడిపితే అది మీకు ఎంతో ఆదరణీయంగా మారుతుంది. తీర్పు దినాన కూడా మీరు చాలా గౌరవించబడతారు.

అసలు రమజాన్ అంటేనే పగటి పూట ఉపవాసం పాటించి, రాత్రిళ్లు అల్లాహ్ ఆరాధనలో గడిపే మాసం. ఉపవాసులు గంటల తరబడి అల్లాహ్ ఆరాధనలో గడిపే చీకటి రాత్రులే ఈ లోకంలో అత్యంత ప్రీతికరమైన రాత్రులు. ఆ శుభ ఘడియలే ఈ ప్రపంచంలో అత్యంత విలువైన ఘడియలు.

"నీలో నిగూఢ సత్కార్యాలేవైనా జరిగాయా?" అని రాత్రిని అడిగితే, అందుకు సమాధానంగా, "నా ప్రియ మిత్రులు రాత్రి వేకువ జాముల్లో అత్యంత విలువైన

(ఖుర్‌ఆన్) వచనాలు, వాక్యాలు పఠించేవారు. ఇంతకన్నా విలువైన సమయాన్ని నేనెన్నడూ చూడలేదు" అని అంటుందట చీకటి రాత్రి.

ఆరాధనా మాధుర్యాన్ని గ్రోలే ఉపవాసుల మనసులు ఆనందమయమై ఉంటాయి. కనుక రమజాన్ రాత్రులు వారికి చాలా చిన్నవిగా అగుపిస్తాయి. అజాగ్రత్తపరుల పరిస్థితి ఇందుకు పూర్తిగా విభిన్నం. వారి మనసులు అనారోగ్యం పాలై ఉంటాయి. కనుక రమజాన్ రాత్రులు వీరికి చాలా సుదీర్ఘమైనట్టు అనిపిస్తాయి. సదాచార సంపన్నులైన దాసుల గుణగణాలను వివరిస్తూ దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"వారు రాత్రిపూట చాలా తక్కువగా నిద్రించేవారు. రాత్రి చివరి గడియలలో క్షమాపణకై (అల్లాహ్‌ను) వేడుకునేవారు." (ఖుర్‌ఆన్ 51 : 17,18)**

మరో చోట ఇలా చెప్పబడింది :

**"వారు ఓర్పు వహిస్తారు, సదా సత్యమే పలుకుతారు. విధేయత చూపుతారు. దైవమార్గంలో ఖర్చుచేస్తారు. రాత్రి చివరి భాగంలో క్షమాభిక్షకై వేడుకుంటారు." (ఖుర్‌ఆన్ 3 : 17)**

ఆనాడు అల్లాహ్ మార్గంలో వలస వెళ్ళిన దైవప్రవక్త సహచరులైన ముహాజిర్లు కాని, వారికి సహాయ సహకారాలు అందించిన మదీనా నగర అన్సారులు కాని రాత్రి వేళల్లో అల్లాహ్ సన్నిధిలో నిల్చొని కడు దీనంగా విలపిస్తుండేవారు. వారు అల్లాహ్ సమక్షంలో ఎంత భక్తిపరులో ప్రాపంచిక జీవితంలో అంత నిర్భయులు. అధర్మం గుండెల్లో సింహ స్వప్నాలు. మరో మాటలో చెప్పాలంటే రాత్రిళ్లు వారు అల్లాహ్ సమక్షంలో సన్యాసులైతే, పగలు ప్రపంచాన్ని గెలిచే పరాక్రమశీలురు. ఆనాటి ప్రవక్త సహచరుల ఇండ్లు దైవగ్రంథ శిక్షణా శిబిరాలుగా అలరాయాయి. వారి గృహాలే విశ్వాస కేంద్రాలుగా విరాజిల్లాయి. కాని నేడు చాలా మంది ముస్లింల ఇండ్లు సంగీత స్థావరాలుగా, అవినీతికి ఆలవాలంగా మారిపోతుండటం ఎంతో బాధాకరమైన విషయం! అల్లాహ్ మనందరినీ ఇలాంటి చెడుల నుంచి కాపాడు గాక!

రాత్రి వేళలు అల్లాహ్ ఆరాధనలో గడపని కారణంగానే నేడు మన హృదయాలు శిలల కంటే కఠినంగా మారిపోయాయి. అల్లాహ్ ఔన్నత్యాన్ని తలచుకున్నప్పుడు మన కళ్ల నుంచి ఒక్క కన్నీటి బొట్టూ రాలటం లేదు. మన విశ్వాసం ఆందోళనకరమైన రీతిలో బలహీనపడి పోతోంది. "రమజాన్ నెలలోని రాత్రులు పరిపూర్ణ



విశ్వాసంతో, పుణ్యం లభిస్తుందన్న ఆశతో అల్లాహ్ ఆరాధనలో గడిపినవారి గత పాపాలన్నీ మన్నించబడతాయి" అన్న దైవప్రవక్త (స) దివ్య సూక్తిని మనం పెడచెవిన పెట్టాము. రాత్రిపూట మనిషిని నమాజులో నిలబడేందుకు ప్రేరేపించే విషయాల్లో ఒకటి, తీర్పు దినాన్ని తలచుకోవటం. ప్రపంచ మానవులంతా ఆరోజు పరమోన్నత ప్రభువు ముందు తల వంచుకొని నిలబడతారు. అంతకు ముందు, సమాధులు తమలో వున్న వాటిని బయటికి వెళ్ళగ్రక్కుతాయి. మనిషి తన హృదయ కుహరాల్లో దాచుకున్న రహస్యాలు సయితం ఆ రోజు బట్టబయలవుతాయి.

ఆ మాటకొస్తే, మనిషిని అల్లాహ్ ఆరాధన వైపు ప్రేరేపించే విషయాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో చెప్పుకోదగినవి, పరలోకపు గొప్ప పుణ్యఫలాన్ని తలచుకోవటం, తమ వల్ల జరిగిన తప్పులకు, పాపాలకు క్షమాభిక్ష లభిస్తుందన్న పరమ సత్యాన్ని పదే పదే నెమరువేసుకుంటూ ఉండటం, మొదలగునవి; సదాచార సంపన్నులైన మన పూర్వీకులు రాత్రివేళ నమాజులో లీనమై ఉండేవారు. అల్లాహ్ ముందు వినమ్రంగా రుకూ చేస్తూ, సాష్టాంగ ప్రణామ (స్థితిలో) ఆయన్ను ధ్యానిస్తూ కనిపించేవారు. ఒకవైపు అల్లాహ్ ఆగ్రహానికి భయపడుతూనే, మరోవైపు ఆయన అనుగ్రహం మీద ఆశతో ఆయన్ను వేడుకుంటూ గడిపేవారు. ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు పరలోక శిక్షల గురించి తెలుసుకొని, గతంలో తమ వల్ల జరిగిన పాపాలను తలచుకొని విపరీతంగా విలపించేవారు. చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చేసుకుంటే ఎటువంటి పాపమైనా క్షమించబడుతుందని దైవగ్రంథ పారాయణం ద్వారా అర్థం చేసుకొని అల్లాహ్‌కు అమితంగా కృతజ్ఞతలు తెలుపుకునేవారు. భవిష్యత్తులో మరెన్నడూ అటువంటి తప్పులకు పాల్పడమని గట్టిగా నిశ్చయించుకునేవారు. మరి నేడు మన ఇండ్లలో అల్లాహ్ ఆరాధన చేయకుండా ఎందుకు మనం వాటిని శ్మశానాల్లాగా మార్చుకుంటున్నాం? మన ఇండ్లల్లో ఎందుకు ఖుర్‌ఆన్ పారాయణం రోజురోజుకూ తగ్గిపోతోంది? తమ యజమానులు తమను రాత్రివేళ దైవారాధనా స్థలాలుగా మార్చుకోవటం లేదని స్వయంగా ఆ ఇండ్లే అల్లాహ్‌కు ఫిర్యాదు చేసే దుస్థితి ఎందుకు దాపురించింది?

రేచీకటి కమ్ముకోగానే నిర్లక్ష్య హృదయాలకు నిద్రమత్తు ముంచుకు వస్తుంది. పగలంతా ఆటపాటల్లో మునిగితేలిన ఆత్మలు దైవారాధన పరంగా దాదాపు చచ్చిపోతాయి. దీనికి భిన్నంగా అదే రేచీకటి విశ్వాసుల్లో పరలోకపు భయాందోళనల్ని కలిగిస్తుంది. స్వర్గ సుఖాల ఆశ వారిలో నూతనోత్సాహాన్ని చిగురింపజేస్తుంది. సమాధి

జీవితం, పరలోకంలో ప్రభువు ముందు సమస్త మానవాళి సమీకరణ, మంచి చెడుల కర్మల పత్రాలు ఇలా పరలోక విషయాలు ఒక దాని తర్వాత ఒకటి లీలగా గుర్తుకు వస్తుంటే ఏ విశ్వాసి సుఖంగా, కమ్మగా నిద్రపోగలడండీ? నేటి మన ముస్లిం తరం రాత్రిళ్ళు చదరంగం ఆడుతూ, సంగీతం వింటూ కాలక్షేపం చేయటం ఎంతో దురదృష్టకర పరిణామం. "ఓ అల్లాహ్ దాసులారా! ఒక దశలో రాత్రివేళలు చక్కగా అల్లాహ్ ఆరాధనలో గడిపి, ఆ తర్వాత ఉన్నట్లుండి ఆ మంచి అలవాటును మానుకునే వారిలా మీరు మారకండి" అన్న దైవప్రవక్త (స) హితబోధనను మనం మరిచి పోయామా??!!



# పాఠం 7 రమజాన్ నెలలో ముస్లిం ఇల్లు

మహోన్నతుడైన అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు:

**"తన కట్టడాన్ని దైవభీతి, దైవప్రసన్నతల పునాదిపై కట్టినవాడు ఉత్తముడా? లేక కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న ఏదైనా లోయ యొక్క డొల్ల అంచున తన కట్టడాన్ని కట్టినవాడు ఉత్తముడా? అటు పిమ్మట అది అతనితోపాటే నరకాగ్నిలో పడిపోయింది. ఇలాంటి దుర్మార్గులకు అల్లాహ్ సన్మార్గం చూపడు." (ఖుర్ఆన్ 9 : 109)**

ఒక ముస్లిం ఇల్లు దైవధ్యానం పునాదులపై నిర్మింపబడుతుంది. అల్లాహ్ పట్ల భయభక్తులు దాని మూలస్తంభాలై ఉంటాయి. సత్కార్యాల పునాదుల మీద అది ఆధారపడి ఉంటుంది. అల్లాహ్ పట్ల వినయ విధేయతల ఉద్యానవనంతో ఆ ఇల్లు నిత్యం కళకళలాడుతూ ఉంటుంది.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ముస్లింలకు ఇలా ఉపదేశిస్తున్నాడు:

**"ఓ విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుటుంబీకుల్ని అగ్ని బారినుండి కాపాడుకోండి. (ఆ అగ్ని ఎటువంటిదంటే) మనుషులు, రాళ్లు దాని ఇంధనం కానున్నారు. దానిపై కర్కశులు, బలిష్టులు అయిన దూతలు నియమితులై ఉన్నారు. అల్లాహ్ ఆజ్ఞలను పాలించటంలో వారు ఏమాత్రం అలక్ష్యం చేయరు. పైగా వారికి జారీ చేయబడిన ఆజ్ఞలను వారు ఖచ్చితంగా పాలిస్తారు." (ఖుర్ఆన్ 66 : 6)**

ఇల్లు లేక కుటుంబం అనేది ఓ కర్తవ్యం, ఓ బాధ్యత. మనిషి తన కర్తవ్యాన్ని, దైనందిన కార్యాలను నిర్వహించే ఆలయమే ఇల్లు. "మీలో ప్రతి మనిషీ ఓ బాధ్యత గల వ్యక్తి. మిమ్మల్నందరినీ తమ తమ బాధ్యతల గురించి (అల్లాహ్ సన్నిధిలో) ప్రశ్నించటం జరుగుతుంది" అని దైవప్రవక్త (స) ప్రబోధించారు. శుభప్రదమైన రమజాన్ మాసంలోగాని, వేరితర మాసాల్లోగాని ఇంటిల్లిపాదితో దైవారాధన

చేయించటం ఇంటి యజమాని బాధ్యత. ఇస్మాయీల్ ప్రవక్త (అలైహిస్సలాం)ను కొనియాడుతూ అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా అంటున్నాడు:

**"అతను (ఇస్మాయీలు) తన కుటుంబీకులకు నమాజు గురించి, జకాత్ గురించి ఆదేశిస్తూ ఉండేవాడు. అతను తన ప్రభువు సన్నిధిలో ప్రియతముడు." (ఖుర్ఆన్ 19 : 55)**

పిల్లలను ఇస్లామీయ విలువలతో పెంచి పోషించే చిత్తశుద్ధిగల తండ్రులు, విశ్వాసురాళ్ళైన తల్లులు నేటి ముస్లిం ఇండ్లకు చాలా అవసరం. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవీయబడింది:

**"అమానతుల (బాధ్యతల)ను అందుకు తగినవారికే అప్పగించండి." (ఖుర్ఆన్ 4 : 58)**

ఇండ్లను నైతికంగా తీర్చిదిద్దటం చాలా పెద్ద బాధ్యత. ఇస్లామీయ ఇల్లు రమజాన్ మాసంలో నిత్యం దైవధ్యానంతో, ఖుర్ఆన్ పారాయణంతో కళకళలాడుతూ ఉంటుంది. అల్లాహ్ పట్ల వినయ విధేయతలతో, భక్తిప్రపత్తులతో అలరారుతుంది. భోజన పానీయాలు సేవించటంలో, రాకపోకల్లో, నిద్రాజాగరణల్లో దైవప్రవక్త సున్నతుల సువాసనలు ఆ ఇంట్లో నిత్యం గుభాళిస్తూ ఉంటాయి. అంతేకాదు, ఆ ఇల్లు కచ్చితమైన పరదా సంప్రదాయంతో సుసంపన్నంగా ఉంటుంది. అందులో స్త్రీ పురుషుల కార్యపరిధులు ప్రస్ఫుటంగా ఉంటాయి. ఈ విధివిధానాలను అనుసరిస్తూ ఇస్లామీయ కుటుంబమంతా అల్లాహ్ ఆరాధనలో లీనమవుతుంది. వాటిని తమ ఆత్మ గౌరవానికి, తమ సహజీవన సౌందర్యానికి మార్గదర్శకాలుగా గుర్తిస్తుంది. తన ఆజ్ఞలకు, మార్గదర్శకాలకు అనుగుణంగా మసలుకునే వారిని అల్లాహ్ అమితంగా అనుగ్రహిస్తాడు. అల్లాహ్ చాలా ఇండ్లను అపారమైన ధనసంపదలిచ్చి పరీక్షిస్తూ ఉంటాడు. సాధారణంగా సిరిసంపదలు మనుషులను పెడత్రోవ పట్టిస్తాయి. వారి భవిష్యత్తును నాశనం చేస్తాయి. వారి బుద్ధిని వక్రింపజేస్తాయి. సిరులు పొంగి పొర్లిన వెంటనే కొన్ని ఇండ్లల్లో నుండి దైవధ్యానం, ధర్మ పరాయణతలు మటుమాయం అవుతాయి. ఆత్మగౌరవం అంతరిస్తుంది. సిగ్గుబిడియాలు సెలవు తీసుకుంటాయి. ఫలితంగా ఆ ఇంట్లో అశాంతి, అలజడులు తిష్టవేస్తాయి. మనశ్శాంతి కోసం వారు ఎన్నో అడ్డదారులు తొక్కుతారు. అధర్మ విషయాలను ఆశ్రయిస్తారు. కాని వాటి వల్ల వారికి నష్టమే గాని, లాభం అస్సలు ఉండదు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:



**"తెలుసుకోండి! అల్లాహ్ స్మరణ ద్వారానే హృదయాలకు ప్రశాంతత చేకూరుతుంది." (ఖుర్ఆన్ 13 : 28)**

మరో చోట ఇలా చెప్పబడింది:

**"జ్ఞానంతో నిమిత్తం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుంచి తప్పించటానికి, దాన్ని వేళాకోళం చేయడానికి మనసును వశీకరించే విషయాలను కొనుగోలు చేసేవాడు కూడా మనుషుల్లో ఉన్నాడు. పరాభవం పాల్జేసే శిక్ష ఉన్నది ఇలాంటి వారికోసమే." (ఖుర్ఆన్ 31 : 6)**

పై దివ్య ఖుర్ఆన్ వాక్యంలో "వశీకరించే విషయాలు" (లహ్వల్ హదీస్) అంటే "సంగీతం" అని అనేక ముస్లిం పండితులు అభిప్రాయపడ్డారు. సంగీతం నైతిక విలువల్ని నిలువునా ఖూనీ చేస్తుంది. కట్టుబాట్లకు తూట్లు పొడుస్తుంది. బుద్ధిని మందగింపజేస్తుంది. నేటి మన సమాజంలో ఇందుకు ఉదాహరణలు కోకొల్లలు.

కాని ఒక ఇస్లామీయ గృహంలో అహర్నిశలూ అల్లాహ్ స్మరణే జరుగుతూ ఉంటుంది. ఆ ఇంట్లో అందరూ అల్లాహ్‌ను స్మరించుకుంటూ నిద్రపోతారు. తిరిగి తెల్లవార్లు అల్లాహ్‌ను స్మరిస్తూనే నిద్ర మేల్కొంటారు. పనికిమాలిన మాటలకు, వ్యర్థమైన పనులకు అక్కడ చోటే ఉండదు. విశ్వాసుల లక్షణాలను పేర్కొంటూ అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో, **"వారు వ్యర్థ విషయాలకు దూరంగా ఉంటారు" (23 : 3)** అని చెప్పాడు.

ఇస్లామీయ కుటుంబం అల్లాహ్ సన్నిధిలో సిగ్గు బిడియాలతో మసలుకుంటుంది. ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "అల్లాహ్ ముందు సిగ్గుబిడియాలతో నిరాడంబరంగా ఉండండి. మనసును, ఆలోచనలను అదుపులో ఉంచుకోండి, మీ కడుపుల్లోకి పోతున్న ఆహారం ధర్మమైనదో, అధర్మమైనదో తెలుసుకోండి. అల్లాహ్ దృష్టిలో అదే నిజమైన నిరాడంబరత. పరలోక శిక్షలను తలచుకున్న వారికి ఈ ప్రపంచంగాని, ఈ జీవిత తళుకు బెళుకులుగాని ఏ మాత్రం రుచించవు."

మన గృహాలు ధార్మిక పరిజ్ఞానంతో అలరారుతూ, మన ఇండ్లు ఇస్లామీయ సంప్రదాయాలకు ఆలవాలమై, మన పరిసరాల్లో మన్నింపు క్షమాగుణాల పూదోటలు పెరిగితే ఎంత బాగుండు! అసలు ముస్లిం ఇల్లంటే కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగి వుండాలి. వాటిలో మొట్ట మొదటిది, ఇంట్లో అందరూ సమయానికి ఐదుపూటలా వినయ విధేయతలతో, పూర్తి ఆధ్యాత్మికతతో నమాజ్ చేస్తుండాలి. ఉదయం,

సాయంత్రం దివ్య ఖుర్‌ఆన్ పారాయణం జరుగుతుండాలి. నిత్యం అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండాలి. ప్రతి పనీ ప్రవక్త (స) సంప్రదాయానికి అనుగుణంగా జరగాలి. వ్యర్థ ప్రేలాపనలకు, అసత్యాలకు, పనికిమాలిన సంభాషణలకు అస్సలు తావుండకూదదు. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**" "మా ప్రభువు అల్లాహ్ మాత్రమే " అని పలికి, దానిపై స్థిరంగా ఉన్న వారివద్దకు దైవదూతలు దిగివచ్చి, (ఇలా అంటూ ఉంటారు): "మీరు భయ పడకండి. దుఃఖించకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గలోకపు శుభ వార్తను అందుకోండి."** **(ఖుర్‌ఆన్ 41 : 30)**

ఇంకా ఇలా చెప్పబడింది:

**"విశ్వసించిన వారిని అల్లాహ్ స్థిరమైన మాటపై ప్రాపంచిక జీవితంలోనూ, పర లోకంలోనూ నిలకడను ప్రసాదిస్తాడు. అయితే అన్యాయపరులను మాత్రం ఆయన అపమార్గానికి లోనుచేస్తాడు. అల్లాహ్ తాను తలచుకున్నది చేసి తీరుతాడు."** **(ఖుర్‌ఆన్ 14 : 27)**

ఏది ఏమైనా రమజాన్ మాసం ముస్లింల ఇండ్లల్లో ఆధ్యాత్మికతను, ఆత్మ తృప్తిని నింపుతుందన్న మాట వాస్తవం. ఈ మాసం రాత్రివేళల్లో ఇంటిల్లిపాదిని మేల్కొలిపి నమాజు కోసం నిలబెడుతుంది. పగటి పూట ఉపవాసం పాటింపజేస్తుంది. దాసులు మహోన్నతుడైన తమ ప్రభువు నామ స్మరణలో లీనమయ్యేందుకు ప్రేరేపిస్తుంది.

**"దైవగ్రంథాన్ని పఠిస్తూ నమాజును నెలకొల్పేవారు, మేము ప్రసాదించిన దానిలో నుంచి గోప్యంగానూ, బహిరంగంగానూ ఖర్చు చేసేవారు ఎన్నటికీ నష్టం కలుగని వర్తకాన్ని ఆశిస్తున్నారు. వారికి వారి ప్రతిఫలాలు (అల్లాహ్) పూర్తిగా ఇవ్వటానికి, తన కృపతో ఆయన వారికి మరింతగా ప్రసాదించటానికి గాను (వారు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు). నిశ్చయంగా ఆయన అమితంగా క్షమించేవాడు, సన్మానించేవాడు."** **(ఖుర్‌ఆన్ 35 : 30)**

ఓ అల్లాహ్! కరుణ జూపేవారందరిలో కెల్లా మహా కరుణామయా!! మా ఇండ్లను ఆత్మతృప్తితో, విశ్వాసం, వివేకాలతో వికసింపజేయమని మేము నిన్ను ప్రార్థిస్తున్నాము.



# పాఠం 8

# హృదయమూ ఉపవాసం పాటిస్తుంది

**"ఎవరు అల్లాహ్‌ను విశ్వసిస్తారో వారి హృదయానికి అల్లాహ్ (సరైన దిశలో) మార్గదర్శకత్వం వహిస్తాడు."** **(ఖుర్‌ఆన్ 64 : 11)**

హృదయానికి మార్గదర్శకత్వం లభించటం మామూలు విషయం కాదు. అది సకల మార్గదర్శకాలకూ మూలం. సర్వ సాఫల్యాలకూ జీవం. మనిషి కట్టుకునే సత్కార్యాల సుందర భవనానికి అది మొట్టమొదటి ఆధారం. ప్రాపంచిక జీవనంలో అతని ప్రతి కదలికకూ కారణం, ప్రేరణం హృదయ మార్గదర్శనమే. "మానవ శరీరంలో ఓ మాంస ఖండం ఉంది. అది సక్రమంగా ఉంటే శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. అది గనక రోగగ్రస్తమయితే పూర్తి శరీరం రోగగ్రస్తమవు తుంది. అది మరేదో కాదు, మనిషి గుండెకాయే" అని బోధించారు మానవ మహోపకారి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం).

ఆరోగ్యవంతమైన హృదయం ఇహపరాలలో సుఖసంతోషాలకు ఆలంబనం. దీనికి ప్రతిగా అంతరంగ దుర్వినియోగం ఓ ఖచ్చితమైన వినాశ మార్గం. దాని దుష్పరిణామాలు దేవునికే తెలుసు.

**"హృదయాన్ని కలిగి వుండి లేదా శ్రద్ధగా ఆలకించి సావధానంగా మసలుకునే ప్రతి వ్యక్తికీ ఇందులో హితబోధన గలదు."** **(ఖుర్‌ఆన్ 50 : 37)**

ప్రతి ప్రాణిలోనూ ఓ హృదయం ఉంటుంది. అందులో రెండు పార్శ్వాలు ఉంటాయి. ఒక పార్శ్వం విశ్వాసం వెలుగుతో, సజీవంగా స్పందిస్తూ ఉంటుంది. పూర్తిగా దైవానికి లోబడి, నిత్యం దైవ ధ్యానంతో నిండి ఉంటుంది. మరొక పార్శ్వం రోగగ్రస్తమై, మృతప్రాయమై, సకల మాలిన్యాలతో కప్పబడి ఉంటుంది.

మూర్ఖుల హృదయ స్థితిని వివరిస్తూ విశ్వ ప్రభువైన అల్లాహ్ ఇలా సెల విస్తున్నాడు:

**"వారి హృదయాలలో రోగం ఉంది. ఆ రోగాన్ని అల్లాహ్ మరింతగా**

**"... పెంచాడు. ఇంకా, వారు చెప్పే అబద్ధం మూలంగా వారి కొరకు వ్యధాభరితమయిన శిక్ష ఉంది." (ఖుర్‌ఆన్ 2 : 10)**

**"మా హృదయాలు గలేబుల్లో చుట్టబడి ఉన్నాయ"ని వారంటున్నారు. కాదు, వారి తిరస్కారవైఖరి మూలంగా అల్లాహ్ వారిని ధూత్కరించాడు. కనుక వారు విశ్వసించేది బహు స్వల్పం." (ఖుర్‌ఆన్ 2 : 88)**

దివ్య ఖుర్‌ఆన్‌లోనే మరో చోట అల్లాహ్ ఇలా అంటున్నాడు :

**"ఏమిటి, వారు ఖుర్‌ఆన్ గురించి లోతుగా ఆలోచించరా? లేక వారి హృదయాలపై తాళాలు పడి ఉన్నాయా?" (ఖుర్‌ఆన్ 47 : 24)**

**"వారిలా అన్నారు : "నువ్వు దేని వైపుకు మమ్మల్ని పిలుస్తున్నావో దానికి సంబంధించి మా హృదయాలు తెరలలో ఉన్నాయి. మా చెవులలో భారం ఉంది. నీకూ – మాకూ మధ్య ఒక (అడ్డు) తెర ఉంది. కాబట్టి నీ పనేదో నువ్వు చేసుకో. మా పనిని మేము చేసి తీరుతాము." (ఖుర్‌ఆన్ 41 : 5)**

పైన పేర్కొనబడిన దివ్య ఖుర్‌ఆన్ వాక్యాల ప్రకారం హృదయాలు జబ్బు పడవచ్చు. కప్పివేయబడవచ్చు. తాళం వేయబడి ఉండవచ్చు. ఇంకా అవి మృతప్రాయమూ కావచ్చు. దైవ విరోధులకు కూడా అంతరాత్మలు ఉంటాయి. కాని వారు ఆ అంతరాత్మ ప్రబోధనను అణచిపెట్టుకొని జీవిస్తుంటారు. " ఓ హృదయాలను మార్చే ప్రభూ! నా హృదయాన్ని నీ ధర్మానికి కట్టుబడేలా చెయ్యి" అని దైవప్రవక్త (స) తరచూ అల్లాహ్‌ను ప్రార్థించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం.

రమజాన్ నెలలోగాని, రమజానేతర మాసంలో గాని ఒక విశ్వాసి హృదయం నిత్యం ఉపవాసం పాటిస్తూనే ఉంటుంది. మరి హృదయ ఉపవాసం ఏమిటీ? అని ఆశ్చర్యపోవద్దు. హృదయం నుంచి అవినీతిని శుభ్రం చేయాలి. నాస్తికత్వాన్ని, బహు దైవారాధనను, తౌహీద్‌కు విరుద్ధ, విద్రోహ భావాలను మనసు నుంచి కడిగివేయాలి. మూఢనమ్మకాలు, దురూహలు, తుచ్ఛ కోరికలు సమసిపోవాలి. మనసు నిండా నిజమైన ఏకదైవారాధనా సుగంధం పరిమళిస్తూ ఉండాలి. ఒక విశ్వాసి హృదయం మాత్రమే ఆ విధంగా అల్లాహ్ పట్ల ప్రేమతో నిండి ఉంటుంది. అల్లాహ్ తన గురించి వివరించినట్టుగా అది ఆయన్ని ఆయన నామాలతో, గుణగణాలతో సహా గుర్తిస్తుంది.

విశ్వాసి హృదయం నిరంతర తేజస్సుతో వెలిగిపోతూ ఉంటుంది. అది తనలో



ఎటువంటి అంధకారాన్నీ ప్రసరించనీయదు. దివ్య సందేశ, దైవిక బోధనల, సర్వ శక్తివంతమైన సంవిధానపు వెలుగు అది. దాంతోపాటు అల్లాహ్ తన దాసులను సృష్టించిన సహజమైన వెలుగూ దానికి జోడించబడింది. ఆ విధంగా రెండు మహా వెలుగులు ఏకమయ్యాయి.

**"కాంతిపై కాంతి వుంది. అల్లాహ్ తాను కోరిన వారికి తన కాంతి వైపు మార్గదర్శకత్వం వహిస్తాడు. ప్రజలకు (విషయం అర్థం అవటానికి) ఈ ఉపమానాలను అల్లాహ్ విశదపరుస్తున్నాడు. అల్లాహ్‌కు అన్ని విషయాలు క్షుణ్ణంగా తెలుసు." (ఖుర్‌ఆన్ 24 : 36)**

విశ్వాసి హృదయం దీపంలా వెలుగుతూ ఉంటుంది. సూర్యుడిలా ప్రకాశిస్తుంది. ఉషోదయపు వెలుగులా మెరుపులీనుతుంది. ఖుర్‌ఆన్ వాక్యాలు విన్నప్పుడల్లా అందులోని విశ్వాసం మరింత ఉప్పొంగుతుంది. ఆ వాక్యాలపై మనసు పెట్టి ఆలోచించిన వారి హృదయాల్లో విధేయతా భావం పొంగిపోర్లుతుంది. మరి ఆ విధేయతా భావమే ప్రతిఫలించినప్పుడు మనిషిలో మార్గదర్శనం వికాసమొందుతుంది.

విశ్వాసి హృదయం గర్వాన్ని దరిచేరనీయదు. గర్వం హృదయ ఉపవాసాన్ని భంగపరుస్తుంది. కనుక దానికి విశ్వాసి హృదయంలో అసలు చోటే లేదు. గర్వం నివసించే, పెరిగే స్థానం హృదయం. ఏ మనిషి మనసులో అది పాగా వేస్తుందో ఆ మనిషిని మూర్ఖునిగా, అహంభావిగా మారుస్తుంది.

" హదీసె ఖుద్‌సీ" అంటే ఏమిటో తెలుసు కదా! అల్లాహ్ మాటలను ప్రవక్త తన నోటితో పలికిందే "హదీసె ఖుద్‌సీ". అటువంటి ఒక హదీసులో అల్లాహ్, "గౌరవం నా పైవస్త్రం. అహంకారం నా క్రింది వస్త్రం. ఎవరయినా వాటిని లాక్కోవాలని ప్రయత్నిస్తే నేనతణ్ణి శిక్షిస్తాను" అని పలికినట్లు దైవప్రవక్త (స) తెలియజేశారు. "అల్లాహ్ ముందు గర్వం ప్రదర్శించినవాని గర్వాన్ని అల్లాహ్ అణచివేస్తాడు. దీనికి భిన్నంగా అల్లాహ్ పట్ల అణకువను ప్రదర్శించిన వ్యక్తి స్థానాలను ఆయన ఉన్నతం చేస్తాడు" అని కూడా దైవప్రవక్త (స) మరో సందర్భంలో పలికి ఉన్నారు.

విశ్వాసి హృదయం ఉపవాసం పాటించి అహంకారానికి దూరంగా ఉంటుంది. గర్వానికి లోనైనవాడు తనను తాను సక్రమునిగా, ఇతరుల కన్నా ఉత్తమునిగా ఊహించుకుంటాడు. తానే సుగుణవంతుడననీ, ఇతరులెవరిలోనూ అటువంటి సుగుణాలు లేవనీ తలంచుతాడు. కాని నిజానికి అతని ఈ అనుచిత

భావనే అతని పతనానికి నాందీ వాచకం అవుతుంది. కనుక గర్వం ఒక రోగం. మనిషి తనలో ఉన్న లోపాలను తెలుసుకోవటం, తన వల్ల జరిగిన తప్పులను, పాపాలను ఒప్పుకోవటమే అతనిలోని గర్వానికి చికిత్స. ఒక గర్విష్టి తన లోపాలను, తన తప్పులను తాను మరిచిపోవచ్చు. కాని అతన్ని పుట్టించిన ప్రభువుకు మాత్రం అవి తెలియకుండా ఉండవు. విశ్వ ప్రభువైన అల్లాహ్ మరిచిపోయేవాడూ కాదు, మార్గం తప్పేవాడు కూడా కాదు.

విశ్వాసి హృదయం ఉపవాసం పాటిస్తుంది. అసూయకు దూరంగా ఉంటుంది. ఎందుకంటే అసూయ పుణ్యకార్యాలను పతనం చేస్తుంది. హృదయ జ్యోతిని ఆర్పివేస్తుంది. సర్వోన్నతుడైన అల్లాహ్ వైపు పురోగమనాన్ని నిరోధిస్తుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రజలకు ప్రసాదించిన దానిపై వారు అసూయ పడుతున్నారా?" (ఖుర్‌ఆన్ 4 : 54)**

అంతేకాదు, "పరస్పరం అసూయ చెందకండి. క్రయవిక్రయాల సమయంలో (కొనే ఉద్దేశం లేకుండానే) బేరం మీద బేరం చేస్తూ (వస్తువు) ధరను పెంచి మోసానికి పాల్పడకండి" అని దైవప్రవక్త (స) కూడా మనకు బోధించి ఉన్నారు.

దైవప్రవక్త (స) తన సహచరుల్లో ఒకరితో, "నీవు స్వర్గస్తులలో ఉంటావు" అని చెప్పారు. ఈ మాట ఆయన మూడు సార్లు అన్నారు. ఏ పని మూలంగా నీకు స్వర్గంలో స్థానం లభించి ఉంటుందని నీవు అనుకుంటున్నావు? అని ఆ వ్యక్తిని ఎవరో ప్రశ్నించగా, " ఏ ముస్లిం పైనా అసూయ, పగ, దగాకోరు భావాలను మనసులో ఉంచుకొని నేను నిద్రపోను" అని ఆ వ్యక్తి సమాధానమిచ్చాడు. మరి ఇక విజ్ఞులై ఉపవాసం పాటించే హృదయులు ఎవరూ మనలో లేరా? విజ్ఞతతో పాటించే ఉపవాసానికి పరమ ప్రభువుతో, ప్రత్యేకమైన, ప్రగాఢమైన అనుబంధం ఉంటుంది. అటువంటి మనసులు ఎల్లవేళలా ఉపవాసం పాటిస్తుంటాయి. ప్రాతఃకాల వేళల్లో క్షమాభిక్ష కోసం ప్రార్థిస్తూ ఉంటాయి.

ఓ అల్లాహ్! ఓ సకల లోక ప్రభువా! మా హృదయాలకు సన్మార్గం చూపు. మాకు దృఢవిశ్వాసం కలిగించు.



## పాఠం 9

# "నోరు" కూడా ఉపవాసం పాటిస్తుంది

నోటికి ఓ ప్రత్యేకమైన ఉపవాసం ఉంది. విశ్వాసులందరికీ తెలిసిన విషయమే అది. రమజాన్ కానివ్వండి, రమజానేతర మాసం కానివ్వండి, నోటి ఉపవాసం అనేది ఒక విశ్వాసికి ఉండే శాశ్వత లక్షణం. అయితే రమజాన్ మాసంలో దీనికి మరింత క్రమశిక్షణ అలవడటం విశేషం. ఒకసారి దైవప్రవక్త (స) ముఆజ్ (రజి)తో, "దీనిని అదుపులో పెట్టుకో" అని నాలుక వైపు చూపిస్తూ అన్నారు. అందుకు ముఆజ్ (రజి), "దైవప్రవక్తా! మనం నోటితో మాట్లాడేదాని గురించి కూడా నిలదీయబడతామా?" అని అడిగారు. అందుకాయన, " నాలుకలు కోత కోసిన పొలాలే నరకవాసులను, నరకంలో బోర్లా పడవేస్తాయి" అని చెప్పారు.

నాలుక వల్ల కలిగే హాని మామూలు హాని కాదు. అది అతి భయంకరమైనది. ప్రముఖ దైవప్రవక్త సహచరులు (సహాబీ) అబూబక్ర్ (రజి) తన నాలుకను పట్టుకొని, "నన్ను ఈ స్థితిలో ఉంచినది ఇదే!" అని అంటుండేవారు. పాము కాట్లు, నిప్పు వాతల్లాగా మనిషి నాలుక ఏడు విధాలుగా ఎదుటి వారిని గాయపరచ గలదు. మన నాలుకలతో మనం ఎదుటివారి తప్పులను ఎత్తి చూపరాదు. మనందరి వల్లా తప్పులు జరుగుతాయి. మనందరిలోనూ లోపాలు ఉన్నాయి. కనుక ఎదుటివారికీ నాలుకలు ఉన్నాయన్న సంగతి మనం మరిచిపోరాదు.

దైవప్రవక్త (స) సహచరులైన ఇబ్నె అబ్బాస్ (రజి), "ఓ నాలుకా! ఏదయినా మంచి మాట పలికి మంచిని మూటగట్టుకో. అది నీ వల్ల కాకపోతే కనీసం చెడు పలుకులకు దూరంగా ఉండు. ఆ విధంగానైనా నిన్ను నువ్వు రక్షించుకో" అని తన నాలుకను ఉద్దేశించుకొని చెబుతుండేవారు. ఒకానొక ముస్లిం తన నాలుకను ద్రోహం నుంచి కాపాడుకున్నాడు, చాడీలకు దూరంగా ఉన్నాడు, వ్యర్థమైన మాటలు మానుకున్నాడు, నిషిద్ధాల నుంచి తన నాలుకను పరిశుద్ధంగా ఉంచుకున్నాడు. ఫలితంగా అల్లాహ్ ఆ వ్యక్తిని కరుణించాడు. ఆలోచించి, ఆచితూచి మాట్లాడేవారు

అల్లాహ్ చేత కనికరించబడతారు. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవీయబడింది :

**"(మనిషి) నోట ఒక మాట వెలువడటమే ఆలస్యం, అతని దగ్గర ఒక పర్యవేక్షకుడు (దాన్ని నమోదు చేయటానికి) సిద్ధంగా ఉంటాడు."**

**(ఖుర్ఆన్ 50 : 18)**

ప్రతి మాట నమోదు చేయబడుతుంది. ప్రతి పదమూ తూయబడుతుంది.

**"ఎవరయినా సత్కార్యం చేస్తే తన మేలు కోసమే చేసుకుంటాడు. మరెవరయినా దుష్కార్యానికి ఒడిగడితే దాని దుష్ఫలితం అతని మీదే పడుతుంది. నీ ప్రభువు మాత్రం (తన) దాసులకు అన్యాయం చేసేవాడు కాడు."** **(ఖుర్ఆన్ 41 : 46)**

"ఎవరయితే తమ రెండు దవడల మధ్యనున్న దాని గురించి, రెండు కాళ్ళ మధ్యనున్న దాని గురించి నాకు పూచీ ఇస్తారో నేను వారికోసం స్వర్గం గురించి పూచీ ఇస్తాను" అని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) చెప్పారు.

సదాచార సంపన్నులైన పూర్వీకులు ఖుర్ఆన్ మరియు హదీసులు బోధించిన నైతిక చట్రంలో తమ జీవన విధానాన్ని క్రమబద్ధీకరించు కున్నారు. వారు ఏదయినా మాట్లాడవలసి వస్తే ఆచి తూచి మాట్లాడేవారు. ఏ సందర్భంలోనయినా ధర్మోచిత పదాలనే ఉపయోగించేవారు. వారి పలుకుల్లో అల్లాహ్ ధ్యానం ఉట్టిపడుతూ ఉండేది. వారి దృష్టి గుణపాఠం గరిపినట్టు ఉంటుంది. వారి మౌనం మంచి ఆలోచనలకు స్థానం అవుతుంది. ఒకే ఒక్కడు, సర్వాధిక్యుడు, విశ్వ ప్రభువు అయిన అల్లాహ్‌ను కలుసుకోవలసి ఉందన్న తలంపు రాగానే ఆయన స్మరణలో, ఆయన ప్రశంసా జలంలో నిత్యం వారి నాలుకలు తడిసి ఉండేవి. వారు అబద్ధాలకు, మోసాలకు దూరంగా ఉండేవారు. "అల్లాహ్ సాక్షి! నాలుకను అదుపులో పెట్టుకోవటం కంటే ఎక్కువ యోగ్యమైన విషయం ఏదీ లేదు" అని ప్రముఖ దైవప్రవక్త సహచరులు (సహాబీ) ఇబ్నె మస్ఊద్ (రజి) వ్యాఖ్యానించారు. సదాచార సంపన్నులు మాట్లాడ వలసి వస్తే, ఫలితం గురించి ఆలోచించి మాట్లాడతారు. దుష్పరిణామాలు ఎదురయే సూచనలు కనిపిస్తే మాత్రం మౌనం వహించి వాటి చెడు పర్యవసానం నుంచి ముక్తి పొందుతారు.

ఒక వ్యక్తి ఉపవాసం ఉండి తన నాలుకను విచ్చలవిడిగా వినియోగించటమా? అసలు జరిగే విషయమేనా అది? ఒక మనిషి ఉపవాసం పాటిస్తుండగా అతని నాలుక



అతనితో నాటకాలాడుకోవటం, అతని మాటలు అతన్ని మోసగించటం, అతని దుష్ట తర్కం అతన్ని భ్రష్ట మార్గాన తీసుకెళ్ళటం అసలు ఇవి సంభవమేనా? ఒక మనిషి ఉపవాసం ఉండి అబద్ధం ఎలా చెప్పగలడు? చాడీలు ఎలా చెప్పగలడు? ఇతరులను ఎలా దూషించగలడు? ప్రతిఫల దినాన్ని ఎలా విస్మరించగలడు? ఒకవైపు ఉపవాసం ఉన్నానని చెబుతూ మరోవైపు అబద్ధపు సాక్ష్యం చెప్పేవాడిని, తోటి ముస్లింలకు క్షోభ పెట్టేవాడిని అసలు "ఉపవాసి" అని పరిగణించటానికి ఎక్కడ వీలుంటుంది? "తన మాటల ద్వారా, చేతల ద్వారా ఇతర ముస్లిములకు హాని కలిగించనివాడే ముస్లిం" అని దైవప్రవక్త (స) నొక్కి వక్కాణించారు కదా! ఇస్లాం అంటే కర్మలు, ఆచరణలు, సూత్రబద్ధ విధానం, స్వయం సమర్పణ, ప్రవర్తన, అనువర్తన కాకుండా మరిం కేదయినా కొత్త విషయమా? కాదు కదా! దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

**"(ఓ ప్రవక్తా!) నా దాసులతో, వారు తమ నోట అత్యంత మంచిమాటలనే పలకాలని చెప్పు. ఎందుకంటే షైతాన్ వారి మధ్య కలతలు రేపుతాడు. నిశ్చయంగా షైతాన్ మానవుని పాలిట బహిరంగ శత్రువు."**

**(ఖుర్ఆన్ 17 : 53)**

మనుషులు ఏ వ్యక్తినీ, ఏ వర్గాన్నీ కించపరచని మాటలే పలుకుతుండాలని పై దివ్య ఖుర్ఆన్ వాక్యంలో బోధించబడింది. ఒక ముస్లిం గౌరవాన్ని భంగపరచని రీతిలో, ఒక విశ్వాసి హుందాతనాన్ని అగౌరవపరచని ధోరణిలో పలికేదే పైన ప్రబోధించబడిన "మంచి మాట" అని మనం అర్థం చేసుకోవాలి.

దివ్య ఖుర్ఆన్‌లోనే మరో చోట ఇలా ఉపదేశించబడింది:

**"ఓ విశ్వాసులారా! అతిగా అనుమానించటానికి దూరంగా ఉండండి. కొన్ని అనుమానాలు పాపాల క్రిందికి వస్తాయి సుమా! కూపీలు లాగకండి. మీలో ఎవరూ ఇంకొకరి గురించి వీపు వెనుక చెడుగా (చాడీలు) చెప్పుకోకూడదు. ఏమిటి, మీలో ఎవరయినా చచ్చిపోయిన మీ సోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా?"** **(ఖుర్ఆన్ 49 : 12)**

తమ నాలుకలను దుర్వినియోగం చేసుకొని, సహేతుకం కాని లాజిక్కులతో సందిగ్ధమైన మాటలు మాట్లాడుతూ తమ ఉపవాసాలను నిర్వీర్యం చేసుకునేవారు మనలో ఎందరు లేరు? ఉపవాసం అంటే ఆకలి దప్పులకు తట్టుకోవటం కాదు.

క్రమశిక్షణకు, ధార్మిక మనోవికాసానికి మారుపేరే ఉపవాసం. నాలుకను అదుపులో పెట్టుకోకపోతే అసత్యం, అబద్ధపు సాక్ష్యం, అభిశాపం, అపనిందలు, అవహేళన, చాడీలు, చులకన దృష్టి, దూషణలు, నీతి బాహ్యత, నిర్లజ్జ మొదలగు అకృత్యాలు జరగటానికి వీలుంది. నోటి దురుసుతనంతో ఒకరి నుంచి వెలువడిన ఒక చిన్న మాట వారిని నరకంలో బోర్లా పడేయవచ్చు.

నోరే నరకం, నోరే నాకం అన్నారు పెద్దలు. నోటి ద్వారా మంచీ జరగవచ్చు. చెడు కూడా జరగవచ్చు. మరి అల్లాహ్‌ను స్మరిస్తూ, ఆయన మన్నింపును వేడుకుంటూ, ఆయన్ను ప్రస్తుతిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడుతూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, తమ నాలుకల ద్వారా పశ్చాత్తాప భావాన్ని వ్యక్తం చేసేవారు ఎంతటి మానసిక ఆనందాన్ని అనుభవిస్తారు?! ఇందుకు భిన్నంగా పరుల కీర్తికి కళంకం వాటిల్లజేయటానికి, పవిత్రతను కాలరాయటానికి, విలువల్ని మంట గలపటానికి తమ నాలుకలను వినియోగించేవారు ఎంతటి నిరాశా నిస్పృహలకు లోనవుతారు?! ఓ ఉపవాసులారా! అల్లాహ్ ధ్యానజలంతో ఎప్పుడూ మీ నాలుకలను తడిగా ఉంచుకోండి. అల్లాహ్ స్మరణతో వాటిని సక్రమంగా వినియోగిస్తూ ఉండండి. నిషిద్ధాల నుంచి వాటిని పరిశుద్ధపరచుకోండి.

ఓ అల్లాహ్! మాకు నిజం పలికే నాలుకలను, స్వచ్ఛమైన హృదయాలను, ఉత్తమ నడవడినీ అనుగ్రహించు.



# పాఠం 10 "కన్ను" ఉపవాసం పాటించే విధానం

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. మరి కన్ను కూడా ఉపవాసం పాటిస్తుందండోయ్! అదెలాగో చూద్దాం. అశ్లీలాన్ని, నిషిద్ధ దృశ్యాలను చూడకుండా ఉండటం, అవి ఎదురైనప్పుడు చూపుల్ని క్రిందికి వాల్చి ఉంచటం, ధార్మిక విషయాల వైపు దృష్టిని కేంద్రీకరించి ఉంచటం – ఇదే కళ్లు పాటించే ఉపవాసం. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**"(ఓ ప్రవక్తా!) ముస్లిం పురుషులు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, వారు తమ మర్మస్థానాలను కాపాడుకోవాలనీ, అది వారికొరకు పవిత్రమైనదని వారితో చెప్పు. వారు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.**

**(ఓ ప్రవక్తా!) ముస్లిం స్త్రీలు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, తమ మర్మస్థానాలను రక్షించుకోవాలనీ, బహిర్గతమై ఉండేది తప్ప– తమ అలంకరణను బహిర్గతం చేయరాదనీ, తమ వక్షస్థలాలపై ఓణీలు వేసుకోవాలనీ, తమ భర్త లేక తమ తండ్రి లేక తమ మామగారు లేక తమ కొడుకులు లేక తమ భర్త కొడుకులు లేక తమ సోదరులు లేక తమ సోదరుల కుమారులు లేక తమ అక్కాచెల్లెళ్ల కొడుకులు లేక తమతో కలిసిమెలిసి ఉండే స్త్రీలు, లేక తమ బానిసలు లేక ఇతరత్రా ఉద్దేశాలు లేకుండా తమకు లోబడి ఉన్న పురుష సేవకులు లేక స్త్రీల గుప్త విషయాల గురించి ఇంకా తెలియని బాలురు – వీళ్ల ఎదుట తప్ప ఇతరుల ఎదుట తమ అలంకరణలను (అందచందాలను) కనబడ నివ్వకూడదనీ, దాగివున్న తమ అలంకరణ ఇతరులకు తెలిసిపోయేలా తమ కాళ్ళను నేలపై కొడుతూ నడవరాదని వారితో చెప్పు. ముస్లింలారా! మీరంతా కలసి అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపం చెందండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు."**

**(ఖుర్ఆన్ 24 : 30 – 31)**

నయనం హృదయానికి ద్వారం. మనసును చేరే మార్గం. నాల్గవ ఖలీఫా అలీ (రజి) దైవప్రవక్త (స)ను, "చూపు"ని గురించి అడిగారు. అందుకాయన అలీ (రజి)కు "చూపుల్ని క్రిందికి వాల్చి ఉంచమ"ని ప్రబోధించారు. మొత్తానికి చూపుల్ని క్రిందికి వాల్చి ఉంచనివారు ఈ క్రింది నాలుగు ఆపదల్లో చిక్కుకోవటం ఖాయం.

1) చూపుల్ని గనక క్రిందికి వాల్చి ఉంచకపోతే మనసు నలుదిక్కులూ నావే నంటుంది. విచ్చలవిడిగా విహరిస్తూ పోతుంది. అన్ని వైపులా పరుగులు తీస్తుంది. దానివల్ల మనసులో స్థిరత్వం ఉండదు. అంతర్గత సుఖాన్ని కోల్పోతుంది. తన శక్తియుక్తుల్ని ప్రేరేపించుకోలేక పోతుంది. అనువుగాని చోట తలదూర్చి అభాసుపాలవుతుంది. ఇలాంటి సందర్భాల్లో కొన్ని అనూహ్య పరిణామాలు మనసును తీవ్రంగా గాయపరుస్తాయి. దాని శక్తి బలహీనమవు తుంది. ఆఖరికి అన్నిట్లోనూ విఫలమవుతుంది. తర్వాత ఆ నేరం తనది కాదంటూ కళ్ల నిర్వాకాన్ని ఆడిపోసుకుంటుంది. బాధతో కుమిలిపోతుంది.

2) రమ్యంగా ఉండే ప్రతిదాన్నీ కళ్లు కావాలనే అనుకుంటాయి. కాని అవి దొరకవు కదా! ఆ పరిస్థితి ఆత్మకు అమితంగా క్షోభ పెడుతుంది. కళ్లు క్షణికానందం కోసం అల్లరి చిల్లరి చూపులు విసరుతూ ఉంటాయి. కాని దాని మూలంగా మనసు సుదీర్ఘ కాలంపాటు ఆందోళనకు, నిరాశా నిస్పృహలకు లోనవుతూ ఉంటుంది.

3) కళ్లు నిషిద్ధ దృశ్యాల్ని తిలకించటం ఆరంభించినప్పుడు లోపల మనసు ఆరాధనా మాధుర్యాన్ని కోల్పోతూ ఉంటుంది. తర్వాత మెల్లగా వినయ విధేయతలు అంతరంగం నుంచి సెలవు తీసుకుంటాయి. అప్పటికైనా కళ్ళను కట్టడి చేసి నీతిబాహ్య దృశ్యాల్ని చూడకుండా నయనోపవాసం పాటించుకుంటే సరి; లేకపోతే ఆ తర్వాత మెల్లగా మనసు నుంచి విశ్వాసం (ఈమాన్) కూడా బిచాణా ఎత్తేస్తుంది. మొత్తానికి దృష్టిని అదుపులో పెట్టుకోనిదే మనసులు విశ్వాస మాధుర్యాన్ని, ఆరాధనలో తృప్తినీ ఆస్వాదించలేవన్నమాట.

4) ఎదుటివారి గౌరవాన్ని కాలరాచి, వారి రహస్య విషయాలను తరచి తరచి చూచే నికృష్ట కళ్లు ఘోరపాపాన్ని మూటగట్టుకుంటున్నాయి. సామాన్యంగా కళ్లు చెడుని మంచిగా తలంచి మోసపోతాయి. మనసులో ఉత్సాహం ఉరకలు వేస్తుంది.



తర్వాత ఆ మార్గంలో ముందుకు పోవాలని పరితపిస్తాడు మనిషి. కొద్ది దూరం నడిచాక తాను అశ్లీల బురదలో మునిగి ఉన్నట్టు తెలుసుకుంటాడు. అంతలోనే భ్రష్టత్వ ఊబి అతన్ని లోనికి లాక్కుంటుంది.

"నేనొక నిషిద్ధ దృశ్యాన్ని చూసి ఖుర్‌ఆన్ మరిచిపోయాను" అని వాపోతూ చెప్పారు సదాచార సంపన్నులైన మన పూర్వీకుల్లో ఒకరు. కనుకనే కళ్లను వాసన పసిగట్టి వేటాడే జంతువులుగా భావించారు మన పెద్దలు. వాటిని విచ్చలవిడిగా వదిలేస్తే అవి చెడు వెనుక పరుగెత్తుతూ ఉంటాయి. ఆఖరికి ఆ చెడుని వేటాడిగాని అవి వదలిపెట్టవు. అలాగాకుండా వాటికి గంతలు కడితే తోకముడుచుకొని మెదడు చెప్పినట్టు మసలుకుంటాయి. మరొకరు ఈ విషయాన్ని మరింత చక్కగా వర్ణించారు, "కనుల కళ్లెములు అదుపు తప్పితే అవి నిన్ను క్రిందపడేస్తాయి. నీవు వాటి మీద ఆధీనం కోల్పోయినప్పుడు అవి నిన్ను బాధించిగాని వదలిపెట్టవు."

# పాఠం 11

# వీనుల ఉపవాసం

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ మనకు ఇలా ప్రబోధించాడు:

**"నీవు తెలుసుకోవలసిన అవసరం లేని విషయాల వెంటపడకు. ఎందుకంటే చెవి, కన్ను, హృదయం - వీటన్నింటి గురించి ప్రశ్నించటం జరుగుతుంది."**
**(ఖుర్‌ఆన్ 17 : 36)**

చెవులు తాము విన్న విషయాల గురించి అల్లాహ్ దగ్గర బాధ్యత వహించ వలసి ఉంటుంది. సత్యాన్ని శ్రద్ధగా ఆలకించి సక్రమంగా దాన్ని ఆచరించినవారే సదాచార సంపన్నులు. మరి దీనికి భిన్నంగా సత్యవాక్కును పెడచెవిన పెట్టి, రుజుమార్గం కనిపించినప్పుడు కళ్ళు మూసుకొని గుడ్డివారుగా నటించేవారు రేపు ప్రళయ దినాన తీవ్ర పశ్చాత్తాపానికి లోనవుతారు.

అశ్లీలాన్నీ, సంగీత ధ్వనులనూ, ఇంకా ఇతర నీతిబాహ్య శబ్దాలనూ వినకుండా చెవులు కూడా ఉపవాసం పాటిస్తాయి. ఇక సదాచార సంపన్నులకయితే రమజాను, రమజానేతర మాసాలు అన్న భేదం లేదు. అల్లాహ్‌కు ఆగ్రహం కలిగించే ఏ శబ్దాన్నీ వారు తమ చెవుల పడనీయరు. దీనికి భిన్నంగా అల్లాహ్ తమకు అనుగ్రహించిన శరీరావయవాలను చాలామంది సద్వినియోగం చేసుకోరు. ఇలాంటి వారి గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"ఎంతోమంది జిన్నులను, మానవులను మేము నరకం కోసం పుట్టించాము. వారికి హృదయాలున్నాయి. కాని వాటితో వారు ఆలోచించరు. వారికి కళ్లున్నాయి. కాని వాటితో వారు చూడరు. వారికి చెవులున్నాయి. కాని వాటితో వారు వినరు. వారు పశువుల్లాంటివారు. కాదు, వాటికన్నా ఎక్కువగానే దారి తప్పారు. - పరధ్యానంలో పడిపోయినవారంటే వీరే."**
**(ఖుర్‌ఆన్ 7 : 179)**

నిజమే కదా! వారికి లక్షణంగా చెవులుంటాయి, కాని సత్యవాణి వారి చెవులకు



సోకదు. మంచిని పట్టించుకోని మనసు ఉంటుంది. దానివల్ల వారికి ఏం ప్రయోజనం చెప్పండి? మనుషుల్లో చాలామంది వినికిడి శక్తి పశువుల కంటే అద్భుతంగా ఏమీ లేదు. సత్యం విన్నప్పుడు వారిలో స్పందన ఉండదు. ధర్మ సందేశం వారి కర్ణపుటలను తాకి వెనక్కి వచ్చేస్తుంది. వారి శ్రవణ శక్తి మూలంగా వారికి ఎలాంటి శుభం గాని, ప్రయోజనం గాని కలగదు. అలాంటప్పుడు వారు సన్మార్గం గురించి యోచిస్తారని అనుకుంటే అది అత్యాశే అవుతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"ఏమిటీ, వారిలో అత్యధికమంది వింటారనీ, అర్థం చేసుకుంటారని నువ్వు (ఇప్పటికీ) అనుకుంటున్నావా? వారు వట్టి పశువుల్లాంటివారు. పైగా వాటికన్నా ఎక్కువగా దారి తప్పారు."** **(ఖుర్‌ఆన్ 25 : 44)**

తమ చెవులను నిషిద్ధ శబ్దాలతోనూ, పాప పంకిల పదాలతోనూ నింపుకునే వారు ఈ ప్రపంచంలో కోకొల్లలు. అటువంటి దురదృష్టవంతుల చెవులకు దివ్య ఖుర్‌ఆన్ పారాయణం ఇంపుగా అనిపించదు. నిజానికి దివ్య ఖుర్‌ఆన్ వాణి అత్యంత మధురమైనది. దాని పారాయణం ప్రపంచంలోని స్వరాలన్నిటి కన్నా శ్రావ్యమైనది. ప్రపంచ పుస్తకాల్లోకెల్లా అతి ఉత్తమమైన, అత్యంత విలక్షణమైన గ్రంథరాజం ఖుర్‌ఆన్. అన్నిటినీ మించి మనిషిని సృష్టించిన విశ్వప్రభువు మానవాళి హితం కోరి అవతరింప జేసిన ధర్మసహిత గ్రంథం. ఖుర్‌ఆన్ పారాయణం వింటే విశ్వాసం వృద్ధి చెందుతుంది. రుజుమార్గం బోధపడుతుంది. జీవితంలో చీకట్లు తొలగిపోయి వెలుగు వస్తుంది. భోగభాగ్యాలు ప్రాప్తిస్తాయి. హృదయం వివేకంతో, శాంతితో, అంతకు ముందెన్నడూ చవిచూడని ఆత్మతృప్తితో నిండిపోతుంది. అతి ప్రమాదకరమైన, మార్గభ్రష్టత్వానికి దారితీసే పాపాల నుంచి హృదయ పరిరక్షణకు ఖుర్‌ఆన్ చదవటం, వినడం అతి శక్తివంతమైన సాధనం. ఖుర్‌ఆన్ పారాయణాన్ని శ్రద్ధగా ఆలకించటం వల్ల మనిషిలోని శ్రవణ శక్తి చురుకుగా పనిచేస్తుంది. దానివల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ధ్యానం, ఏకాగ్రత అలవడతాయి. ప్రయోజనకరమైన జ్ఞానం పెంపొందుతుంది. మెదడు మంచి సలహాలను స్వీకరించగలుగుతుంది. మనిషి దేహం మంచి అలవాట్లకు ఆలవాలమవుతుంది. మధుర భాష్యం కలుగుతుంది.

ఒకసారి అబూ హాతిమ్ మదీనా నగరంలోని ఓ దారి గుండా వెళ్తున్నారు. ఎవరో ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్నట్టు ఆయన చెవులకు వినపడింది. కాస్త ఆలకించి చూశారు. ఎవరో వృద్ధ మహిళ ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్నట్టు ఆయన

అర్థం చేసుకున్నారు. ఆమె ఇంటి తలుపు చాటున నిలబడి ఆయన ఖుర్‌ఆన్ పారాయణం వినసాగారు. ఆమె విలపిస్తూ, "క్రమ్ముకునే ఆపద గురించిన వార్త గాని నీకు చేరిందా?" (హల్ అతాక హదీసుల్ గాషియహ్) అనే ఆయతునే మాటిమాటికీ పారాయణం చేస్తోంది. ఖుర్‌ఆన్ పారాయణం వినగానే ఇటు అబూ హాతిమ్ కూడా ఉద్వేగానికి లోనయ్యారు. అప్రయత్నంగానే ఆయన, "ఔను నాకు చేరింది, ఔను నాకు చేరింది" అని అనడం మొదలుపెట్టారు.

శ్రద్ధగా దివ్య ఖుర్‌ఆన్ పారాయణం ఆలకించేవారిని అల్లాహ్ ఈ విధంగా ప్రశంసించాడు:

**"ప్రవక్తపై అవతరించిన దానిని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన కారణంగా వారి కళ్ళ నుంచి కన్నీరు ప్రవహించటం నీవు గమనిస్తావు. వారిలా అంటారు : "మా ప్రభూ! మేము విశ్వసించాము. కాబట్టి మా పేర్లను కూడా ధృవీకరించేవారితో పాటు వ్రాసుకో." (ఖుర్‌ఆన్ 5 : 83)**

ఈ విధంగా ఉపవాసుల శ్రవణేంద్రియాలు దివ్య ఖుర్‌ఆన్ రూపంలో అతి ఉత్తమ, మధుర స్వరాలు వింటుండగా, మరోవైపు బుద్ధిహీనుల చెవులు అబద్ధాలు నిండిన, నీచ, నికృష్ట, నాశిరకపు పాటలు, సంగీత రణగొణ ధ్వనుల్లో ఆత్మ శాంతిని వెతుక్కునేందుకు విఫల ప్రయత్నం చేస్తున్నాయి. మరి అటువంటి పాపభూయిష్ట స్వరాలను ఒక ముస్లిం వింటే ఏమవుతుంది? అతని హృదయ ఆలయం కూలి పోతుంది. మంచి చెడులను ఎంపిక చేసుకునేందుకు అల్లాహ్ అతనికి ప్రసాదించిన స్వేచ్ఛ దుర్వినియోగం అవుతుంది. అతని అంతర్గత విజ్ఞానవనం ఒక్కసారిగా అల్లకల్లోలానికి గురవుతుంది.

పై ఇరు రకాల మనుషుల గురించి దివ్య ఖుర్‌ఆన్ ఎంత చక్కగా వర్ణిస్తుందో చూడండి:

**"ఏదైనా ఒక సూరా అవతరించినప్పుడల్లా కపటుల్లోని కొందరు, "ఈ సూరా మీలో ఎవరి విశ్వాసాన్ని వృద్ధి పరచింది?" అని (వెటకారంగా) అడుగుతారు. విశ్వాసుల విశ్వాసాన్ని ఈ సూరా వృద్ధిచేసింది. దానిపై వారు సంతోషిస్తున్నారు. కాగా; ఎవరి హృదయాలు రోగగ్రస్తమై ఉన్నాయో వారి అశుద్ధతలో ఈ సూరా మరింత అశుద్ధతను పెంచింది. ఆఖరికి వారు అవిశ్వాస స్థితిలోనే చచ్చారు." (ఖుర్‌ఆన్ 9 : 124, 125)**



సత్యం విన్నప్పుడు సత్యపథంలో నడుస్తున్న హృదయాలకు మరింత శక్తి, స్థిరత్వం లభిస్తాయి. దీనికి భిన్నంగా, అసత్యం విన్నప్పుడు దాని తాలూకు దుష్ప్ర భావాలు నిర్మలమైన హృదయంపై తిష్ఠ వేసేందుకు ప్రయత్నిస్తాయి. మనిషికి వినికిడి శక్తిని ప్రసాదించినది అల్లాహ్. మరి తనకు అంతటి మహోన్నతమైన వరాన్ని ప్రసాదిం చిన తన ప్రభువును స్తుతించటం ప్రతి ముస్లిం కర్తవ్యం. అంతేకాదు, అల్లాహ్ ప్రసా దించిన ఆ వరాన్ని కేవలం ఆయన ప్రసన్నత కోసం వినియోగించటం కూడా ప్రతి ముస్లిం తప్పనిసరి ధర్మం. అందుకు మంచి మార్గం ఖుర్‌ఆన్ పారాయణం. దాని అధ్యయనం. విద్యా వివేచనల ధార్మిక సమావేశాలతో సమ్మేళనం.

ఒక ముస్లిం అశ్లీలమైన, నీతిబాహ్యమైన స్వరాలను వినకుండా జాగ్రత్తపడాలి. అల్లాహ్ మార్గంలో వృద్ధి చెందటానికి అడ్డంకులుగా నిలిచే ఏ శబ్దమూ తన కర్ణపుట లకు తాకకుండా తన వీనులను కాపాడుకోవాలి.

**"వారు పనికిమాలిన వాటిని పట్టించుకోరు." (ఖుర్‌ఆన్ 23 : 3)**

**"వారు ఏదైనా పనికిమాలిన విషయం విన్నప్పుడు, వినీవిననట్లుగా తరలి పోతారు. 'మా కర్మలు మావి. మీ కర్మలు మీవి. అయ్యా! మీకో సలాం. అజ్ఞానులతో వాదించదలచుకోలేదు' అని చెప్పేస్తారు."**

**(ఖుర్‌ఆన్ 28 : 55)**

## పాఠం 12

# కడుపు కూడా ఉపవాసం పాటిస్తుంది

మనం తినే ఆహారం మన జీవితంపై, మన ప్రవర్తనపై, మన నీతి నడవడికలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ధర్మ సమ్మతమైన రీతిలో సంపాదించిన ఆహారం మనిషిలో మంచి అలవాట్లను, నీతి నడవడికలను పెంచి పోషిస్తుంది. అధర్మ సంపాదన మనిషిని చెడులకు ఆలవాలంగా మారుస్తుంది. అందుకే మానవుల్లోని అత్యుత్తమ వర్గమైన ప్రవక్తలకు సైతం అల్లాహ్ ఇదే ఆజ్ఞ ఇచ్చాడు:

**"ఓ ప్రవక్తలారా! పరిశుద్ధ వస్తువులు తినండి, సదాచరణ చేయండి. మీరు చేసేదంతా నాకు తెలుసు." (ఖుర్ఆన్ 23 : 51)**

అలాగే, విశ్వాసులను ఉద్దేశించి ఆయన ఇలా అంటున్నాడు:

**"ఓ విశ్వసించినవారలారా! మీరు కేవలం అల్లాహ్‌ను ఆరాధించేవారే అయితే మేము మీకు ప్రసాదించిన పవిత్రమైన వస్తువులను తినండి, త్రాగండి, అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపండి." (ఖుర్ఆన్ 2 : 172)**

మరి ఈ "పవిత్ర వస్తువులు" ఏమిటి? సర్వ శక్తివంతుడైన అల్లాహ్ తన ప్రవక్త (స) ద్వారా ధర్మ సమ్మతం చేసిన వస్తువులన్నీ పవిత్రమైనవే. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**" ప్రవక్త మంచిని చెయ్యమని వారికి ఆదేశిస్తాడు. చెడుల నుంచి వారిస్తాడు. పరిశుద్ధమైన వస్తువులను ధర్మ సమ్మతంగా ప్రకటిస్తాడు. అశుద్ధమైన వాటిని నిషిద్ధంగా ఖరారు చేస్తాడు." (ఖుర్ఆన్ 7 : 157)**

ధర్మ సమ్మతమైన వస్తువులను భుజించకుండా ఉండటమే "కడుపు ఉపవాసం". ఒక్క రమజాన్ నెలలోనే కాదు, కడుపుకు ఎల్లప్పుడూ ఈ ఉపవాసం విధి. ఆ విధంగా చూస్తే, ప్రతి విశ్వాసి కడుపు నిత్య ఉపవాసిగా ఉంటుంది. కనుక వడ్డీ లాంటి నిషిద్ధ సంపాదనను భుజించదు. అది అల్లాహ్ ఆగ్రహానికి అనునిత్యం



భయపడుతూ మసలుకుంటుంది. వడ్డీకి సంబంధించి అల్లాహ్ ముస్లింలకు ఏమని ఆదేశించాడో తెలుసా?

**"ఓ విశ్వసించిన వారలారా! ద్విగుణీకృతం, బహుగుణీకృతం చేసి వడ్డీని తినకండి. మీరు సాఫల్యం పొందటానికి గాను అల్లాహ్‌కు భయపడండి." (ఖుర్ఆన్ 3 : 130)**

అలా అని తక్కువ మొత్తంలో వడ్డీ తీసుకోవచ్చని తీర్మానించుకోకండి. తక్కువైనా, ఎక్కువైనా వడ్డీ వడ్డీయే. అది ధర్మ సమ్మతం కావటానికి అవకాశమే లేదు.

**"వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేసి, వడ్డీని నిషేధించాడు." (ఖుర్ఆన్ 2 : 275)**

"వడ్డీ సొమ్ము తినేవారిని అల్లాహ్ శపించాడు. వడ్డీ ఇచ్చేవాడు, ఆ వ్యవహారాన్ని రాసేవాడు, దానికి సాక్షులుగా ఉండేవారు అందరూ (ఆ పాపంలో) సమానులే" అని అంతిమ దైవప్రవక్త (స) తీర్మానించారు.

వడ్డీ సొమ్ము తినడంలో తప్పేమీ లేదని అనుకుంటున్నవారు ఆత్మ ద్రోహానికి పాల్పడుతున్నారు. అధర్మ సంపాదనతో కడుపు నింపుకోవటం వల్ల వారి ప్రార్థనలు స్వీకరించబడవన్న కఠోర సత్యాన్ని వారు తెలుసుకోవాలి. అధర్మ సంపాదన స్వీకృతి ద్వారాన్ని మూసివేస్తుంది. ఇక వారు తమ ప్రార్థనల్ని స్వీకరించమని అల్లాహ్‌ను ఎంత అరచి గీ పెట్టుకున్నా వారి ప్రార్థనలపై దేవుని ఆమోదముద్ర పడదు. దైవ ప్రవక్త (స) తన సహచరులకు ఒక వ్యక్తి పరిస్థితి గురించి వివరించారు. అతను ఎంతో దూరం నుంచి ప్రయాణం చేసి వస్తాడు. అతని ఒంటి మీద ప్రయాణ బడలిక స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. అతని బట్టలు మాసిపోయి ఉంటాయి. తల వెంట్రుకలు చిందర వందరగా ఉంటాయి. అతను ఆకాశంకేసి చూస్తూ చేతులు పైకెత్తి దీనాతి దీనంగా ప్రార్థిస్తాడు. కాని అతని ప్రార్థనకు అల్లాహ్ సన్నిధిలో స్వీకృతి లభించదు. ఎందుకంటే అతను తిన్నది అధర్మం. త్రాగినది అధర్మం. మరి అలాంటప్పుడు అతని ప్రార్థన ఎలా స్వీకరించబడుతుందండీ? ఆ వ్యక్తి ఇస్లాం మతంలోని ఇతర నియమాలను చాలా ఖచ్చితంగా ఆచరించాడు. రేయింబవళ్ళు అల్లాహ్‌ను ఆరాధించాడు. కాని అన్న పానీయాల విషయంలో మాత్రం ఘోరమైన పాపవైఖరిని అనుసరించాడు. తాను ఏం సంపాదిస్తున్నాడు? ఏం భుజిస్తున్నాడు? ఏం త్రాగు

తున్నాడు? అన్న విషయాల్లో అతను అల్లాహ్‌కు ఏమాత్రం భయపడలేదు.

ఒకని కడుపు వడ్డీ సంపాదనతో, అక్రమంగా కబళించిన అనాధుల సొమ్ముతో, మోసం చేసో లేక దౌర్జన్యానికి పాల్పడో సంపాదించిన డబ్బుతో పొట్ట పోసుకుం టుందనుకోండి. అలాంటి కడుపు ఉపవాసం పాటిస్తుందని భావించటానికి ఎక్కడ వీలుంటుంది? అన్న పానీయాలు కలుషితమైతే, వాటి రుచులు కూడా చేదుగా మారిపోతాయి. మరి కలుషిత అన్నపానీయాలతో పోషించబడిన హృదయమూ కర్కశంగా తయారవుతుంది. నిషిద్ధ ఆహార పానీయాలు సేవించినప్పుడు హృదయంలోని జ్ఞాన జ్యోతి కూడా ఆరిపోతుంది. ఒకసారి ప్రవక్త సహచరులు అబూబక్ర్ (రజి), తన సేవకుడు తన కోసం సమర్పించుకున్న ఆహార పదార్థం భుజిస్తున్నారు. మధ్యలో ఆయనకు ఏదో ఆలోచన వచ్చింది. వెంటనే ఆయన ఆ ఆహారం ఎక్కణ్ణుంచి వచ్చిందని సేవకుణ్ణి ప్రశ్నించారు. తాను కొందరికి జ్యోతిష్యం చెప్పి ఆ ఆహారం సంపాదించాను అంటూ అప్పుడు అసలు విషయం బయట పెట్టాడు సేవకుడు . కాని ఇస్లాంలో జ్యోతిష్యం చెప్పటం, చెప్పించుకోవటం రెండూ నిషిద్ధమే. ఆ రకంగా వచ్చే సంపాదన కూడా అధర్మమే అవుతుంది. నిజం తెలుసుకోగానే అబూబక్ర్ (రజి) తన సేవకునిపై మండిపడ్డారు. తర్వాత తిన్నదంతా బలవంతంగా బయటికి కక్కేశారు. ఆ మహానుభావుడు చేసిన దానధర్మాలన్నీ స్వీకృతిని పొందాయని ఆయన జీవితంలోనే ఖుర్‌ఆన్ ద్వారా ప్రకటించటం జరిగిందంటే, ధర్మ సమ్మతమైన సంపాదన విషయంలో ఆయన ఎంతటి జాగ్రత్తలు తీసుకునేవారో అర్థం చేసుకోవచ్చు.

మనిషి తినే ఆహారం నేరుగా అతని కడుపులోకే పోతుంది. ఆ తర్వాత ఆ ఆహారం తాలూకు రసం రక్తమాంసాల్లో కలసిపోతుంది. అది దేహ వృద్ధికి దోహదపడుతుంది. కనుక అధర్మ సంపాదనతో పోషించబడిన దేహం దాని ఫలితాన్ని నరక మంటల్లో తప్పకుండా అనుభవిస్తుంది. కాని సదాచార సంపన్నులైన మన పూర్వీకులు తాము తింటున్నదేమిటో తప్పకుండా పరిశీలించుకుంటూ ఉండేవారు. వారి అభిరుచులు ఎంతో స్వచ్ఛంగా ఉండేవి. ఫలితంగా వారి దేహాలు కూడా ఎంతో ఆరోగ్యంగా తయారయ్యేవి. వారి హృదయాలు విజ్ఞాన జ్యోతితో నిండు జాబిలిలా ప్రకాశిస్తూ ఉండేవి. అయితే తర్వాతి తరాల వారిలో ఆచరణ లోపించింది. వారి అభిరుచి కూడా మారిపోయింది. నిషిద్ధ ఆహారమే వారికి అతిశుద్ధ ఆహారంగా తలపించసాగింది. మరి దాని ఫలితం కూడా మన ముందు స్పష్టంగా గోచరిస్తూనే



ఉంది. వారి హృదయాల్లోని జ్ఞాన జ్యోతి ఆరిపోయింది. వారి కళ్ల ముందు నుంచి సన్మార్గం కనుమరుగై పోయింది. "స్వహస్తాలతో సంపాదించే సంపాదన కన్నా పవిత్రమైన ఆహారం భుజించేవారు మరెవరూ లేరు. దైవప్రవక్త దావూద్ (అలైహి స్సలామ్) స్వహస్తాలతో సంపాదించిన ఆహారమే తినేవారు" అని దైవప్రవక్త ముహమ్మద్ (స) తన సహచరులకు బోధించారు. దావూద్ ప్రవక్త కమ్మరి పని చేసేవారు. జకరియా ప్రవక్త (అలైహిస్సలామ్) వడ్రంగం చేసేవారు. ఇకపోతే మన ప్రవక్త ముహమ్మద్ (స), ఇంకా ఇతర ప్రవక్తలు పశువుల కాపరులుగా ప్రజలకు సేవ అందజేశారు.

మొత్తానికి ఇస్లాం మనిషికి న్యాయవంతమైన, ధర్మబద్ధమైన ఉపాధిని ఎంచుకోమని ప్రబోధిస్తుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ మానవాళికి ఇలా ఉపదేశి స్తున్నాడు:

**"అత్యుత్తమమైన పద్ధతిలో తప్ప అనాధ ఆస్తి దరిదాపులకు కూడా వెళ్ళకండి - అతను యుక్త వయస్సుకు చేరేవరకు. వాగ్దానాన్ని (చేసుకున్న ప్రతి ఒప్పందాన్ని) నెరవేర్చండి. ఎందుకంటే వాగ్దానం (ఒప్పందం) గురించి ప్రశ్నించబడుతుంది." (ఖుర్‌ఆన్ 17 : 34)**

**"తండ్రిలేని బిడ్డల సొమ్మును అన్యాయంగా తినేవారు తమ పొట్టల్ని అగ్నితో నింపుకుంటున్నారు. త్వరలోనే వారు మండే అగ్నిలోకి ప్రవేశిస్తారు." (ఖుర్‌ఆన్ 4:10)**

**"ఒకరి సొమ్మును ఇంకొకరు అన్యాయంగా స్వాహా చేయకండి. బుద్ధిపూర్వ కంగా, అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంతభాగం కాజేయటం కోసం అధికారులకు ముడుపులు చెల్లించకండి. అది (న్యాయం కాదన్న సంగతి) మీకూ తెలిసినదే." (ఖుర్‌ఆన్ 2 : 188)**

**"వడ్డీ సొమ్ము తినేవారు షైతాను పట్టటంవల్ల ఉన్మాది అయినవాని లాగానే నిలబడతారు. వారికీ దుర్గతి పట్టడానికి కారణం "వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా!" అని వారు అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేసి, వడ్డీని నిషేధించాడు. కనుక ఎవరు తన ప్రభువు వద్దనుంచి వచ్చిన హితబోధను విని వడ్డీని మానుకున్నాడో, అతడు గతంలో పుచ్చుకున్నదేదో పుచ్చుకున్నాడు. అతని వ్యవహారం దైవాధీనం. ఇకమీదట**

**కూడా దీనికి పాల్పడినవారే నరకవాసులు. వారు కలకాలం అందులో పడి ఉంటారు."** **(ఖుర్ఆన్ 2 : 275)**

ప్రామాణికమైన ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) లంచం ఇచ్చుకోవటాన్ని, పుచ్చుకోవటాన్ని రెండిటినీ నిషేధించారు. దివ్య ఖుర్ఆన్ అవతరణా కాలంలో యూదులు, క్రైస్తవులు ఇటువంటి అధర్మ కార్యకలాపాలకు విపరీతంగా పాల్పడేవారు. దివ్య ఖుర్ఆన్ వారి అనుచిత పోకడలను తీవ్రంగా గర్హించింది.

**"వారిలో చాలామందిని నీవు చూస్తావు, వారు పాపకార్యాల వైపుకు, దౌర్జన్యం వైపుకు, అధర్మమయిన సొమ్మును స్వాహా చేయటం వైపుకు ఎగబడుతూ ఉంటారు. వారు చేసే ఈ చేష్టలన్నీ పరమ చెడ్డవి."**

**(ఖుర్ఆన్ 5 : 62)**



# పాఠం 13

# ఉపవాసి వల్ల జరిగే తప్పులు

ఇస్లాం ధర్మం గురించి తెలియకపోవటం మూలంగా, ఉపవాసాల గురించి కనీస పరిజ్ఞానం కూడా లేకపోవటం మూలంగా ఉపవాసంలో కొంతమంది ఉపవాసకుల వల్ల తప్పులు జరిగిపోతుంటాయి. ఉపవాసానికి నష్టం కలిగించే విషయాల గురించి వారికి బొత్తిగా తెలిసి ఉండదు. ఉపవాస సమయంలో చేయటానికి అనుమతి ఉన్న పనులేవో, చేయకూడని పనులేవో, నిషేధింపబడినవి ఏవో, విధిగా నెరవేర్చవలసినవి ఏవో – అన్న జ్ఞానం వారికి ఉండదు. "అల్లాహ్ ఎవరి కోసమైనా మంచిని తలచుకుంటే, వారికి ధర్మ అవగాహనా వరాన్ని ప్రసాదిస్తాడు" అని దైవప్రవక్త (స) చెప్పింది అందుకే. మరో మాటలో చెప్పాలంటే, ధర్మం గురించి బొత్తిగా జ్ఞానం లేనివారి కోసం, కనీసం తమకు తెలియని విషయాలు పండితుల దగ్గర నేర్చుకోనివారి కోసం అల్లాహ్ మంచిని తలచుకోలేదన్నమాట!

**"(ఓ ప్రవక్తా!) నీకు పూర్వం కూడా మేము పురుషులనే (ప్రవక్తలుగా నియమించి) పంపాము. వారి వద్దకు మా వహీని పంపేవారము. ఒకవేళ మీకు తెలియకపోతే (గ్రంథ) జ్ఞానం గల వారిని అడిగి తెలుసుకోండి."**

**(ఖుర్ఆన్ 16 : 43)**

గ్రంథజ్ఞానం కలవారంటే పండితులు. కనుక నిజంగా అల్లాహ్‌ను ఆరాధించాలనే తపన కలిగివున్న ముస్లింలు ధర్మంలో తమకు తెలియని విషయాల గురించి తప్పకుండా పండితులను అడిగి తెలుసుకోవాలి. ఆ విధంగా తమ ధార్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. తమ ధర్మాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవటానికి కృషి చేయాలి.

ఉపవాసం ఉండి పెద్ద పెద్ద పాపాలు చేస్తున్నవారు నిజానికి తమ ఉపవాస ప్రతిఫలాన్ని శూన్యం చేసుకుంటున్నారు. ఆ పెద్ద పాపాల్లో ముఖ్యంగా పేర్కొనదగినవి చాడీలు. "నాలుక కూడా ఉపవాసం పాటిస్తుంది" అనే పాఠంలో దాని గురించి

కూలంకషంగా చర్చించటం జరిగింది. దాంతోపాటు అపనింద, అశ్లీల సంభాషణలు, అపహాస్యం, అసత్య ప్రమాణం మొదలగు విషయాలు కూడా చర్చించబడ్డాయి.

ఉపవాసం ప్రారంభంలో, తిరిగి విరమణ సమయంలో భోజనాదుల కోసం డబ్బును నీళ్లలా దుబారా ఖర్చు చేయటం మరో తప్పు. అతికొద్ది మంది కోసం ఒక పెద్ద జన సమూహానికి సరిపోయే ఆహార పదార్థాలను, షడ్రుచులు మేళవించిన అన్న పానీయాలను వ్యయం చేయటం సముచితం కాదు కదా! అంతచేసీ వారు వాటిలో భుజించేది అతి కొద్ది పరిమాణం మాత్రమే. మిగిలినదంతా వ్యర్థంగా పారవేస్తారు. ఇది ఇస్లామీయ బోధనలకు పూర్తిగా విరుద్ధం. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**"ఓ ఆదం సంతతి వారలారా! మీరు మస్జిదుకు హాజరైన ప్రతి సారీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి. తినండి, త్రాగండి. కాని మితి మీరకండి. మితిమీరి పోయే వారిని ఆయన (అల్లాహ్) ఇష్టపడడు."**

**(ఖుర్ఆన్ 7 : 31)**

మనిషి తన అవసరాలకు మించి వాడే ప్రతిదీ వ్యర్థమే అవుతుంది. కాని అల్లాహ్ మాత్రం మితిమీరిన ఖర్చును (దుబారాను) అస్సలు అంగీకరించడు. ఈ విషయమే దివ్య ఖుర్ఆన్‌లో మరో చోట ఇలా చెప్పబడింది:

**"బంధువుల, నిరుపేదల, ప్రయాణీకుల హక్కును వారికి ఇస్తూ ఉండు. దుబారా ఖర్చు చేయకు. దుబారా ఖర్చు చేసేవారు షైతానుల సోదరులు. మరి షైతానేమో తన ప్రభువునకు కృతఘ్నుడు." (ఖుర్ఆన్ 17 : 26,27)**

అల్లాహ్ ఇంకా ఇలా ఆజ్ఞాపిస్తున్నాడు:

**"వారు-ఖర్చుపెట్టే సమయంలో కూడా అటు మరీ దుబారా ఖర్చుచేయకుండా, ఇటు మరీ పిసినారితనం కూడా చూపకుండా - రెండింటికీ మధ్య - సమ తూకాన్ని పాటిస్తారు." (ఖుర్ఆన్ 25 : 67)**

రమజాన్ నెలలో మన మార్కెట్టులన్నీ కొలుగోలుదారులతో నిండి ఉంటు న్నాయి. ఒక్కరే పది కుటుంబాలకు సరిపోయేన్ని ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తూ మనకు కనిపిస్తారు. కాని అదే సమయంలో ఎంతో బాధాకరమైన విషయం ఏమిటంటే, ఒక చిన్న రొట్టె ముక్కకు కూడా నోచుకోకుండా, ఆకలితో అలమటిస్తూ చనిపోతున్న అభాగ్యు జీవులు కూడా మన సమాజంలో, మన చుట్టు ప్రక్కల్లో ఎంతో



మంది ఉన్నారు. కాని ఎవరూ వారిని గుర్తించటం లేదు. కటిక నేలే వారి ఇల్లు. ఆకాశమే వారి పైకప్పు. ప్రక్కన మురికి కాలువలు పారుతూ ఉండే చెత్తకుప్పలే వారి శయనాగారాలు. కాని ఇవేమీ పట్టించుకోకుండా అతిగా తింటూ అజీర్తితో బాధపడే ధనవంతులు మన సమాజంలో ఎందరో ఉన్నారు. ప్రజల్లో పేరు ప్రఖ్యాతులు పొందాలని వీరు అవసరం లేని చోట కూడా దుబారాగా డబ్బు ఖర్చు చేస్తుంటారు. మరి ఉపవాస ఆశయం తిండిని తగ్గించి, హానికర పదార్థాలను కడుపు నుంచి బహిష్కరించటమే సుమా! 'అతి'కి అలవాటు పడి అన్న పానీయాల్లో, ఇతర విషయాల్లో దుబారా ఖర్చు చేసేవారు తమ తప్పిదాన్ని ఎప్పటికి తెలుసుకుంటారు?

మరెంతో మంది విలువైన తమ ఉపవాస సమయాన్ని నిద్రలో గడిపేస్తుం టారు. ఫలితంగా తాము ఉపవాసం పాటిస్తున్నామన్న అనుభూతి కూడా వారికి కలగదు. ఇంకొందరు ఇంకా విచిత్రంగా ప్రవర్తిస్తారు. కేవలం నమాజు సమయాల్లో మాత్రమే మేలుకొని నమాజు పూర్తి కాగానే మళ్ళీ నిద్రపోతారు. కారణం ఈ ప్రబుద్ధులు రాత్రిళ్ళు మేలుకొని ఉంటారు. అందుకనే పగలంతా నిర్లక్ష్యంగా నిద్ర పోతూ ఉంటారు. నిజానికి ఆకలి బాధనూ, దప్పిక రుచిని చవి చూసి ఆ క్రమంలో అల్లాహ్ అనుగ్రహాన్ని పొందేందుకు ప్రయత్నించటం వివేకవంతులైన ఉపవాసుల లక్షణం. మరి పగలంతా నిద్రపోయే ఉపవాసి ఆ అనుగ్రహాన్ని ఎలా పొందుతాడండీ?!

ఇంకా కొందరుంటారు. వీరు తమ ఉపవాస కాలాన్ని ఇస్లాం ధర్మం అసమం జసంగా పరిగణించిన ఆటపాటలు, మొదలగు కార్య కలాపాల్లో గడిపేస్తుంటారు. అదేమని అడిగితే, తాము వాటి ద్వారా రిలాక్స్ పొందుతున్నామంటారు. వాస్తవానికి వారు తమ విలువైన కాలాన్ని ఖుద్దుగా నాశనం చేసుకుంటున్నారు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"మేము మిమ్మల్ని ఏదో ఆషామాషీగా (అర్థరహితంగా) పుట్టించామనీ, మీరు మా దగ్గరకు మరలిరావటం అనేది జరగని పని అని అనుకున్నారా?"**

**(ఖుర్ఆన్ 23 : 115)**

**"ఎవరు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసుకున్నారో, ఎవరినయితే ప్రాపంచిక జీవితం మోసపుచ్చిందో వారికి దూరంగా ఉండండి."**

**(ఖుర్ఆన్ 6 : 70)**

పైన తెలిపిన వారే గాకుండా ఇంకా కొంతమంది ఉంటారు. వారు పగలు ఉపవాసం ఉన్నప్పటికీ రాత్రిళ్లు మాత్రం మనో రంజక కార్య కలాపాల్లో నిమగ్నులై

ఉంటారు. సంగీతం, సినిమాలు, నృత్యాలు, నాటకాలు మొదలగు ధర్మ విరుద్ధ పనుల్లో కాలం గడుపుతారు. వీరు రాత్రి చీకటిలో అల్లాహ్ ప్రసన్నత కోసం ఒక్క ఆరాధన కూడా చేయరు. ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే కొంతమంది సామూహిక నమాజులకు కూడా హాజరు కారు. అడిగితే ఏవేవో కుంటిసాకులు చెబుతారు. రోగగ్రస్త హృదయాలు, మృతప్రాయమైన ఆత్మలు గలవారిలో ఇటువంటి దుర్లక్షణాలు ఉంటాయి.

రమజాన్ మాసానికి – దివ్య ఖుర్ఆన్‌కు మధ్య అవినాభావ సంబంధం ఉంది. మరి అటువంటి రమజాన్ మాసంలోనూ దివ్య ఖుర్ఆన్ దగ్గరకు వెళ్లని దౌర్భాగ్యులు కూడా ఉంటారు. నిత్యం వారు ఎన్నో పుస్తకాలు చదువుతుంటారు. కాని దివ్య ఖుర్ఆన్ మాత్రం వారి కంటికి ఆనదు. విశ్వ ప్రభువు మానవాళి కొరకు అవతరింపజేసిన ఆ ఒక్క అద్భుత గ్రంథం తప్ప ఇతర ఏ గ్రంథమైనా వారు ఎంతో ఆసక్తిగా చదువుతారు.

ఎంగిలి చేత్తో కాకులను తోలని పిసినారి పుంగవులు కూడా కొందరు ఉంటారు. రమజాన్ నెలలోనూ వారికి దానధర్మాలు చేసే అదృష్టం దక్కదు. ఉపవాస దీక్ష విరమణ కోసం ఇతరులను తమ ఇండ్లకు ఆహ్వానించరు. నిరుపేదలను చూడ గానే వారి చేతులు బిగుసుకుపోతాయి. వారి ఇండ్ల తలుపులు మూతపడతాయి. అటువంటి వారిని సంబోధిస్తూ దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**“మీ దగ్గర ఉన్నదంతా నశించేదే. అల్లాహ్ వద్ద ఉన్నదే మిగిలి ఉండేది. ఓర్పు వహించేవారికి మేము వారి సదాచరణలకుగాను మంచి ప్రతిఫలాన్ని తప్పక ప్రసాదిస్తాము.” (ఖుర్ఆన్ 16 : 96)**

ఇంకా ఇలా అన్నాడు:

**“.....నమాజును నెలకొల్పండి. జకాత్‌ను ఇస్తూ ఉండండి. అల్లాహ్‌కు మంచి రుణం ఇవ్వండి. మీరు మీ కోసం ఏ మంచిని (పుణ్యకార్యాన్ని) ముందుగా పంపినా, దాన్ని అల్లాహ్ దగ్గర అత్యుత్తమ పుణ్యఫలం రూపంలో అత్యధికంగా పొందుతారు. క్షమాపణకై అల్లాహ్‌ను అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ గొప్ప క్షమాశీలి, దయాశీలి.” (ఖుర్ఆన్ 73 : 20)**

ఇంతవరకు వివరించబడిన వివిధ రకాల మనుషులతో పాటు రాత్రిపూట చేసే ప్రత్యేక ఆరాధన “తరావీహ్ నమాజు”కు ఎగనామం పెట్టి రమజాన్ మాసపు



శుభాలను కొల్లగొట్టుకునే దురదృష్టవంతులకు కూడా మన సమాజంలో కొదువలేదు. ఐదు పూటల ఫర్జ్ నమాజులు చేసుకుంటే సరిపోతుందని వారి మనసులు వారికి ప్రబోధిస్తాయి. కాని ప్రాపంచిక జీవిత విషయానికి వస్తే, విచిత్రంగా వీరి దగ్గర ఎన్ని సిరిసంపదలు పోగుపడినా అవి వారికి సరిపోవు. వారి మనసులు ఇంకా ఇంకా కావాలనే అంటుంటాయి. ప్రపంచంలో అవసరమైన వాటితో పాటు అనవసరమైన, పనికిమాలిన వస్తువులను పొందటానికి కూడా వీరు శతవిధాలా కృషి చేస్తుంటారు. కాని రేపు మానవులందరూ ఒక చోట చేరే సమయాన వీరు విశ్వ ప్రభువు ముందు హాజరు వావలసి ఉంటుంది. అయితే ప్రపంచంలో జీవించినంత కాలం వ్యర్థ కార్యాలు చేస్తూ, నష్టాల ఊబిలో చిక్కుకున్న వీరు ఆ రోజు ఎంత పశ్చాత్తాప పడినా లాభం ఉండదు.

చివరగా మరికొందరి గురించి తెలుసుకుందాం. వీరు ఉపవాసం ఉండి తమ కుటుంబ సభ్యులను ముప్పతిప్పలు పెడతారు. రోజువారీ పనులేవీ నిర్వర్తించకుండా తమ పనులు కూడా ఇంట్లో వారి మీద నెట్టేస్తారు. పగలంతా ఇంట్లో స్త్రీల చేత వంటకాలు చేయిస్తుంటారు. వారూ ఉపవాసం ఉన్నారనీ, దివ్య ఖుర్ఆన్ పారాయణం చేయటానికి వారికీ కాసేపు తెరిపినివ్వాలనీ, ప్రవక్త సంప్రదాయాలను ఆచరించుకునే అవకాశం కల్పించాలనీ, అల్లాహ్‌ను స్మరించటానికి, ఆరాధించటానికి వారికీ కొంత సమయం కావాలన్న సంగతిని ఈ ప్రబుద్ధులు అస్సలు పట్టించుకోరు. వీరు గనక తమ కోరికలను కాస్త అదుపులో పెట్టుకుంటే వీరి కుటుంబ సభ్యులకు కూడా అల్లాహ్‌ను ఆరాధించటానికి చాలినంత సమయం ఉంటుంది.

ఓ అల్లాహ్! మమ్మల్ని వృద్ధిపరచు, మమ్మల్ని క్షీణింపజేయకు. మాకు ప్రసాదించిన వరాలను మళ్ళీ మా నుంచి దూరం చేయకు. మాకు గౌరవం అనుగ్రహించు, మమ్మల్ని అగౌరవం పాలుజేయకు. మమ్మల్ని క్షమించు, మాకు మన్నింపును ప్రసాదించు.

# పాఠం 14 రమజాన్ మాసపు మధుర స్మృతులు

రమజాన్ మాసానికి సంబంధించి ముస్లింల కొరకు ఎంతో సుందరమైన స్మృతి, అత్యద్భుతమైన జ్ఞాపకం, ఈ నెలలో దివ్య ఖుర్ఆన్ అవతరించటం. ఇది మహోన్నతమైన దైవ గ్రంథం. విజ్ఞతా వివేచనలు నిండిన దివ్య గ్రంథం. ఈ విషయం దివ్య ఖుర్ఆన్‌లో అత్యంత రమణీయంగా ఇలా చెప్పబడింది:

**"రమజాను నెల-ఖుర్ఆన్ అవతరింపజేయబడిన నెల. అది మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి. కనుక మీలో ఎవరు ఈ నెలను చూస్తారో వారు ఉపవాసాలుండాలి." (ఖుర్ఆన్ 2 : 185)**

రమజాన్ నెలలో దివ్య ఖుర్ఆన్ అవతరించింది. కనుక ఆ నెలకు సంబంధించి ఇస్లామీయ చరిత్రలో అది అత్యంత మధుర స్మృతిగా నిలిచింది.

నిరక్షరాస్యతలోనే గొప్పతనం ఉందనుకునే ఒకానొక అమాయక అరబ్బు జాతివారి మధ్య అల్లాహ్ తన ఆజ్ఞ మేరకు దివ్య ఖుర్ఆన్ గ్రంథాన్ని అవతరింపజేసి తద్వారా వారిని అంధకారం నుంచి వెలుగు వైపుకు తీసుకువచ్చాడు. అజ్ఞాన పాతాళం నుంచి విజ్ఞానపు కీర్తి శిఖరాలకు అధిరోహింపజేశాడు. ప్రతి యేడు రమజాన్ మాసం ఏతెంచినప్పుడు, దైవప్రవక్త (స) పై, ప్రళయం వరకూ ఉండే ప్రజలపై దివ్య ఖుర్ఆన్ రూపంలో అల్లాహ్ ఎంతటి గొప్ప వరాన్ని అవతరింపజేశాడో ప్రజలు గుర్తు చేసుకుంటారు. ఆ మధుర జ్ఞాపకం ఆధ్యాత్మికతా మనుషులను ఎంతో మురిపిస్తుంది.

**"అదొక ప్రతిష్ఠాత్మకమైన గ్రంథం. అసత్యం దాని దరిదాపుల్లోకి కూడా - దాని ముందునుండిగానీ, దాని వెనుక నుండిగానీ - రాజాలదు. (ఎందుకంటే) అది మహావివేకవంతుడు, ప్రశంసనీయుడైన అల్లాహ్ తరఫున అవతరింపజేయబడినది." (ఖుర్ఆన్ 41 : 43)**

రమజాన్ మాసంలోనే ముస్లింలు ఒక చారిత్రాత్మక ఘన విజయం సాధిం



చారు. ఈ నెలలోనే ముస్లింలు అల్లాహ్ అనుగ్రహంతో బద్ర్ యుద్ధంలో దైవ విరోధులను మట్టికరిపించారు. ఆ కాలంలో ప్రవక్త (స)ను, ఆయన సహచరులైన ముహాజిర్, అన్సార్‌లను వరించిన అతి గొప్ప విజయం అది.

**"బద్ర్ (యుద్ధం)లో మీరు అత్యంత దయనీయస్థితిలో ఉన్నప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ఆదుకున్నాడు. కాబట్టి అల్లాహ్‌కు మాత్రమే భయపడండి. తద్వారా మీకు కృతజ్ఞతలు తెలుపుకునే సద్బుద్ధి ప్రాప్తిస్తుంది." (ఖుర్ఆన్ 3 : 123)**

రమజాన్ మాసంలోనే ఇస్లాం ధర్మం అవిశ్వాసంపై గెలుపును సాధించింది. "అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు, ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త " అని నినాదంతో కూడిన విజయ పతాకం చరిత్ర శిఖరాలపై రెపరెపలాడింది రమజాన్ మాసంలోనే.

**"ఇరు సమూహాలు ముఖాముఖీ అయిన రోజున మీలో కొందరు వెన్ను చూపారు. వారు చేసిన కొన్ని తప్పుల వల్ల షైతాన్ వారిని తడబాటుకు లోను చేశాడు. అయినా అల్లాహ్ వారిని మన్నించాడు. అల్లాహ్ క్షమించేవాడు, సహనశీలుడూను." (ఖుర్ఆన్ 3 : 155)**

ఈ బద్ర్ యుద్ధం జరిగింది రమజాన్ నెలలోనే. కనుక ప్రతి యేడు రమజాన్ నెల 17వ తేది మనకు ఆనాడు జరిగిన బద్ర్ మహా సంగ్రామాన్ని గుర్తుకు తెస్తుంది. మరి మహా ప్రవక్త ముహమ్మద్ (స) మక్కా నగరంపై నిరుపమానమైన రీతిలో శాంతియుతమైన పద్ధతిలో విజయం సాధించిందీ ఈ శుభప్రదమైన రమజాన్ మాసంలోనే సుమా!

**"(ఓ ప్రవక్తా!) మేము నీకు చాలా స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము." (ఖుర్ఆన్ 48 : 1)**

రమజాన్ మాసంలో మన ప్రియ ప్రవక్త (స) అల్లాహ్ ఏకత్వాన్ని చాటిచెబుతూ ప్రజల హృదయాలను జయించి, మక్కా నగరాన్ని శాంతియుతంగా తమ అధీనంలోకి తీసుకున్నారు. అంతేకాదు, సత్యం కోసం జరిగిన అనేక గొప్ప గొప్ప పోరాటాలు రమజాన్ నెలలోనే జరిగాయి. ఈ శుభప్రదమైన రమజాన్ నెలలోనే ముస్లింలకు ఎన్నో వరాలు లభించాయి. అనేక విజయాలు వారిని వరించాయి.

రమజాన్ మాసం అనగానే మనకు ఇంకో విషయం కూడా గుర్తుకు వస్తుంది. అల్లాహ్‌కు అత్యంత విశ్వాసపాత్రులైన దైవదూత జిబ్రయీల్ ఈ నెలలో ఓ ప్రత్యేక ఉద్దేశంతో దైవప్రవక్త (స) వద్దకు వచ్చేవారు. ఆయనకు ఖుర్‌ఆన్ నేర్పించేవారు. అల్లాహ్ వాక్యాలను పునశ్చరించేవారు. జిబ్రయీల్ దూత దైవప్రవక్త (స)కు ఖుర్‌ఆన్ అధ్యయనంలో సహకరించేవారు. ఇద్దరూ కలిసి ఖుర్‌ఆన్ వాక్యాల అర్థాలను, వాటి మర్మాలను అధ్యయనం చేసేవారు. ప్రవక్త (స) జిబ్రయీల్ దూతకు ఖుర్‌ఆన్ చదివి వినిపించేవారు. ఇద్దరూ ముక్త కంఠంతో ఖుర్‌ఆన్ పారాయణం చేసేవారు. వారిరువురూ కలిసి చేసిన అధ్యయనాల శుభఘడియలు, సుందరమైన వారి సాన్నిహిత్య క్షణాలు, మహోన్నతమైన వారి దైవారాధనా సదనాలు ఎంతో గొప్పవి.

మనకు ఉన్న మనసైన జ్ఞాపకాలలో రమజాన్ మాసంలో దైవప్రవక్త సహచరులు ప్రపథమంగా తరావీహ్ నమాజు కోసం సమావేశమైన శుభ ఘడియలూ ఉన్నాయి. వారిలో ఒకరు నమాజుకు సారథ్యం వహిస్తూ, దైవగ్రంథ పారాయణం చేస్తుంటే మిగిలిన వారందరూ శ్రద్ధగా ఆ పారాయణాన్ని ఆలకిస్తూ ఉండేవారు. దివ్యగ్రంథంలోని ఒక్కో పదం అర్థం చేసుకునేవారు. పారాయణ సమయంలో అల్లాహ్ పట్ల భీతిభావంతో కన్నీరు మున్నీరుగా విలపించేవారు. సుదీర్ఘమైన వారి రాత్రి ఆరాధన సమయాన్ని కుంచింపజేసేది. అసలు ఆ దృశ్యాన్ని తలచుకోండి. వారి హృదయాలు వినయ విధేయతలకు నిలయంగా ఉండేవి. వారు నమాజులో నిలబడే వారు. రుకూ చేసేవారు. సజ్దా చేసేవారు. వారి కళ్ళ నుంచి అశ్రుధారలు ప్రవహిస్తుండేవి. భూమ్యాకాశాల ప్రభువు పట్ల తమకు గల భయభక్తుల వల్ల వారి హృదయాంతరాళ నుంచి పశ్చాత్తాపం పొంగిపొర్లేది. వారి రోదనా శబ్దాలు వినిపించేవి. వారి హృదయాలు దైవభీతితో కంపించేవి. భయాందోళనల వల్ల వారి దేహాలు చెమట జడితో తడిసిపోయేవి. ఏడ్చి ఏడ్చి వారి కళ్లల్లో నుంచి కన్నీళ్లు కూడా ఇంకిపోయేవి. వారి చూపుల్లో జ్ఞానం పట్ల ఆర్ద్రత, విశ్వాసంలో నిశ్చలత, అల్లాహ్ పట్ల భీతి, ఆచరణ పట్ల తపన స్పష్టంగా కనిపిస్తూ ఉండేవి.



# పాఠం 15

# రమజాన్ క్షమావర్షం కురిసేకాలం

రమజాన్ నెలలో ముస్లింలకు కలిగే గొప్ప ప్రయోజనాలు మూడు అని భావించవచ్చు. (1) ఈ నెలలో ముస్లింలు మరెన్నడూ లేని విధంగా తమ వల్ల జరిగిన పాపాలపై పశ్చాత్తాపం చెందుతారు. (2) అల్లాహ్ వైపుకు మరలుతారు. (3) ఆత్మావలోకనం, వ్యక్తిగత జీవిత మూల్యాంకనం.

క్షమాపణా ద్వారాలు ఎల్లప్పుడూ తెరుచుకునే ఉంటాయి. విశ్వ ప్రభువు అనుగ్రహం ఎల్లప్పుడూ తన దాసులపై వర్షిస్తూనే ఉంటుంది. ఆయన కటాక్ష వీక్షణాలు అనునిత్యం తన దాసులపై ప్రసరిస్తూనే ఉంటాయి. కాని తమ వల్ల జరిగిన పాపాలకు పశ్చాత్తాపపడి, తద్వారా ప్రభువు అనుగ్రహానికి, ఆయన కరుణా కటాక్షాలకు అర్హతను సంపాదించుకునేవారు ఎవరు? ఆయన మన్నింపు కోసం వేడుకునేవారు ఎవరు? ప్రభువు కారుణ్య జలధి ఎలా ఉప్పొంగుతుందో చూడండి:

> **"తమ ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టిన ఓ నా దాసులారా! మీరు అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ పాపాలన్నింటినీ క్షమిస్తాడు. నిజంగా ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా కరుణించేవాడు."** **(ఖుర్‌ఆన్ 39 : 53)**

రమజాన్ మాసం మన్నింపుల మాసం. భువిలో అల్లాహ్ క్షమాగుణం వెల్లివిరిసే శుభ వసంతం. సహనం, ఓర్పులు కురిసే రుతువిది. ఇది ఓ అమూల్యమైన కాలం. ఎన్నడూ మరవలేని, మరుపురాని సంతోష సమయం. "పగటిపూట పాపం చేసినవాడు రాత్రికి పశ్చాత్తాపం చెందుతాడని అల్లాహ్ తన చేయి చాపి ఉంచుతాడు. అలాగే రాత్రి వేళ పాపం చేసినవాడు పగలు పశ్చాత్తాపం చెందుతాడని అల్లాహ్ పగటి పూట కూడా తన చేయిని చాపి ఉంచుతాడు. సూర్యుడు పడమటి దిక్కు నుంచి ఉదయించేంత వరకూ (అంటే ప్రళయం వచ్చేంత వరకూ) ఈ పరంపర కొన సాగుతుంది" అని దైవప్రవక్త (స) ఉద్బోధించారు. మన వల్ల జరిగిన పాపాలు అనేకం.

అయితే అల్లాహ్ క్షమ, ఆయన కరుణ అంతకంటే ఎంతో అధికమన్న సంగతి మనం ఎన్నడూ మరిచిపోరాదు. మనం చేసే పొరబాట్ల కన్నా ఆయన చూపే దయా భావమే ఎన్నో రెట్లు ఎక్కువ సుమా! మనం తప్పుల మీద తప్పులు చేస్తున్నాం, మన కర్మల పత్రాల్లో పాపాలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అయినా ఆయన మనల్ని క్షమిస్తున్నాడు. అన్నిటినీ చూసీ చూడనట్లు వదిలేస్తున్నాడు. మరి ఆయన ఎంత కరుణామయుడో ఆలోచించండి. పాపం చేసినవాడికీ ఆయన బ్రతుకుదెరువు ప్రసాదిస్తున్నాడు. ఎన్నడూ ఏ పాపినీ అతని పాపం మూలంగా ఆయన పస్తులు పెట్టడు. తప్పు చేసినవాడు కాస్త పశ్చాత్తాపం పడితే చాలు ప్రభువు కారుణ్య కడలి కదలి వచ్చేస్తుంది.

దివ్య ఖుర్ఆన్‌లోనే అల్లాహ్ ఇలా అంటున్నాడు:

> **"తమ ద్వారా ఏదైనా నీతిబాహ్యమైన పని జరిగిపోతే లేదా తమ ఆత్మలకు వారు ఏదైనా అన్యాయం చేసుకుంటే వెంటనే వారు అల్లాహ్‌ను తలచుకుని, తమ పాపాల క్షమాపణకై వేడుకుంటారు. నిజానికి అల్లాహ్ తప్ప పాపాలను క్షమించే వాడెవడున్నాడు? వారు తమ వల్ల జరిగింది తప్పు అని తెలిసినపుడు దానిపై హఠం చెయ్యరు."** **(ఖుర్ఆన్ 3 : 135)**

వారు అలవాటుగా, కావాలని పాపాలు చేయరు. ఒకవేళ మానవ సహజమైన దౌర్బల్యం వల్ల ఎప్పుడైనా తప్పులు జరిగిపోతే వెంటనే వారు అల్లాహ్‌ను క్షమాపణలు కోరుకుంటారు. ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘిస్తే వెంటనే పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. అందుచేత అల్లాహ్ వారిని క్షమిస్తాడు. రమజాన్ నెలను పొంది, అందులో సత్కార్యాలు చేసి తద్వారా తమ పాపాలకు క్షమాభిక్ష సంపాదించుకోలేని వారు పరమ దౌర్భాగ్యులని ఒకానొక సందర్భంగా దైవప్రవక్త (స) హెచ్చరించి ఉన్నారు. రమజాన్ అనేది ఎంతో అరుదైన అవకాశం. మరి మీరు ఆ నెలలో ప్రభు వరాలు పొందటం కోసం ప్రయత్నాలు చేయరా?

అల్లాహ్ పట్ల నిజమైన భక్తిప్రపత్తులు కలిగినవారి వల్ల గత సంవత్సరం జరిగిన పాపాలన్నీ రమజాన్ నెలలో క్షమించబడతాయి. వారు ఏదైనా ఘోర పాపానికి పాల్పడి వున్నట్లయితే అది వేరే విషయం. దానికోసం ప్రత్యేకంగా పశ్చాత్తాపపడి అల్లాహ్‌ను వేడుకోవలసి ఉంటుంది. అప్పుడు ఆ ఘోర తప్పిదాన్ని కూడా అల్లాహ్ కారుణ్యం



కడిగివేస్తుంది. మొత్తం సంవత్సరంలో జరిగే తప్పులు, లోటుపాట్లు అన్నీ కూడా రమజాన్ నెలలో సరిదిద్దబడతాయి. హదీసె ఖుద్సీ అంటే ఏమిటో ఇంతకు ముందు చెప్పుకున్నాం. ప్రవక్త మాటల్లో పలికే అల్లాహ్ వాణినే హదీసె ఖుద్సీ అంటారు. అటువంటి ఒక హదీసు ప్రకారం అల్లాహ్ మానవులను ఉద్దేశించి, "ఓ నా దాసులారా! మీరు రేయింబవళ్లు తప్పులు చేసినా నేను మిమ్మల్ని మన్నించగలను. మీరు నా మన్నింపును కోరండి, నేను మిమ్మల్ని మన్నించి తీరుతాను" అని అంటున్నాడు. పాపం చేయటం మానవ నైజంలోనే ఉంది. కాని పాపం మీద పాతుకు పోవటం మాత్రం మనిషి నైజం కాదు. అది షైతాన్ నైజం. షైతాన్‌లో పశ్చాత్తాపం అనేది లేదు. అలాగే మనలో కొందరు తప్పు చేస్తారు. ఆ తప్పు వారికి తెలిసి వస్తుంది. అయినా వారు పశ్చాత్తాపం ప్రకటించరు. తమను క్షమించమని అల్లాహ్‌ను వేడుకోరు. పైగా ఆ తప్పు మీదే పాతుకుపోతారు. షైతాన్ స్వభావాన్ని అలవర్చుకుంటారు. చేసిన తప్పే మళ్ళీ మళ్ళీ చేస్తూ పోతుంటారు. సన్మార్గ భాగ్యానికి నోచుకోని దురదృష్టవంతులు వీరే. ఒకానొక హదీసె ఖుద్సీ ప్రకారం అల్లాహ్ మనిషిని ఉద్దేశించి, " ఓ మనిషీ! నీవు నన్ను పిలిచావు, నన్ను మొరపెట్టుకున్నావు. కనుక నేను నిన్ను క్షమిస్తున్నాను. నీ ప్రార్థన వల్ల నాకు అసౌకర్యం ఏమీ లేదు సుమా!" అని అంటూ ఉంటాడు.

ఓ ఉపవాసులారా! రమజాన్ మాసం క్షమాపణలు వేడుకునేందుకు ఓ చక్కటి అవకాశం. రమజాన్ నెలలోని రోజులు అపారమైన సిరిసంపదల కంటే గొప్పవి. మరి ఇంత మంచి బహుమతిని, ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రాలేమా మనం? ప్రజలారా! మరణ సమయం దరిచేరక ముందే నిష్కల్మష హృదయంతో గత పాపాలపై పశ్చాత్తాపం ప్రకటించండి. నిర్మల మనసుతో నింగినున్న ప్రభువును క్షమాపణ కోసం అర్థించండి. చిన్న పాపాన్నైనా తేలికగా తీసుకోకండి. మీ వల్ల జరిగిన ఆ చిన్న తప్పు మానవుల ప్రపంచ వ్యవహారాలు తేల్చబడే పరలోక దినాన మీ కర్మల పత్రంపై ఎంతటి ప్రభావం చూపుతుందో తెలుసా మీకు? గత సంవత్సరం ఉపవాసం ఉన్నవారిలో ఎంతోమంది నేడు అల్లాహ్ సన్నిధికి చేరుకొని ఉన్నారు. మరి ఈ ప్రపంచంపై సర్వ అధికారాలు అల్లాహ్‌వేనని అర్థం కావటం లేదా? ఆయన సత్వర న్యాయ నిర్ణేత అని మీరు ఇంతకీ తెలుసుకోలేక పోతున్నారా? ఔను, గతించిన వారంతా తమ కర్మలను తమ వెంట తీసుకొని వెళ్ళారు. కేవలం

తమ అడుగు జాడలను మాత్రమే ఇక్కడ వదలి వెళ్ళారు. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"ఆయనే తన దాసుల పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు, వారి తప్పులను మన్నిస్తాడు. మీరు చేసేదంతా ఆయనకు తెలుసు."** **(ఖుర్‌ఆన్ 42 : 25)**

ఒకానొక సందర్భంగా దైవప్రవక్త (స), "ఎవరి చేతుల్లో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. మీరు గనక పాపాలు చేయకపోతే అల్లాహ్ (ఈ భూలోకం నుంచి) మిమ్మల్ని తొలగించి మరో ప్రాణుల్ని తీసుకు వస్తాడు. వారు పాపం చేస్తారు. ఆ తర్వాత పశ్చాత్తాపం చెందుతారు. అప్పుడు అల్లాహ్ వారిని క్షమిస్తాడు" అని తన సహచరులకు ప్రబోధించారు.

మనుషులు రమజాన్ మాసంలో పశ్చాత్తాపం చెందకపోతే మరి ఇంకెప్పుడు పశ్చాత్తాపం చెందుతారు? రమజాన్ నెలలో అల్లాహ్ వైపు మరలకపోతే వారు ఆయన వైపు ఇంకెప్పుడు మరలుతారు? విచిత్రమేమిటంటే, కొంతమంది ముస్లింలు రమజాన్ నెల సాంతం ఉపవాసం ఉంటారు. చక్కగా తమ నడవడిని సరిదిద్దుకుంటారు. మనశ్శాంతిని పొందుతారు. కాని ఆ నెల గడిచి, ముప్పై ఉపవాస దినాలు పూర్తవగానే మళ్ళీ పాత జీవితం వైపుకే మరలిపోతారు. నెల రోజులు కష్టపడి సాధించుకున్న ప్రయోజనాన్నీ జారవిడుచుకుంటారు. రమజాన్ నెలలో చేసిన ప్రతిజ్ఞలనూ కాలరాస్తారు. కష్టపడి నిర్మించటం – ఇష్టం లేదని నిర్మూలించటం, ముందు మాటివ్వటం – తర్వాత మొండి చెయ్యి చూపించటం, వారి జీవితమంతా ఇలాగే గడుస్తూ ఉంటుంది. ఇటువంటి స్వభావం గలవారిని ఉద్దేశించి అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా హెచ్చరిస్తున్నాడు:

**"తన నూలును గట్టిగా వడికిన తరువాత, తనే స్వయంగా ముక్కలు ముక్కలుగా త్రెంచివేసిన స్త్రీ మాదిరిగా అయిపోకండి. ఒక వర్గం మరో వర్గం కంటే మించిపోవాలన్న ఉద్దేశంతో మీరు మీ ప్రమాణాలను పరస్పరం మోసగించుకునే సాధనాలుగా చేసుకుంటున్నారు. అసలు విషయం ఏమిటంటే ఈ ప్రమాణం ద్వారా అల్లాహ్ మిమ్మల్ని పరీక్షిస్తున్నాడు. నిశ్చయంగా అల్లాహ్ ప్రళయ దినాన మీరు విభేదించుకునే విషయాలన్నింటినీ మీకు విడమరచి చెబుతాడు."** **(ఖుర్‌ఆన్ 16 : 92)**



మన పూర్వీకులు రమజాన్ నెల పూర్తయినప్పుడు, ఎంతోకాలం కలిసున్న తమ ఆత్మీయులెవరో తమకు దూరమవుతున్నట్టు ఆవేదన చెందేవారు. ఆ సమయం వారికి ఎంతో దుఃఖదాయకంగా, నిరాశాజనకంగా గడుస్తుంది. హృదయాలను నిషిద్ధాల నుంచి పరిశుద్ధం చేసుకొని, దివ్య జ్ఞాన కాంతులతో ఆత్మలను ప్రకాశవంతం చేసుకొని, ధర్మ పథాన ఎంతో పురోగతిని సాధించిన శుభాత్మలకు రమజాన్ లాంటి మహిమాన్విత మాసం దూరమవుతున్నప్పుడు దుఃఖం కలగటం సహజమే కదా!

ఓ అల్లాహ్! సదాచార సంపన్నులైన మా పూర్వీకులకు ప్రసాదించిన శుభాలను మాకూ ప్రసాదించు. మమ్మల్ని రుజుమార్గంపై నడిపించు.

# పాఠం 16 విశ్వాసం వికసించే వసంత కాలం

మనిషి విశ్వాసం ఒక్కోసారి పెరుగుతుంది. ఒక్కోసారి తగ్గుతుంది. వాస్తవానికి అతని ఆచరణలే ఈ హెచ్చుతగ్గులకు కారణమవుతుంటాయి. విధేయత వల్ల విశ్వాసం వృద్ధి చెందుతుంది. అవిధేయత వల్ల అందులో క్షీణత వస్తుంది. ప్రార్థనలు, సౌశీల్యం మొదలగు సత్కారాల వల్ల మనిషిలోని విశ్వాసం ఇతోధికం అవుతుండగా, అవినీతి, అధర్మం, అన్యాయం మొదలగు కారణాల వల్ల విశ్వాసం అథః స్థానానికి క్షీణిస్తూ ఉంటుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయబడింది:

**"మరెవరయితే సన్మార్గాన్ని పొందారో, వారి సన్మార్గభాగ్యంలో ఆయన (అల్లాహ్) మరింత వృద్ధిని ప్రసాదించాడు. వారికి వారి ధర్మనిష్ఠను ('తఖ్‌వా'ను) కూడా అనుగ్రహించాడు." (ఖుర్‌ఆన్ 47 : 17)**

సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ మరోచోట ఇలా సెలవిస్తున్నాడు:

**"విశ్వాసుల హృదయాలలో నెమ్మదిని (ప్రశాంతతను, నిబ్బరాన్ని) వేసినవాడు ఆయనే, వారి విశ్వాసంతోపాటు మరింత విశ్వాసం పెంపొందటానికి. భూమ్యాకాశాలలోని సైనిక దళాలన్నీ అల్లాహ్‌వే. అల్లాహ్ జ్ఞాన సంపన్నుడు, వివేకవంతుడు." (ఖుర్‌ఆన్ 48 : 4)**

రమజాన్ మాసంలో దాసుడు తన యజమాని అయిన అల్లాహ్‌కు అత్యంత చేరువ అవుతాడు. ఫలితంగా అతని విశ్వాసం అభివృద్ధి చెందుతుంది. నమ్మకం శక్తివంతమవుతుంది. నిరంతర ఆరాధనలతో అతని మదిలో ఏకదైవారాధనా (తౌహీద్) భావన మరింత పుష్టిని సంతరించుకుంటుంది. ఉపవాసం అతి ప్రధానమైన ఆచరణ. దాని ద్వారా ఒక ఉపవాసి అల్లాహ్‌కు ఎంతగానో దగ్గరవుతాడు. ఉపవాసం దాసునికి – అల్లాహ్‌తో ఒక ప్రత్యేకమైన సంబంధాన్ని ఏర్పరుస్తుంది. అతన్ని అవిధేయత నుంచి, నరకాగ్ని నుంచి కాపాడుతుంది. రమజాన్ నెలలో ఇతోధికంగా ఆరాధనలు జరపటం వల్ల దాసుల హృదయాల్లో ప్రేమ, సాన్నిహిత్యం పెరుగుతాయి.



వినయ విధేయతలు వికసిస్తాయి. నిషిద్ధాల నుంచి తమ అంతరంగాలను పరిశుద్ధ పరచుకోవాలనే తపన వారిలో పుడుతుంది. ఈ విధంగా దాసుల హృదయాల్లో విశ్వాసం ఒక వటవృక్షం లాగా వ్రేళ్లూనుకొని స్థిరత్వం పొందుతుంది. ఇక ఆ తర్వాత అది తన ప్రభువు అనుగ్రహంతో ఆయన దాసులకు నిరంతరం మధుర ఫలాలను అందిస్తూ పోతుంది.

విశ్వాసంలో పెరుగుదలకు, నమ్మకంలో స్థిరత్వానికి దోహదపడే కొన్ని విషయాలను ఈ సందర్భంగా ప్రస్తావించుకోవటం అత్యంత సముచితంగా ఉంటుంది. అల్లాహ్ పట్ల భక్తిశ్రద్ధలతో, వినయ విధేయతలతో, ఏకాగ్రతతో సామూహిక నమాజులను నెరవేర్చటం ఆ దోహదపడే అంశాల్లో ఒకటి.

**"మరి మీరు నమాజును నెరవేర్చిన తరువాత నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండండి. అయితే పరిస్థితులు కుదుటపడిన తరువాత మాత్రం నమాజును నెలకొల్పండి. నిస్సందేహంగా నమాజును నిర్ధారిత వేళల్లో చేయటం విశ్వాసులకు విధిగా చేయబడింది." (ఖుర్‌ఆన్ 4 : 103)**

సామూహిక (జమాఅత్‌తో పాటు చేసే) నమాజుల వల్ల మనసుల్లోని అనుమానాలు, దుశ్శంకలు దూరమవుతాయి. కాపట్యం కనుమరుగవుతుంది. అల్లాహ్ పట్ల భీతిభావం పెరుగుతుంది. అంతేకాదు, సామూహిక నమాజులు మనిషిని అశ్లీలం నుంచి, చెడుల నుంచి కూడా ఆపుతాయి. అల్లాహ్ తన గ్రంథంలో విశ్వాసులకు ఇలా హితబోధ చేస్తున్నాడు:

**"(ఓ ప్రవక్తా!) నీ వైపుకు పంపబడిన (వహీ చేయబడిన) గ్రంథాన్ని పారాయణం చేస్తూ ఉండు. నమాజును నెలకొల్పు. నిశ్చయంగా నమాజ్ సిగ్గుమాలినతనం నుంచి, చెడు విషయాల నుంచి ఆపుతుంది. నిశ్చయంగా అల్లాహ్ స్మరణ చాలా గొప్ప విషయం (అన్న సంగతిని మరువరాదు). మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు." (ఖుర్‌ఆన్ 29 : 45)**

దివ్య ఖుర్‌ఆన్‌ను పారాయణం చేయటం, అందులోని వాక్యాలను గురించి యోచించటం, ఖుర్‌ఆన్ కల్పించే కారుణ్య నీడలో కాలం గడపటం, అందు నుంచి వీచే చల్లటి గాలిని పీల్చటం, అది బోధించే మార్గదర్శక అంశాలను ఆచరించటం మొదలగు విషయాలు కూడా మనిషిలో విశ్వాసాన్ని పెంపొందిస్తాయి.

**"ఇదొక శుభప్రదమైన గ్రంథం. ప్రజలు దీని వాక్యాలపై చింతన చేసేటందుకు, బుద్ధిజీవులు దీని ద్వారా గుణపాఠం నేర్చుకునేందుకు మేము దీనిని నీ వైపుకు పంపాము." (ఖుర్‌ఆన్ 38 : 29)**

హృదయం, నాలుక, పెదవులు – ఈ మూడు అవయవాలు నిరంతరం వినయ విధేయతలతో చేస్తుండే అల్లాహ్ స్తుతి, స్మరణ, ధ్యానం కూడా విశ్వాసాన్ని పటిష్ట పరుస్తుంది. మీరు ఆయన్ను ధ్యానిస్తే ఆయన మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటాడు. కనుక వేకువ జామునే ప్రార్థించండి, మీ పాపాల క్షమాభిక్షకై ఆయన్ని సత్వరమే వేడుకోండి. లాభదాయకమైన విద్యను, విజ్ఞానాన్ని, సత్య ధర్మాన్ని అర్థం చేసుకునే శక్తియుక్తులను ప్రసాదించమని ప్రార్థించండి.

**"ప్రభూ! నా జ్ఞానాన్ని పెంచు." (ఖుర్‌ఆన్ 20 : 114)**

ఏదయినా విషయం తెలియకపోతే పండితులను అడిగి తెలుసుకోవాలి:

**"ఒకవేళ మీకు తెలియకపోతే (గ్రంథ) జ్ఞానంగల వారిని అడిగి తెలుసుకోండి." (ఖుర్‌ఆన్ 16 : 43)**

అల్లాహ్‌ను ధ్యానించేవారితో కలిసి మీరూ ధ్యానించండి. అలాంటి పుణ్య దాసుల వెంట కూర్చున్నప్పుడు నిజమైన విశ్వాసులెవరికీ విసుగు అనిపించదు. నిశ్చయంగా ధర్మ జ్ఞాన సముపార్జన విశ్వాసాన్ని పెంచుతుంది. మనసుల్లో ఏకదైవారాధనా (తౌహీద్) భావానికి గట్టి పునాదులు వేస్తుంది.

**"కనుక అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో. నీ పొరపాట్లకుగాను క్షమాపణ వేడుకుంటూ ఉండు. విశ్వాసులైన పురుషుల, విశ్వాసులైన స్త్రీలందరి (మన్నింపు) కోసం కూడా వేడుకుంటూ ఉండు." (ఖుర్‌ఆన్ 47 : 19)**

పై వాక్యంలోని తన మొదటి ఆజ్ఞలో అల్లాహ్, "తెలుసుకో" అని సంబోధించటం గమనించండి. ఆ తర్వాతే ఆయన, "క్షమాపణలు వేడుకోండి" అనే మాటను ప్రస్తావించాడు.

విశ్వాసాన్ని పెంపొందించే మరో కారకం దానధర్మాలు. ఈ పుస్తకంలో దాన ధర్మాల గురించి ప్రత్యేకంగా ఒక పాఠమే పొందుపరచబడింది. అయితే వాటి ప్రాముఖ్యత దృష్ట్యా, సందర్భ ఔచిత్యం రీత్యా ఇక్కడ వాటిని మళ్ళీ మననం చేసుకోవటం జరుగుతోంది. దాతృత్వం, త్యాగనిరతి దాసుల హృదయాలను పరిశుద్ధ



పరుస్తాయి. వారిని ఉన్నత స్థానాలకు చేరుస్తాయి. వారి నడవడికను క్రమబద్ధీకరిస్తాయి. వారిలోని లోపాలను చక్కదిద్దుతాయి.

సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ చిహ్నాలను పరిశీలన దృష్టితో చూడటం కూడా విశ్వాసంలో పెరుగుదలకు దోహదకారి అవుతుంది. అల్లాహ్ తన నిరుపమాన నైపుణ్యంతో సృష్టించిన విశ్వం గురించి ప్రతి ముస్లిం తప్పకుండా యోచన చేస్తుండాలి. ఈ విశ్వ సృష్టిలో, రేయింబవళ్ల రాకపోకల్లో ఆలోచించేవారి కోసం గొప్ప సందేశం ఉందనీ, మహోన్నతమైన సూచనలు ఉన్నాయని దివ్య ఖుర్‌ఆన్ పదే పదే నొక్కి చెబుతోంది.

**"వారు నిల్చుని, కూర్చుని, తమ పడకలపై ఒత్తిగిలి అల్లాహ్‌ను స్మరిస్తూ ఉంటారు. భూమ్యాకాశాల సృష్టి గురించి యోచన చేస్తూ ఉంటారు. వారిలా అంటారు : "మా ప్రభూ! నువ్వు ఈ సృష్టిని నిరర్థకంగా చేయలేదు. నువ్వు పవిత్రుడవు. మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుంచి కాపాడు."**

**(ఖుర్‌ఆన్ 3 : 191)**

పరిశీలనాత్మక దృష్టి కలవారి మేధస్సులకు రమజాన్ మాసం పరిశుద్ధతను చేకూరుస్తుంది. వారి ఆలోచనా ప్రవంతికి దివ్యకాంతుల్ని ప్రసాదిస్తుంది. అవగాహన చేసుకోగల హృదయాలకూ ఈ కాలంలో దివ్యజ్యోతులు సమకూరుతాయి. కనుక ఈ శుభ సందర్భంలో ఇంతటి అద్భుతమైన సృష్టిని సృష్టించిన ప్రభువు పనితనాన్ని కీర్తిస్తూ, దివ్యమైన ఆయన శుభ నామాలను ధ్యానిస్తూ ఉండటం మహోన్నతమైన సత్కార్యం అనటంలో సందేహమే లేదు.

దీనికి భిన్నంగా మనిషి దివ్య ఖుర్‌ఆన్‌కు, దైవప్రవక్త ప్రబోధనలకు దూరమైనప్పుడు అతనిలో విశ్వాసం క్షీణించటం మొదలవుతుంది. అప్పుడు అతను ఆత్మ తృప్తి కోసం తన తోటివారి పుర్రెల్లో పుట్టిన చెత్త సాధనాలను ఆశ్రయిస్తాడు. ఫలితంగా అతనికి ఆత్మ తృప్తి మరింత దూరమవుతుంది. అతనిలో ఆందోళన మొదలవుతుంది. తర్వాత క్రమంగా అతని హృదయం నుంచి విశ్వాసం ఇగిరిపోతుంది. షైతాన్ మెల్లగా అతనిని వశపరచుకుంటాడు.

**"షైతాను వారిని లొంగదీసుకున్నాడు. వారు అల్లాహ్ ధ్యానాన్ని మరచిపోయేలా చేశాడు. వాళ్లు షైతాను ముఠాకు చెందినవారు. బాగా తెలుసుకోండి! ఎట్టకేలకు నష్టపోయేది షైతాను ముఠాయే." (ఖుర్‌ఆన్ 58 : 19)**

వినోదం, మనోల్లాసం, ఆటలు, నృత్యాలు, అసత్యవాదులతో స్నేహం మొదలగు విషయాలన్నీ విశ్వాసాన్ని క్షీణింపజేస్తాయి. అల్లాహ్ ప్రసాదించిన షరీఅత్‌ను నిరాకరించి అశ్లీలమైన, కామ వాంఛలతో కూడిన ఊబిలోనే ఇరుక్కుపోయి ఉంటానని మాయం చేసేవారి దురదృష్టం ఇలాగే ఉంటుంది. వారు వినాశం అంచులకు గొనిపోబడతారు. అల్లాహ్ ఇలా హెచ్చరిస్తున్నాడు:

> **"తమ ప్రభువును ఉదయం, సాయంత్రం వేడుకుంటూ, ఆయన ప్రసన్నతను చూరగొనే ప్రయత్నంలో ఉన్నవారి సహచర్యం పట్ల నీ మనసును సంతృప్త పరచుకో. జాగ్రత్త! వారి నుంచి నీ దృష్టిని మరల్చుకోకు. ప్రాపంచిక జీవితపు అందాలను నీవు కోరుకుంటావేమో! చూడు! ఎవరి హృదయాన్ని మేము మా ధ్యానం పట్ల నిర్లక్ష్యానికి లోనుచేశామో, ఎవడు తన మనోవాంఛల వెనుక పరుగులు తీస్తున్నాడో, ఎవడి పనితీరు మితిమీరి పోయిందో అతనికి విధేయత చూపకు."** **(ఖుర్ఆన్ 18 : 28)**

పెదవులను అవిధేయతకు పాల్పడేలా వాటి ఇష్టానికి వదిలేయటం, శరీరావయవాలను ఇతరుల పట్ల అమర్యాదకరంగా ఉపయోగించటం, తమ పాపాలతో మనసులను మసిబార్చుకోవటం మొదలగునవి విశ్వాసాన్ని సర్వ నాశనం చేసే విషయాలు. చూడటానికి అవి అతి సాధారణ విషయాలుగా కనపడతాయి. కాని ధార్మిక నష్టం రీత్యా అవి మహా ఘోరమైనవి. ఎందుకంటే కళ్లు అధర్మమైన వాటిని చూస్తాయి. చెవులు చెడును ఆలకిస్తాయి. హృదయం అనుచిత ఆలోచనలను ప్రోత్సహిస్తుంది. దౌర్జన్యానికి పాల్పడేందుకు, అన్యాయానికి ఒడిగట్టేందుకు ముందుకు వెళ్తాయి. మర్మావయవాలు అశ్లీల కార్యాల కోసం తహతహ లాడుతుంటాయి. కడుపులు పాపాలతో నిండిపోతాయి. ఓ అల్లాహ్! నీ దయాదాక్షిణ్యాలతో మమ్మల్ని కరుణించమని కోరుకుంటున్నాము.

అశ్లీలాల నుండి శరీరావయవాలను పరిరక్షించుకుంటూ, అల్లాహ్ దయానుగ్రహాలను ఆశించే ఓ ఉపవాసీ! ఈ శుభవార్తను విని ఆనందించు. స్వర్గంలో దయ, క్షమ మొదలగు సద్భావాలు నీ కోసం ఎదురు చూస్తున్నాయి. రయ్యాన్ ద్వారం గుండా ప్రవేశించే సదాచార సంపన్నులైన ఉపవాసుల కోసం అవి వేయి కళ్లతో వేచి చేస్తున్నాయి.



ఉపవాస కాలంలో తమ విశ్వాసం పెరిగిందా లేక తరిగిందా? తమ నమ్మకాలు దృఢపడ్డాయా లేక మెతకబడ్డాయా? అని తమను తాము ప్రశ్నించుకునే శుభ తరుణమే రమజాన్ మాసం. ఈ విధంగా ఆత్మ పరిశీలన చేసుకున్నప్పుడు మాత్రమే తాము ధర్మపథంలో పురోగమనంలో ఉన్నామో, లేక తిరోగమనానికి లోనయ్యామో, తాము లాభం పొందామో లేక నష్టాల్లో చిక్కుకున్నామో సులువుగా తెలుస్తుంది.

కనుక ఓ అల్లాహ్! మా విశ్వాసాలను, నమ్మకాలను పటిష్టపరచు. మా జ్ఞానాన్ని అధికం చెయ్యి. మాకు విజయాన్ని చేకూర్చు.

పాఠం 17

# అల్లాహ్‌పై ప్రేమ పెరిగే ప్రియమాసం రమజాన్

అల్లాహ్ ఆజ్ఞకు శిరసావహించి, రమజాన్ నెలలో ఉపవాసం ఉండే వ్యక్తి హృదయంలో అల్లాహ్‌పై ప్రేమ పెరుగుతుంది. ఈ నెలలో అల్లాహ్ మిత్రులు (ఔలియా అల్లాహ్) అల్లాహ్‌ను అమితంగా ప్రేమిస్తారు. ఆయన వారిని ప్రేమిస్తాడు. వారూ ఆయన్ని ప్రేమిస్తారు. అల్లాహ్ తన ప్రియ మిత్రుల గురించి, "వారు నన్ను ప్రేమిస్తారు" అని చెప్పటంలో అంత ఆశ్చర్యం ఏమీ లేదు కాని, "నేను వారిని ప్రేమిస్తాను" అని అల్లాహ్ స్వయంగా చెప్పటం చాలా గొప్ప విషయం. అల్లాహ్ వారిని పుట్టించాడు. ఈ సువిశాల ప్రపంచంలో ఏ లోటూ లేకుండా వారిని పోషిస్తున్నాడు. వారి ఆశలను, అభిలాషలను మన్నిస్తున్నాడు. వారి తప్పులను, పొరబాట్లను క్షమిస్తున్నాడు. ఇంకా వారిని ప్రేమిస్తున్నాడు కూడా.

అల్లాహ్ పట్ల ప్రేమను సూచించే అంశాలు పది ఉన్నాయి. వాటిని ఒట్టి మాటలతో కాకుండా చేతలతో ఆచరిరంచి చూపినవారే నిజమైన అల్లాహ్ ప్రేమికులు.

1) అల్లాహ్ పలుకులను, ఆయన తన ప్రవక్త ముహమ్మద్ (స)పై అవతరించిన సందేశాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించటం. ప్రియమైన ఆ పదాలను పరవశంతో పలకటం. వాటి అర్థాలను తెలుసుకునేందుకు ప్రయత్నించటం, ఆ పదాల సాన్నిహిత్యాన్ని కోరుకోవటం, వాటి మాధుర్యాన్ని ఆస్వాదించటం, వాటి ప్రియ బోధనలతో హృదయ సీమను అలంకరించుకోవటం, ఆ బోధనల ఉద్యానవనాల్లో నయన విహారం చేయటం, చీకటి రాత్రుల్లో ఆ పదాల వెలుగుతో జాగరూకులై ఉండటం, వాటి ఆదేశాలకు అనుగుణంగా మసలుకోవటం, జీవితపు అన్ని రంగాల్లోనూ వాటికి కట్టుబడి బతకటం.

2) ముహమ్మద్ (స) అడుగుజాడల్లో నడుస్తూ, ఆయనపై శాంతీ కారుణ్యాలు (దరూద్, సలామ్‌లు) కురిపించమని అల్లాహ్‌ను వీలైనంత ఎక్కువగా ప్రార్థిస్తూ ఉండటం, ప్రవక్త పట్ల అపారమైన ప్రేమాభిమానాలు కనబరచటం, ప్రవక్త (స) సత్యసంధతపై తిరుగులేని నమ్మకంతో, జీవితపు అన్ని రంగాల్లోనూ ఆయన జీవన



సంవిధానాన్ని ఆదర్శనీయమైనదిగా గుర్తించటం.

**"నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది – అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు." (ఖుర్ఆన్ 33 : 21)**

ఎలాంటి అనుమానాలకు, సందేహాలకు తావివ్వకుండా, బేషరతుగా ప్రవక్త (స) ప్రబోధించిన ఆచరణను స్వీకరించటం కూడా అల్లాహ్ పట్ల మనకు గల అపారమైన ప్రేమకు ఒక ఆనవాలే.

**"కనుక (ఓ ప్రవక్తా!) నీ ప్రభువు తోడు! వారు తమ పరస్పర వివాదాలన్నింటిలో నిన్ను తీర్పరిగా చేసుకోనంతవరకూ, తర్వాత నీవు వారి మధ్య చెప్పిన తీర్పుపట్ల వారు తమ మనసులలో ఎలాంటి సంకోచానికి, అసంతృప్తికి ఆస్కారం యివ్వకుండా మనస్ఫూర్తిగా శిరసావ హించనంత వరకూ – వారు విశ్వాసులు కాజాలరు." (ఖుర్ఆన్ 4 : 65)**

3) అల్లాహ్ నిర్ణయించిన హద్దులకు కట్టుబడి జీవించటం, వాటిని అతిక్రమించే ప్రయత్నాలు తామూ చేయకుండా, ఇతరులనూ చేయనీయకుండా ఉండటం. దైవధిక్కార పాపం నుంచి తమను తాము కాపాడుకోవటం, ఇస్లామీయ సాంప్రదాయ గౌరవ ప్రపత్తులకు భంగం వాటిల్లినప్పుడు ధార్మిక పౌరుషత్వాన్ని కనబరచటం, ధర్మంలో కొత్తపుంతలు తొక్కుతూ, ఇస్లాం ధర్మ మూలాలకు విఘాతం కలిగిస్తున్నవారిని చూసి మనసులో బాధపడటం, అల్లాహ్ చట్టాన్ని సముద్ధరించటం కోసం, ఈ భూమిపై ఆయన ధర్మాన్ని సంస్థాపించటం కోసం మనో వాక్కాయ కర్మలచే కృషి చేయటం.

4) అల్లాహ్‌కు మిత్రులు కావటం ఎంతటి గౌరవప్రదమైన విషయమో అర్థం చేసుకోగలగటం, తామూ అల్లాహ్ మిత్రులుగా మారేందుకు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కృషిచేయటం. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా చెప్పబడింది:

**"వినండి! అల్లాహ్ స్నేహితులకు భయముగానీ, దుఃఖంగానీ ఉండదు. వారు విశ్వసించిన వారై, (చెడుల విషయంలో అల్లాహ్‌కు) భయపడేవారై ఉంటారు." (ఖుర్ఆన్ 10 : 62,63)**

మరో చోట ఇలా చెప్పబడింది:

**"(ముస్లిములారా!) వాస్తవానికి మీ స్నేహితులు అల్లాహ్, ఆయన ప్రవక్త,**

**ఇంకా నమాజును నెలకొల్పే, జకాతును చెల్లించే, రుకూ చేసే (ఆరాధనలో అణకువను కలిగి ఉండే) విశ్వాసులు మాత్రమే. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, విశ్వాసులను మిత్రులుగా చేసుకున్న వారు, అల్లాహ్ పక్షంవారే విజయం పొందుతారన్న విషయాన్ని తెలుసుకోవాలి."**

**(ఖుర్ఆన్ 5 : 55, 56)**

5) మంచిని పెంచేందుకు, చెడును త్రుంచేందుకు ఎంతటి గొప్ప త్యాగానికయినా సిద్ధపడటం. ఈ ప్రయత్నం ఇస్లాంకు పునాది లాంటిది. ఇస్లాం ధర్మానికి ఇది కంచు కోటలా ఉండి పరిరక్షిస్తోంది.

**"మేలు వైపుకు పిలిచే, మంచిని చెయ్యమని ఆజ్ఞాపించే, చెడుల నుంచి వారించే ఒక వర్గం మీలో ఉండాలి. ఈ పనిని చేసే వారే సాఫల్యాన్ని పొందుతారు."** **(ఖుర్ఆన్ 3 : 104)**

రమజాన్ మాసంలో ఈ గొప్ప సుగుణం జిగేలుమనే దీపపు కాంతిలా ప్రజ్వరిల్లుతుంది. సత్యసంధులైన ఉపవాసులు ఇతరులను అల్లాహ్ వైపుకు పిలవటానికి, ఇతరులకు ఉపయోగపడే సలహాలివ్వటానికి శాయశక్తులా కృషిచేస్తారు. ఫలితంగా మహోన్నతుడైన అల్లాహ్ వారికి గొప్ప బహుమానాలను ప్రసాదిస్తాడు.

6) సచ్ఛీలురను ప్రేమిస్తూ, వారితో కలిసి మెలిసి ఉండటం, వారి సాంగత్యంలో ఆనందాన్ని అనుభవించగలగటం, అల్లాహ్ మిత్రుల వద్దకు వారి ప్రేమైక పలుకులు వినేందుకు వెళ్ళటం, వారి శ్రేయస్సు కోసం అల్లాహ్‌ను ప్రార్థించటం, ఇంకా వారి సాన్నిహిత్యంలో మేలును పొందటం, వారి గౌరవాన్ని కాపాడటం. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"విశ్వాసులు (ముస్లింలు) అన్నదమ్ములు (అన్న సంగతిని మరువకండి). కనుక మీ అన్నదమ్ముల మధ్య సర్దుబాటుకు ప్రయత్నించండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి – తద్వారా మీరు కరుణించ బడవచ్చు."**

**(ఖుర్ఆన్ 49 : 10)**

మరో చోట ఇలా ఉపదేశిస్తున్నాడు:

**"అల్లాహ్ త్రాడును అందరూ కలసి గట్టిగా పట్టుకోండి. చీలిపోకండి. అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి–అప్పుడు మీరు ఒండొకరికి శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలలో**



**పరస్పరం ప్రేమానురాగాలను సృజించాడు. దాంతో ఆయన అనుగ్రహం వల్ల మీరు ఒకరి కొకరు అన్నదమ్ములుగా మారారు. మీరు అగ్ని గుండం ఆఖరి అంచులకు చేరుకోగా, ఆయన మిమ్మల్ని దాన్నుంచి కాపాడాడు. మీరు సన్మార్గం పొందాలని ఈ విధంగా అల్లాహ్ మీకు తన సూచనలను విశద పరుస్తున్నాడు."** **(ఖుర్ఆన్ 3 : 103)**

7) అల్లాహ్‌కు చేరువ కావటానికి మరో మార్గం స్వచ్ఛందంగా, అదనంగా పాటించే " నఫిల్ " ఆరాధనలు. ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలు, హజ్, ఉమ్రా, ఖుర్ఆన్ పారాయణం, ధ్యానం మొదలగు వాటిని ఆచరించటం ద్వారా మనిషి అల్లాహ్‌కు దగ్గరవుతాడు.

**"మేము అతని ప్రార్థనను స్వీకరించి, అతనికి యహ్యాను ప్రసాదించాము. అతని భార్యను అతని కోసం బాగు చేశాము. ఈ సద్వర్తనులు సత్కార్యాల కోసం త్వరపడేవారు. ఆశతోనూ, భయంతోనూ మమ్మల్ని వేడుకునేవారు. మా ముందు అశక్తతను, అణకువను కనబరచే వారు."**

**(ఖుర్ఆన్ 21 : 90)**

ఒకానొక హదీసె ఖుద్సీ ప్రకారం అల్లాహ్, "నా దాసుడు అదనపు ఆరాధనలతో నిత్యం నా సమీపానికి చేరుకుంటూ ఉంటాడు. ఆ విధంగా నేను అతన్ని ప్రేమిస్తాను" అని అన్నాడు.

8) అశాశ్వతమైన ప్రాపంచిక జీవితాని కంటే శాశ్వతమైన పరలోక జీవితానికి ప్రాధాన్యతనివ్వటం. ఈ లోకంలో ప్రతి ఒక్కరూ మరణించి, ఒకానొక రోజు పరమ ప్రభువైన అల్లాహ్‌ను కలసుకోవలసినవారే. దానికి సంబంధించి ఒక ముస్లిం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలి. మృత్యువు ప్రతి ఒక్కరిని విధిగా కబళించి ప్రభువు ముందు నిలబెడుతుంది. సుమతులైన విశ్వాసులు అంతకు ముందే పుణ్యకార్యాలతో అల్లాహ్‌ను కలిసేందుకు సన్నిద్ధులై ఉంటారు. అక్కడకు అందరూ వీలైనన్ని ఎక్కువ సత్కార్యాలు వెంటబెట్టుకొని వస్తారు. మరి ఆ రోజు ఏమీ లేకుండా భికారిగా ఉంటావా?

9) నిర్మల హృదయంతో గత పాపాలపై పశ్చాత్తాపం చెందటం, ఆపై దైవధిక్కారానికి పూర్తిగా స్వస్తి పలకటం కూడా అల్లాహ్ ప్రేమను పొందే మార్గాల్లో ఒకటి. మార్గభ్రష్టకర, నీతి బాహ్యమైన, పనికి మాలిన, నీచపు కార్యాలను విడనాడాలి.

అలాంటి దుర్లక్షణాలు కలిగిన వ్యక్తులతో కలిసి తిరగటం అల్లాహ్ ఆగ్రహాన్ని కొనితెస్తుంది. అటువంటి సావాసం మృత్యు సమానమైనది. అదో మొండిరోగం. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"ఆ రోజు (ప్రాణ) మిత్రులు కూడా ఒకరికొకరు శత్రువులై పోతారు- అయితే దైవభక్తి పరాయణులు మాత్రం అలా ప్రవర్తించరు."**

**(ఖుర్ఆన్ 43 : 67)**

"తీర్పు దినాన ప్రజలు తాము అభిమానించిన వారి వెంట లేపబడతారు" అని దైవప్రవక్త (స) సైతం హెచ్చరించి ఉన్నారు.

10) అల్లాహ్ మార్గంలో అమరగతువ్వాలని అభిలషించటం; తమ ప్రాణం పూర్తిగా కేవలం అల్లాహ్ కోసమే అంకితమయ్యే రోజు కోసం నిరీక్షించటం; ఏమాత్రం ప్రాపంచిక ప్రతిఫలం ఆశించకుండా ధనప్రాణాలను, సిరిసంపదలను, సంతానాన్ని అల్లాహ్ మార్గంలో అర్పించుకునే అరుదైన అవకాశం కోసం ఆశతో ఎదురు చూడటం;

**"నిస్సందేహంగా అల్లాహ్ ముస్లింల నుండి, వారి ధన ప్రాణాలను స్వర్గానికి బదులుగా కొన్నాడు. వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు; చంపుతారు, చంపబడతారు. దీనిపై తౌరాతులోనూ, ఇంజీలులోనూ, ఖుర్ఆన్‌లోనూ సత్యమైన వాగ్దానం చేయబడింది. వాగ్దానాన్ని నెరవేర్చటంలో అల్లాహ్‌ను మించిన వాడెవడుంటాడు? కాబట్టి మీరు ఖరారు చేసిన ఈ వర్తకానికిగాను సంబర పడండి. ఘన విజయం అంటే ఇదే." (ఖుర్ఆన్ 9 : 111)**

ఓ అల్లాహ్! మాకు నీపై గల ప్రేమను వృద్ధిపరచు. నీ ప్రసన్నతను కోరుకునే వారిలా, ఎల్లవేళలా నీ మన్నింపును అర్థిస్తూ, చేసిన తప్పులపై పశ్చాత్తాపం చెందే వారిలా మమ్మల్ని మలచు. నిశ్చయంగా అన్నింటిపై శక్తి, అధికారం కలవాడివి నీవే ప్రభూ!



# పాఠం 18

# పిల్లలకు సద్బుద్ధులు నేర్పేందుకు సదవకాశం

ఇస్లాం ధర్మం ప్రకారం పిల్లలకు మంచి శిక్షణ ఇవ్వటానికి అనువైన కాలం ఏది? అని అడిగితే అది రమజానే. కనుక తెలివిగా మసలుకోండి. ఈ నెలలో మీ పిల్లలు మీ మార్గదర్శనంలో ఉండేలా చూసుకోండి. వారు మీ కనుసన్నలలో మెలిగేలా ఈ నెలకోసం ఓ ఖచ్చితమైన ప్రణాళికను రూపొందించుకోండి. ఎందుకంటే, సంతానం అల్లాహ్ మనకు ఇచ్చిన వరమే కాదు, అది ఓ గొప్ప బాధ్యత కూడా. సదాచార సంపన్నులైన మన పూర్వీకులు తమ పిల్లలకు పసితనంలోనే ఉపవాసం అలవాటు చేసేవారు. రాత్రిళ్లు నిద్ర మేల్కొని అల్లాహ్ సన్నిధిలో నమాజు చేసే విధంగా వారికి ఎంతో గొప్ప శిక్షణను అందించేవారు. మరి ఓ ఉపవాసులారా! మీలాగా మీ సంతానం కూడా అల్లాహ్ మార్గంలో నడిచి పరలోక సాఫల్యాన్ని పొందాలని మీరు కోరుకుంటున్నట్లయితే ఈ క్రింద పేర్కొనబడుతున్న కొన్ని విషయాలను మీరు గమనించండి. మీ పిల్లలకు అత్యుత్తమ రీతిలో శిక్షణ అందించటానికి ఇవి మీకు ఎంతగానో ఉపకరించగలవు.

**మొదటిది:** నడవడికలో, ప్రవర్తనలో, ఇంకా ప్రతి పనిలోనూ మీరు మీ పిల్లల కోసం ఆదర్శవంతులుగా మారండి. మీ పిల్లలకు తండ్రి, గురువు, ఆదర్శమూర్తి అన్నీ మీరేనన్న సంగతిని మర్చిపోకండి. మీ పిల్లవాడు ప్రతిదీ మీ నుంచి నేర్చుకోవాలని ప్రయత్నిస్తుంటాడు సుమా! ప్రవక్త జకరియా (అలైహి) గారి విషయంలో అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

**"మేము అతని ప్రార్థనను స్వీకరించి, అతనికి యహ్యాను ప్రసాదించాము. అతని భార్యను అతని కోసం బాగు చేశాము. ఈ సద్వర్తనులు సత్కార్యాల కోసం త్వరపడేవారు. ఆశతోనూ, భయంతోనూ మమ్మల్ని వేడుకునేవారు. మా ముందు అశక్తతను, అణకువను కనబరచేవారు."**

**(ఖుర్ఆన్ 21 : 90)**

**రెండవది :** ఇంట్లో విన్నవీ, చూసినవీ చిన్న పిల్లల జీవితాలపై చెరగని ముద్ర వేస్తాయి. అవి వారి భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపుతాయి. విశ్వాస భరిత వాతావరణం, దివ్య ఖుర్‌ఆన్ పారాయణం, ప్రవక్త ప్రవచనాల అధ్యయనం, సామూహిక నమాజులు, అందరూ కలసి అల్లాహ్ నామ స్మరణ చేయటం, అల్లాహ్ ఆజ్ఞలను పాటించటం, నిషిద్ధ విషయాలకు దూరంగా మసలుకోవటం వంటివి సర్వ సామాన్యంగా జరుగుతుండే ఇంటి పిల్లలు సచ్ఛీలురు, గొప్పవారు అవుతారు. దీనికి భిన్నంగా మనోరంజక విషయాలు, ప్రాపంచిక ఆకర్షణలు, నవ్వులాటలు, అల్లాహ్ షరీఅత్‌ను భంగపరిచే పరికరాలు వంటివి ఇంటిని ఏలుతున్నట్లయితే అవి ఆ ఇంటి పిల్లలను శక్తిహీనుల్ని చేస్తాయి. వారిని ఆటపాటల్లో ముంచేస్తాయి. ఒట్టి పనికిమాలినవారిగా తయారు చేస్తాయి.

**మూడవది :** పిల్లలకు చక్కగా ఖుర్‌ఆన్ నేర్పించాలి. వారిచేత ఖుర్‌ఆన్ ఆయతులను వల్లె వేయించాలి. అల్లాహ్ గ్రంథం పట్ల వారికి గట్టి అనుబంధం ఉండేలా శిక్షణ ఇవ్వాలి. చిన్నతనంలో పిల్లలు ఏ విషయాన్నయినా చక్కగా చదివి గుర్తు పెట్టుకోగలుగుతారు. మరి పిల్లల ఈ విలువైన కాలం టి.వి. సినిమాల్లో గడచి పోతే వారి భవిష్యత్తుకు ఎంత నష్టం! పెద్దయిన తర్వాత వారు అనవసర కార్యకలాపాల్లో గడిచిపోయిన తమ సమయం గురించి తప్పకుండా చింతిస్తారు. ఆ అవస్థ రాకుండా తల్లిదండ్రులు పసితనంలోనే వారి బాగోగులను పట్టించుకోవాలి.

**నాల్గవది:** పసితనంలోనూ, ఆ తర్వాత యవ్వనంలోనూ పిల్లలకు దొరికే సావాసాలు వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయి. కనుక తమ పిల్లలు చెడు సావాసాలకు గురికాకుండా కాపాడుకోవటం తల్లిదండ్రుల బాధ్యత. చెడు సావాసాలు అంటువ్యాధుల కంటే ప్రమాదకరం. చెడ్డ మిత్రుడు శత్రువు కంటే ఎక్కువగా నష్టం కలుగజేస్తాడు. ఎంతోమంది పిల్లలు చెడు సావాసాల మూలంగా పెడదారి పడుతుంటారు. "మనిషి తన స్నేహితుని ధర్మంపై ఉంటాడు. కనుక ప్రతి ఒక్కరూ తాము ఎవరిని స్నేహితునిగా చేసుకుంటున్నారో పరిశీలించుకోవాలి" అని దైవప్రవక్త (స) ఉపదేశించారు. ఒక వ్యక్తిని గురించి తెలుసుకోవాలంటే నేరుగా అతన్నే అడగవలసిన అవసరం లేదు. అతని స్నేహితులను అడిగితే అతని చిట్టా మొత్తం తెలుస్తుంది. ప్రతి ఒక్కరిపై అతని మిత్రుల ప్రభావం తప్పక ఉంటుంది.

**ఐదవది :** విజయం, వికాసం, మానసిక పరిపక్వత లక్ష్యంగా పిల్లలను క్రమశిక్షణతో పెంచండి. నీతిబాహ్యత అంటేనే పిల్లలు అసహ్యించుకునేలా వారిని



పెంచండి. మీ పిల్లలు దుష్టులను అనుకరించకుండా జాగ్రత్తపడండి. మగపిల్లలయితే వారు స్త్రీలను అనుకరించటానికి ప్రయత్నిస్తున్నారేమో ఓ కంట కనిపెడ్తూ ఉండండి. లేదంటే అది ఎన్నో అవమానాలకు, పరాభవాలకు కారణమవుతుంది.

**ఆరవది :** పిల్లల దుస్తులను, వారి అలంకరణను గమనిస్తూ ఉండండి. వారు ప్రవక్త (స) ప్రబోధనలకు అనుగుణమైన దుస్తులు ధరించేలా చూడాలి. వస్త్రధారణలో గాని, వేషభూషణలోగాని అల్లాహ్ శత్రువుల పద్ధతుల్లో వారు నడవకుండా జాగ్రత్తపడాలి. "మనుషులు తాము అనుకరించిన వారి కోవకు చెందినవారుగానే పరిగణించబడతారు" అని దైవప్రవక్త (స) ప్రవచించి ఉన్నారు. మరి దైవప్రవక్త (స) ప్రబోధనల ప్రకారం పురుషులు బంగారు ఆభరణాలు తొడగరాదు. పట్టు వస్త్రాలు ధరించరాదు. నేలమీద ఈడ్చుకుంటూ తిరిగేలా పొడుగాటి దుస్తులు ధరించరాదు. ఇతరులతో మాట్లాడినప్పుడు అనుమానంతో, నిరాశతో మాట్లాడరాదు. వెర్రి వెకిలింపులు, వికృత ఆనందం, అతి ఉద్రేకం, చపల స్వభావం, తొందరపాటు, మానసిక బలహీనత, వ్యర్థ కాలక్షేపం మొదలగునవి ఘోరమైన దురలవాట్లు. ఇలాంటి దుర్లక్షణాలకు పిల్లలు దూరంగా ఉండేటట్లు జాగ్రత్తపడాలి.

**ఏడవది :** అల్లాహ్ నామాలను, వాటి అర్థాలను, ఆయన గుణగణాలను, ఆయనకు గల మహోన్నతమైన శక్తిని పసితనంలోనే పిల్లలకు బోధించాలి. పిల్లల మనసుల్లో ఇస్లాం ధర్మం పట్ల అభిమానం జనించేందుకు కృషి చేయాలి. పిల్లలు ధర్మం గురించి దురభిప్రాయాలు పెట్టుకోకుండా జాగ్రత్తపడాలి. వివిధ పద్ధతుల్లో ఇస్లాం ఔన్నత్యాన్ని వారికి బోధపరచాలి. అన్నింటికీ అతీతుడైన అల్లాహ్ గొప్పతనాన్ని వారు గుర్తించేందుకు ప్రయత్నించాలి. ఇతర అన్ని పుస్తకాలపై దివ్య ఖుర్‌ఆన్‌కు గల గొప్ప ఔన్నత్యం పిల్లలకు బోధపడాలి. ప్రవక్త (స)వారి జీవిత చరిత్ర పిల్లల నరనరాల్లో జీర్ణించుకోవాలి. ప్రవక్త హదీసులను మన పిల్లలు తమ హృదయాలకు హత్తుకోవాలి.

**ఎనిమిదవది :** పిల్లలకు లాభదాయకమైన జ్ఞానం అందించాలి. వారు ఆ జ్ఞానాన్ని శ్రద్ధగా సముపార్జించేందుకు కృషి చేయాలి. చదువు కోసం నిర్విరామ కృషిని వారిని అలవరచాలి. అందుకు తగిన సమయం, సహాయం, ప్రోత్సాహం పిల్లలకు తల్లిదండ్రులు అందిస్తూ ఉండాలి. పిల్లల్లో త్యాగ భావం జనించేందుకు కృషి చేయాలి. వారు తాము ఆర్జించుకున్న జ్ఞానాన్ని ఆచరించుకుని పరిరక్షించుకునే మార్గాలు పిల్లలకు తెలియజేయాలి. నిద్రమత్తు కన్నా, నిర్లక్ష్యం కన్నా కృషి, శ్రమ అందించే

ఫలాలు అత్యంత మధురమైనవనీ, అవి ఎంతో ప్రయోజనకరమైనవనీ, ప్రీతికర మైనవనీ పెద్దలు పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలి.

**తొమ్మిదవది** : ప్రతి కృషిలోనూ, ప్రతి ఆశయంలోనూ వారు విజయవంతం కావాలని పెద్దలు పిల్లలను దీవించాలి. అందుకు అవసరమైన సహాయ సహకారాలను వారికి అందించమని అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉండాలి. వారిలో విశిష్టమైన పరివర్తన కలిగించమనీ, వారికి మంచి వైపు, సత్యం వైపు దారి చూపమని ప్రభువును వేడు కుంటూ ఉండాలి. దీనికోసం తల్లిదండ్రులు రాత్రి చివరి వేళల్లో నిద్రమేల్కొని నమాజు చేసి తమ పిల్లల శ్రేయస్సు కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం కదు దీనంగా అల్లాహ్‌ను వేడుకోవాలి. తమ పిల్లల మనసుల్లో విశ్వాసాన్ని పెంపొందించమని, దైవదూతల ద్వారా వారికి సహాయం అందిస్తూ ఉండమని ప్రభువును కోరుకోవాలి. ఎందుకంటే ఆ సమయం ప్రార్థనలు ఎక్కువగా స్వీకృతిని పొందే సమయం. సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా అంటున్నాడు:

**"వారు ఇలా ప్రార్థిస్తూ ఉంటారు : "ఓ మా ప్రభూ! నువ్వు మా భార్యల ద్వారా, మా సంతానం ద్వారా మా కళ్లకు చలువను ప్రసాదించు. మమ్మల్ని దైవ భక్తిపరుల (ముత్తఖీన్‌ల) నాయకునిగా చేయి." (ఖుర్‌ఆన్ 25 : 74)**

**పదవది:** పెద్దలు పిన్నల పట్ల దయ, జాలి, కరుణ, వాత్సల్య భావాలతో మసలుకోవాలి. అవసరమైతే వారి వెంట కాసేపు ఆడుకొని అయినా సరే వారిని దగ్గరకు తీసుకోవాలి. ప్రేమతో ముద్దాడుతూ వారి మనసులను గెలుచుకోవాలి. గాజు లాంటి వారి సున్నిత హృదయాలను ఏమాత్రం గాయపరచరాదు. వారి చిన్ని మనసులు నొచ్చుకునేలా ప్రవర్తించరాదు. ఇతరుల ముందు వారిని కించపరుస్తూ మాట్లాడరాదు. సంతానాన్ని పెంచి పోషించటంలో, వారి పట్ల సద్వ్యవహారంలో ప్రతి ముస్లిం, దైవప్రవక్త (స)ను ఆదర్శంగా తీసుకోవాలి. ఇతరుల పట్ల కరుణ చూపేవారిపై అల్లాహ్ కూడా కరుణజూపుతాడు సుమా!

ఓ అల్లాహ్! మమ్మల్ని ఆశీర్వదించు. మా భార్యాబిడ్డలను మా పాలిటి కంటి చలువను చేయి. నీ పట్ల అత్యంత ఎక్కువ భయభక్తులు గలవారిగా మమ్మల్ని తీర్చిదిద్దు.



## పాఠం 19 దుబారా ఖర్చు ఓ దౌర్భాగ్యం

నేడు ధర్మభ్రష్ట సమాజాలు లోనై ఉన్న పాపాలలో అనవసర వ్యయం, దుబారా ఖర్చు కూడా ఒకటి. పరమ ప్రభువైన అల్లాహ్ ఈ దురలవాటును నిషేధించాడు. తన దాసులు దుబారా ఖర్చుకు పాల్పడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించాడు:

**"మితిమీరే వారిని అల్లాహ్ ఎట్టిపరిస్థితిలోనూ ఇష్టపడడు."**

**(ఖుర్‌ఆన్ 6 : 141)**

దుబారా ఖర్చు అల్లాహ్ పట్ల భయభక్తులు లేనివారి విధానం. అల్లాహ్ ఎంత హెచ్చరిస్తున్నప్పటికీ వారు ఆయన వరాలను బొత్తిగా గౌరవించరు. దైవ ప్రసాదాలను ఖాతరు చెయ్యరు.

**"బంధువుల, నిరుపేదల, ప్రయాణీకుల హక్కును వారికి ఇస్తూ ఉండు. దుబారా ఖర్చు చేయకు. దుబారా ఖర్చు చేసేవారు షైతానుల సోదరులు. మరి షైతానేమో తన ప్రభువునకు కృతఘ్నుడు." (ఖుర్‌ఆన్ 17 : 26,27)**

చాలామంది తాము తలచుకుంటే దుబారా ఖర్చును నివారించుకోగలరు. అయినా కూడా వారు దుబారా ఖర్చు చేస్తారు. అవసరానికి మించి అధిక మోతాదులో భోజన సదుపాయాలను సిద్ధం చేయించటం, విపరీతమైన జిహ్వా చాపల్యం మూలంగా రకరకాల వంటకాలకు, పానీయాలకు అలవాటు పడి ఉండటం మొదలగునవి దుబారా ఖర్చుకు కారణాలు. ఇటువంటి వారు ఉపవాస దీక్ష ప్రారంభంలో సహ్‌రీ కోసం, మళ్ళీ ఉపవాస విరమణ చేసుకుంటున్నప్పుడు ఇఫ్తార్ కోసం డబ్బును నీళ్లలా ఖర్చుపెడతారు. అందులో చాలా భాగం నిరుపయోగంగా మారి చివరికి చెత్త కుప్పల పాలవుతుంది.

ఓ ఉపవాసీ! గొప్పలకు పోయి దుబారా ఖర్చు చేయకుండా జాగ్రత్తపడు. ముస్లింలలో ఎంతోమంది నిరుపేదలు, అభాగ్య జీవులూ ఉన్నారు. నీ దగ్గర అవసరా నికి మించి ఏమైనా ఉంటే దాన్ని అటువంటి వారికి పంచిపెట్టు. అది అల్లాహ్ వద్ద

నీ కర్మల పత్రంలో నమోదు చేయబడుతుంది. అంతేగాని అనవసరమైన దుబారా ఖర్చులకు పాల్పడకు.

**"అల్లాహ్ ప్రీతికోసం వారు నిరుపేదలకు, అనాథులకు, ఖైదీలకు అన్నం పెడు తుంటారు. (పైగా వారిలా అంటారు) : "మేము కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే మీకు తినిపిస్తున్నాము. అంతేగాని మీనుండి మేము ఎలాంటి ప్రతిఫలాన్నిగానీ, ధన్య వాదాలనుగానీ ఆశించటం లేదు." "నిశ్చయంగా మేము మా ప్రభువు తరఫున సంభవించే అత్యంత కఠినమైన, సుదీర్ఘమైన రోజు గురించి భయపడుతున్నాము." అందువల్ల అల్లాహ్ వారిని ఆనాటి కీడు నుండి రక్షించి, వారికి ఉల్లాసాన్నీ, ఆహ్లాదాన్నీ వొసగాడు." (ఖుర్ఆన్ 76 : 8-10)**

ప్రామాణికమైన ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: ప్రళయదినాన అల్లాహ్ మానవునితో, "ఓ ఆదం పుత్రుడా! నేను నిన్ను అన్నం పెట్టమని అడిగాను. కాని నువ్వు నాకు అన్నం పెట్టలేదు" అంటాడు. దానికి మానవుడు, "ప్రభూ! సకల లోకాలకూ ప్రభువువి నీవు. నేను నీకు అన్నం పెట్టటమేంటి?" అని విన్నవించుకుంటాడు. దానికి అల్లాహ్, "అదికాదు, ఫలానా నా దాసుడు నిన్ను అన్నం పెట్టమని అడిగాడు. కాని నువ్వు అతనికి అన్నం పెట్టలేదు. ఆ రోజు నువ్వు అతనికి అన్నం పెట్టి ఉన్నట్లయితే నన్ను పొంది ఉండేవాడివి" అని అంటాడు.

దుబారా క్రిందికి వచ్చే మరో అంశం అతి నిద్ర. అందునా పగటి పూట పనివేళల్లో మత్తుగా నిద్రపోవటం. చాలామంది రమజాన్ మాసంలో ఉపవాసం పాటిస్తారు. కాని పగలు ఉపవాస సమయంలో పదే పదే కునుకు తీస్తూ, ఆ సమయమంతా నిర్లక్ష్యంగా గడిపేస్తుంటారు. అంతకన్నా బాధాకరమైన విషయం, రాత్రంతా వీరు అనవసర కార్యక్రమాల్లో, వ్యర్ధ సంభాషణల్లో, ఎలాంటి లాభమూ లేని నీచ నికృష్ట పనుల్లో మునిగి ఉండటం. మరికొందరు అదే శుభప్రదమైన రమజాన్ నెలలో అన్యాయమైన, అధర్మమైన, చెప్పనలవి కాని చెడు కార్యాల్లో కాలం గడుపుతారంటే పరిస్థితి ఎలా చెయ్యి దాటి పోతోందో అర్థం చేసుకోవచ్చు.

దుబారాల్లో ఇంకో రకం - ఫిత్ర్ పండుగ రోజు అనవసరంగా డబ్బు, సమయం వృథా చేయటం. చాలా మంది ముస్లింలు పండుగ కోసం వస్త్రాలపైనా, ఆట వస్తువులపైనా, ఇంకా రకరకాల వంటకాలపైనా తమ శక్తికి మించి డబ్బు ఖర్చు



చేసి అప్పుల పాలవుతుంటారు. ఇంకా కొందరుంటారు, అనవసర విషయాల కోసం అయితే వీరు విపరీతంగా డబ్బు ఖర్చు పెడతారు. కాని దానధర్మాల వంటి సత్కార్యాల కోసం మాత్రం పైసా ఖర్చు చేయరు. ఎవరయినా అభాగ్యుడు వారి ముందు చేయి చాపి నిలుచుంటే క్షణాల్లో వారి పిసినారితనం బయటపడుతుంది. దానం పేరు వినగానే వారిచేతులు గట్టిగా బిగుసుకు పోతాయి.

అల్లాహ్ నుంచి సిరి సంపదలు పొందిన ఓ సౌభాగ్యవంతుడా! ఈ సమాజంలో ఎంతోమంది నిరుపేదలు, అనాథలు ఉన్నారని తెలుసుకో. మరి నువ్వు నీ చుట్టు ప్రక్కల్లో ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నదానం చేయవా? ఎండకు కాలిపోతూ, వానల్లో తడుస్తూ అలాగే బతుకు బండి లాగుతున్న నగ్న శరీరాలకు నీవు బట్టలు ఇవ్వవా? నీ తోటి ముస్లిం సోదరులు చల్లటి నీడలో, ప్రశాంతంగా దైవారాధన జరుపుకునేందుకు మస్జిదులను నిర్మించవా? ఇంతకు ముందు బంధుత్వం తెంచుకున్న వారితో సరికొత్తగా సంబంధాన్ని పునరుద్ధరించుకోవా? కష్టాలతో బాధపడేవారిని ఊరడించవా?

రమజాన్ నెలలో ఉపవాసం ఉండి, కారణమేదీ లేకుండానే చీటికి మాటికి ఇతరుల్ని కలుస్తూ ఉండటం మరో రకం దుబారా. అర్థం పర్థం లేని పరామర్శల వల్ల కూడా ఎన్నో రకాల నష్టాలున్నాయి. దీనివల్ల అందరి సమయం వృథా అవుతుంది. వారి ఆయుష్షు అనవసరంగా ఖర్చయిపోతుంది. తీర్పు దినం నాడు అలాంటివారు ప్రపంచ జీవితంలో తమ నిర్లక్ష్యానికి ఎంతగానో విలపిస్తారు.

మితిమీరిన మనోల్లాసం, అనుచిత ఆహ్లాదం లాంటి వ్యర్థమైన అలవాట్లతో కూడా మానవ ధనం, సమయం చాలా వృథా అవుతున్నాయి. ఫుట్‌బాల్ లాంటి ఆటలు, శరీర వ్యాయామాలు, విహార యాత్రలు తదితర కార్యక్రమాలకు మనుషులు అవసరాని కంటే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారు. ఇవి ప్రజల విలువైన సమయాన్ని హరింపజేస్తున్నాయి. లేకపోతే ఇదే సమయాన్ని హాయిగా ప్రార్థనల కోసమో, దైవ నామస్మరణ కోసమో, ఖుర్ఆన్ పారాయణం కోసమో, జ్ఞాన సముపార్జన కోసమో, ఇస్లాం ధర్మ ప్రచారం కోసమో, మంచిని పెంచి చెడును త్రుంచటం కోసమో సద్వినియోగం చేసుకోవచ్చు. ఒకవేళ అలా జరగటం లేదంటే వృథాగా కాలహరణం జరుగుతుందన్న విషయంలో మాత్రం ఎలాంటి సందేహం లేదు. అయితే రేపు సమాధులు వాటిలో ఉన్నదంతా బయట పడవేసే వేళ, హృదయాలు తమలోని

రహస్యాలను బట్ట బయలు చేసే వేళ, తాము చేసినదంతా ఎవరికి వారు కళ్ళారా చూసుకుంటారు.

మనం చేసే దుబారా కార్యకలాపాలను సంక్షిప్తంగా మరోమారు మననం చేసుకుందామా!

★ ప్రజలు సాధారణంగా తమ సమయాన్ని దైవధిక్కారానికి, పాపపు పనులకు వినియోగిస్తారు. ఇది సమయ దుర్వినియోగం క్రిందికి వస్తుంది. ఈ రకమైన కాలహరణం అత్యంత ప్రమాదకరం, పరమ నికృష్టకార్యం.

★ విలువైన తమ కాలాన్ని ఒక పద్ధతి, ఒక ఉద్దేశం లేకుండా అనాలోచితంగా అన్ని దిశల్లో చెల్లా చెదురుగా ఉపయోగించేవారు తీర్పు దినాన తమ ప్రతిఫలాన్ని చూసుకొని అందరికంటే ఎక్కువగా పశ్చాత్తాపపడతారు.

★ భోజన పానీయాల కోసం, దుస్తుల కోసం దుబారా ఖర్చు చేసేవారికి నిరాశా నిస్పృహలు తప్ప చివరికి ఇంకేమీ మిగలవు.

★ అవధులు మీరి ఆటపాటల్లో, మనోరంజక కార్యక్రమాల్లో, విహార యాత్రల్లో తమ కాలాన్ని దుర్వినియోగం చేసుకునేవారు యధార్థానికి తమను తామే మోసం చేసుకుంటున్నారు. బంగారం లాంటి తమ భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు.

మనకు రుజుమార్గం చూపించాలనీ, మనల్ని ధర్మంపై స్థిరంగా నిలిపి ఉంచాలనీ, మనకు ధన, మాన, ప్రాణ వనరులన్నిటినీ సద్వినియోగం చేసుకునే సౌభాగ్యాన్ని, తద్వారా పరలోక సాఫల్యాన్ని ప్రసాదించాలని నేను పరమ ప్రభువైన అల్లాహ్‌ను కడు దీనంగా వేడుకుంటున్నాను.



# పాఠం 20 సదాచరణ, సత్సంబంధాల మాసం

ఉపవాసం వల్ల మనసుకు మృదుత్వం వస్తుంది. మనిషిలో వినయ విధేయతలు జనిస్తాయి. అంతేకాదు, దయా కరుణా భావాలను కూడా అది పెంపొందిస్తుంది. మనిషి కనబరచే దయా స్వభావానికి, మంచితనానికి అత్యంత హక్కుదారులు అతని బంధువులు, కుటుంబ సభ్యులు. రమజాన్ మాసం రక్త సంబంధాలను, అత్తింటి అనుబంధాలనూ ఈ సందర్భంగా పదే పదే జ్ఞాపకం చేస్తుంది. కనుక ఒక విశ్వాసి రమజాన్ మాసంలో తన సంబంధీకులను కలుస్తాడు. వారితో సత్సంబంధాలు పెట్టుకుంటాడు. వారి పట్ల ప్రేమానురాగాలు వ్యక్తపరుస్తాడు. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ప్రజలను ఉద్దేశించి ఇలా అంటున్నాడు:

**"ఒకవేళ మీకు అధికారం లభిస్తే మీరు రాజ్యంలో (భువిలో) అరాచకం సృష్టించటానికి, బంధుత్వ సంబంధాల విచ్ఛిత్తికి పాల్పడటానికి కూడా వెనుకాడరు." (ఖుర్‌ఆన్ 47 : 22)**

ఏమైనా బంధుత్వ తెగత్రెంపులు చాలా పెద్ద పాపం. అంతేకాదు, అది మహా ఆపద కూడా. బంధువులతో మంచి సంబంధాలు కలిగివుండటం మహోన్నతమైన సుగుణం. ఎంతో ఉత్కృష్టమైన సత్కార్యం. ఇంకా అది మనిషిలోని సదాచార సంపన్నతకు నిదర్శనం.

బంధుత్వ సత్సంబంధాల ప్రాముఖ్యత గురించి చెప్పుకోవాలంటే ఇంకా చాలా ఉంది. "బంధుత్వ తెగత్రెంపులకు పాల్పడేవాడు స్వర్గంలోకి ప్రవేశించలేడు" అంటూ దైవప్రవక్త (స) చేసిన హెచ్చరిక ఎవరి తనువునైనా వణికించక మానదు. ఔను మరీ! అల్లాహ్ కలిపి ఉంచమని ఆదేశిస్తున్న దానిని త్రుంచి వేసేవానికి స్వర్గ ప్రవేశ భాగ్యం లభించటం దుస్సాధ్యమే కదా! మరో సందర్భంగా దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: అల్లాహ్ సమస్త సృష్టిరాశుల్ని సృష్టించటం అయిపోయింది. అప్పుడు 'బంధుత్వం' లేచి నిలబడింది. "అల్లాహ్! బంధుత్వాల తెగత్రెంపుల బారి నుంచి నేను నీ శరణు

కోరుతున్నాను" అని బంధుత్వం అంది. అందుకు అల్లాహ్, "అయితే నీతో సత్సంబంధాలు పెట్టుకున్న వాడితో నేనూ సత్సంబంధాలు పెట్టుకుంటాను. నీతో తెగత్రెంపులు చేసుకున్నవాడితో నేనూ తెగత్రెంపులు చేసుకుంటాను. ఇది నీకిష్టమే కదా?!" అని అడిగాడు. "ఇష్టమే ప్రభూ!" అని విన్నవించుకుంది బంధుత్వం. అప్పుడు అల్లాహ్ తనతో, "సరే! ఆ భాగ్యం నీకు తప్పకుండా దక్కుతుంది" అన్నాడు.

మరో ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) తన అనుచర సమాజానికి, "ఒక బంధువు ఉపకారం చేస్తే దానికి బదులుగా ఉపకారం చేసేవాడు (నిజమైన) బంధుప్రియుడు కాదు. తన బంధువులు తనతో తెగత్రెంపులు చేసుకున్నప్పటికీ వారితో సత్సంబంధాలు కొనసాగించేవాడే (సిసలైన) బంధుప్రియుడు" అని ప్రబోధించి ఉన్నారు. ఒక వ్యక్తి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి, "దైవప్రవక్తా! నా బంధువులు కొందరున్నారు. నేను వారితో సత్సంబంధాలు కొనసాగించాలని ప్రయత్నిస్తున్నప్పటికీ వారు మాత్రం నాతో తెగత్రెంపులు చేసుకోవాలని చూస్తున్నారు. నేను వారిపట్ల మంచిగా మెలగుతూ ఉంటే వారేమో నాకు కీడు తలపెడుతున్నారు. నేను వారి పట్ల ఉదార వైఖరిని అనుసరిస్తుంటే వారు మాత్రం నా పట్ల మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు" అంటూ దైవప్రవక్త (స) ముందు తన గోడు వెళ్ళబుచ్చుకున్నాడు. అతని మాటలు విని దైవప్రవక్త (స), "నువ్వు చెప్పింది నిజమయితే వారి నోళ్ళల్లో నువ్వు వేడి బూడిదను ఎత్తి పోస్తున్నావనుకో. నువ్వు మాత్రం వారిపట్ల ఇలాగే సత్ప్రవర్తనతో మెలగుతూ ఉండు. అంతవరకు అల్లాహ్ తరఫు నుంచి వారికి వ్యతిరేకంగా ఒక సహాయకుడు నీ వెంట ఉంటాడు" అని అన్నారు.

చాలా కొద్దిమంది తప్ప దైవప్రవక్త (స) గారి బంధువులంతా ఆయన జీవితంలో ఆయనకు బద్ధ శత్రువులుగా ఉన్నవారే! తన సొంత బంధువులే ఆయన్ని నగరం వదలి వెళ్ళిపోయేటట్టు చేశారు. ఎన్నో కష్టాలకు, బాధలకు గురిచేశారు. ఆయనకు ఎలాంటి హక్కులూ అందకుండా చేశారు. ఆఖరికి ఆయనపై కయ్యానికి కాలు దువ్వటానికి సైతం సిద్ధమయ్యారు. కాని అల్లాహ్ తన ప్రవక్త (స)కు విరోధులపై విజయం చేకూర్చాడు. ఆ సమయంలో ఆయన గత విషయాలేవీ తిరగదోడలేదు. పైగా అత్యంత ఆశ్చర్యకరమైన రీతిలో వారందరికీ క్షమాభిక్ష పెట్టి మన్నించి వదలివేశారు. అది చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సన్నివేశం. నిరుపమానమైన చారిత్రక ఘట్టం.



బంధువులతో చక్కని సంబంధాలు కలిగిన వ్యక్తి ఆయుష్షు పెరుగుతుంది. జీవితం పరిశుద్ధమవుతుంది. అతనికి లభించే అనుగ్రహాలు అనూహ్యంగా పెరిగిపోతాయి. అంతేకాదు, అతని జీవితం విశ్వాసంతో నిండిపోతుంది. అనంత కరుణామయుడు అయిన అల్లాహ్ పట్ల అతనిలో భయభక్తులు పెంపొందుతాయి. అతని జీవితం ఖుర్ఆన్ బోధనలకు ప్రతిరూపంగా మారిపోతుంది. చక్కటి బంధుత్వ సంబంధాలు చెడులకు, అవమానాలకు వ్యతిరేకంగా చేసే యుద్ధాలలో సైనికుణ్ణి కాపాడే కవచాల వంటివి. అవి మనిషికి ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోక జీవితంలోనూ పరిపూర్ణ రక్షణను కలిగిస్తాయి. ఒకానొక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స), "నాతో సంబంధాలు త్రెంచుకున్నవారితో నేను సత్సంబంధాలు కలిగి వుండాలనీ, నాకు ఇవ్వనివారికి నేను ఇవ్వాలనీ అల్లాహ్ నాకు ఆజ్ఞాపించాడు" అని వక్కాణించారు.

మరి ఈ సంబంధ బాంధవ్యాలలో అత్యంత ఉన్నతమైనది, మహోన్నతమైనది ఏది అంటే, అది తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన, సద్భావన, ప్రేమ, ఔదార్యం. వారి కోసం ప్రార్థనలు చేయటం, అల్లాహ్ ఆజ్ఞలకు విరుద్ధం కాని విషయాలలో వారి మాటను జవదాటకుండా మసలుకోవటం కూడా తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన క్రిందికే వస్తుంది. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవీయబడింది:

**"నీ ప్రభువు స్పష్టంగా ఆజ్ఞాపించాడు: మీరు ఆయనను తప్ప మరొకరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించాలి. నీ సమక్షంలో వారిలో ఒకరుగాని, ఇద్దరుగానీ వృద్ధాప్యానికి చేరుకుని ఉంటే వారి ముందు (విసుగ్గా) "ఊహ్" అని కూడా అనకు. వారిని కసురుకుంటూ మాట్లాడకు. పైగా వారితో మర్యాదగా మాట్లాడు. అణకువ, దయాభావం ఉట్టిపడే విధంగా నీ భుజాలను వారి ముందు అణచిపెట్టు. "ఓ ప్రభూ! బాల్యంలో వీరు నన్ను (ప్రేమానురాగాలతో) పోషించినట్లుగానే నీవు వీరిపై దయజూపు" అని వారి కోసం ప్రార్థిస్తూ ఉండు."**

**(ఖుర్ఆన్ 17 : 24)**

ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి, "దైవప్రవక్తా! నా సత్ప్రవర్తనకు అందరికన్నా ఎక్కువ హక్కుదారులెవరు?" అని అడిగాడు. దానికి ఆయన, "నీ తల్లి" అని చెప్పారు. "ఆ తరువాత ఎవరు?" అని అడిగాడా వ్యక్తి. దానికి ఆయన, "నీ తల్లి"

అనే చెప్పారు. ఆ వ్యక్తి మళ్ళీ, "ఆ తరువాత ఎవరు దైవప్రవక్తా?" అని ప్రశ్నించాడు. అప్పుడు కూడా, "నీ తల్లి" అనే సమాధానమిచ్చారు దైవప్రవక్త (స). ఆ వ్యక్తి మళ్ళీ అడిగాడు, "ఆ తరువాత ఎవరు?" అని. అప్పుడు ఆయన, "నీ తండ్రి" అని చెప్పారు.

సదాచరణను నేర్చుకోవటానికి, బంధువులతో చక్కటి సంబంధాలు నెలకొల్పుకోవటానికి ఓ చక్కటి శిక్షణా కాలం రమజాన్ ఉపవాసం. అది మంచి నడవడికకు నెలవు. దయాజలం ఊరే చెమ్మ. కరుణకు పట్టుగొమ్మ. ఉపవాసం మనిషి అంతరంగాన్ని అలంకరిస్తుంది. ఆత్మను పరిశుద్ధపరుస్తుంది. ఉపవాసం భావోద్వేగాల్లో అనూహ్యమైన మార్పులు తీసుకువస్తుంది. ఉపవాసులను ఆరోగ్యవంతులుగా, శక్తివంతులుగా తీర్చిదిద్దుతుంది. మరి మనం ఈ రమజాన్ నెలలో మన బంధువుల ఇండ్లకు వెళ్ళి, ఆప్యాయతతో వారిని కలిసి ఆలింగనం చేసుకుందామా?! అమితమైన ప్రేమాభిమానాల్లో వారిని ముంచెత్తుదామా?! వారితో కలిసి అల్లాహ్ ఆరాధనలో పాల్గొందామా?! అందరితో అనురాగాన్ని పంచుకుందామా?! అల్లాహ్, సత్కార్యాలు చేసిన వారిని వారి ప్రతిఫలాలకు దూరం చేయడు.

ఓ అల్లాహ్! ధర్మాన్ని అర్థం చేసుకుని ఆచరించే శక్తి సామర్థ్యాలను మాకు అనుగ్రహించు. అపార దైవభీతి కలిగిన మా నాయకులు ముహమ్మద్ (స) గారి అడుగుజాడల్లో మమ్మల్ని నడిపించు. ఏకైక రుజుమార్గంపై మా పాదాలను స్థిరపరచు.



పాఠం 21

# రమజాన్ : ముస్లింల కొరకు కారుణ్య మాసం

అల్లాహ్ తాను కోరుకున్న వారి హృదయాలను దయా గుణంతో నింపివేస్తాడు. ఇతరులపై జాలి, దయ, కరుణ చూపే దాసులపై అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పక కురిపిస్తాడు. ఆయన అత్యంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. ఆయన కారుణ్యాన్ని ప్రేమిస్తాడు. కరుణ వైపుకు పిలుపునిస్తాడు. తన దాసుల్లో జాలి, కరుణా భావాలు గలవారిని అమితంగా ఇష్టపడతాడు. ఎల్లప్పుడూ ఓర్పు, కనికరం కలిగి ఉండాలని ఆజ్ఞాపిస్తాడు. ఒక వ్యక్తిలో కొంచెమైనా జాలి, కరుణ లేకపోవటానికి అనేక కారణాలుంటాయి. వాటిలో ముఖ్యమైన కారణాలు రెండున్నాయి. ఒకటి, లెక్కలేనన్ని పాపాలు చేసి ఉండటం. రెండు, అవిశ్వాస వైఖరిని కలిగి ఉండటం. అవిశ్వాసుల, పాపాత్ముల హృదయాలు నల్లని మచ్చలతో, మరకలతో మసిబారిపోతాయి. వాటి మీద అంధకారం ఆవరిస్తుంది. తర్వాత అవి పాషాణాల కంటే కఠినంగా మారిపోతాయి. గతంలో ఇస్రాయీల్ జాతివారి పాషాణ వైఖరి గురించి దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా వివరించాడు:

**"కాని ఆ తరువాత మీ హృదయాలు కఠినమైపోయాయి. రాళ్ళ మాదిరిగా, కాదు – వాటికంటే కూడా కఠినం అయి పోయాయి. కొన్ని రాళ్ళలోనుంచైతే సెలయేళ్ళు ప్రవహిస్తాయి. మరి కొన్ని రాళ్ళు పగలగా వాటి నుంచి నీరు చిమ్ముతుంది. మరికొన్ని అల్లాహ్ భయంతో (కంపించి) క్రిందపడి పోతాయి. మీ కార్యకలాపాల పట్ల అల్లాహ్ పరధ్యానంలో ఉన్నాడని అనుకోకండి."**

**(ఖుర్ఆన్ 2 : 74)**

ఇస్రాయీల్ జాతివారు ఏ విధంగా దివ్య శాసనాలను, ఆజ్ఞలను ధిక్కరించారో దివ్యఖుర్ఆన్‌లోనే అల్లాహ్ మరో చోట ఇలా తెలిపాడు:

**"ఆ తరువాత వారు తమ వాగ్దానాన్ని భంగపరచిన కారణంగా మేము వారిని శపించాము. వారి హృదయాలను కఠినం చేశాము. (తత్కారణంగా) వారు పదాలను వాటి (అసలు) స్థానం నుంచి తారుమారు చేస్తున్నారు.**

**అంతేకాదు, తమకు బోధించబడిన ఉపదేశంలో చాలా భాగం వారు మరచిపోయారు. (ఓ ప్రవక్తా!) వారు పాల్పడే ఏదో ఒక ద్రోహానికి సంబంధించిన సమాచారం నీకు అందుతూనే ఉంటుంది. అయితే వారిలో కొద్ది మంది మాత్రం అలాంటివారు కారు. అయినా సరే నువ్వు వారిని మన్నిస్తూ, ఉపేక్షిస్తూ ఉండు. నిస్సందేహంగా అల్లాహ్ ఉత్తమంగా వ్యవహ రించేవారిని అమితంగా ప్రేమిస్తాడు." (ఖుర్ఆన్ 5 : 13)**

ధనం వల్ల వచ్చే అహంకారం, భోగభాగ్యాల వల్ల వచ్చే గర్వము వ్యక్తిని జాలి, కనికరం చూపకుండా అడ్డుకుంటాయి. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"అసలు విషయం ఏమిటంటే మానవుడు హద్దుమీరి పోతున్నాడు. ఎందుకంటే, తనకు ఎవరి అవసరమూ లేదన్న భావన అతనికుంది." (ఖుర్ఆన్ 96 : 6,7)**

విశ్వాసం, సత్కార్యాల క్రమశిక్షణను కలిగివున్నప్పుడు మనుషుల హృదయాలు దయాదాక్షిణ్యాలతో నిండి ఉంటాయి.

మనుషుల్లో కరుణ తగ్గిపోవటానికి మరో కారణం పెద్ద తిండిబోతులుగా మారటం. ఈ దుర్గుణం మనుషుల్లో అసహ్యాన్ని, అశ్రద్ధను పెంచి పోషిస్తుంది. గర్హనీయమైన ఈ చెడు లక్షణాలను సమూలంగా తుడిచి పెట్టటానికే ముస్లింలపై రమజాన్ ఉపవాసాలు విధిగా నిర్ణయించబడ్డాయి. ఉపవాసం పాటించే వ్యక్తి సహజంగానే ఎంతో కనికరం కలవాడై ఉంటాడు. అతను కూడా ఉపవాస దీక్ష ద్వారా ఆకలి, దప్పికలను చవిచూసి ఉంటాడు. కష్టాలను భరించే శక్తిని సాధిస్తాడు. ఫలితంగా అతని హృదయం తోటి ముస్లింల యెడల దయాదాక్షిణ్యాలు, శ్రద్ధాసక్తులు, మృదు భావనలు కలిగి ఉంటుంది.

ఒక ముస్లిం తోటి ముస్లిం పట్ల కనబరచదగిన గొప్ప సుగుణం 'దయ'. బాధ్యతాయుతుడైన ప్రతి వ్యక్తి తన ఆధీనంలో, తన పోషణలో ఉన్న వ్యక్తులపై తప్పక చూపవలసిన గుణం 'కరుణ'. వారి పట్ల అతను దయగలిగి ఉండాలి. వారి వల్ల జరిగే తప్పులను పెద్ద మనసుతో మన్నించాలి. ప్రవక్త (స) ఒక హదీసు ప్రకారం అల్లాహ్‌ను ఈ విధంగా ప్రార్థించారు :

**"ఓ అల్లాహ్! ఎవరైనా నా అనుచర సమాజ వ్యవహారాలకు బాధ్యత వహించి, వారిని కష్టాల పాల్జేస్తే, నువ్వు కూడా వారిని కష్టాల పాల్జెయ్యి. మరెవరైనా**



**నా అనుచర సమాజ వ్యవహారాలకు బాధ్యత వహించి, వారిపట్ల మృదువుగా మెలిగితే నువ్వు కూడా వారిపట్ల మృదువుగా వ్యవహరించు." (ఖుర్ఆన్)**

మరో హదీసులో ఆయన ఇలా ప్రబోధించారు:

**"అల్లాహ్ ఎవరినయినా ముస్లింల కొన్ని వ్యవహారాలకు అధికారిగా నియమించినప్పుడు అతను వారి అవసరాలకు, అక్కరలకు, పేదరికానికి మధ్య అడ్డుగా నిలిస్తే (వారి అవసరాలను తీర్చకపోతే) ప్రళయ దినాన అల్లాహ్ కూడా అతని అవసరాలకు అక్కరలకు, పేదరికానికి అడ్డుగా ఉంటాడు." (ఖుర్ఆన్)**

ఒక విద్యావేత్త, ఒక ఉపాధ్యాయుడు తన విద్యార్థుల పట్ల ప్రేమగా వ్యవహరిస్తే విద్యార్థులు కూడా తమ గురువులను గౌరవిస్తారు, అభిమానిస్తారు. అంతేకాదు, వారి బోధనల నుంచి అమితంగా లాభం పొందుతారు. అటు ఈ విధానాన్ని అవలంబించే గురువులకు కూడా అల్లాహ్ తరఫు నుంచి ఉత్కృష్టమైన, అపారమైన బహుమతులు ప్రాప్తమవుతాయి. ఆదర్శ మహాప్రవక్త ముహమ్మద్ (స)ను సంబోధిస్తూ, అల్లాహ్ తన దివ్య గ్రంథంలో ఇలా ప్రబోధించాడు:

**"(ఓ ప్రవక్తా!) అల్లాహ్ దయవల్లనే నీవు వారి యెడల మృదు మనస్కుడ వయ్యావు. ఒకవేళ నువ్వే గనక కర్కశుడవు, కఠిన మనస్కుడవు అయివుంటే వారంతా నీ దగ్గరి నుంచి వెళ్ళిపోయేవారు. కనుక నువ్వు వారిపట్ల మన్నింపుల వైఖరిని అవలంబించు, వారి క్షమాపణ కోసం (దైవాన్ని) వేడుకో. కార్య నిర్వహణలో వారిని సంప్రదిస్తూ ఉండు. ఏదైనా పని గురించి తుది నిర్ణయానికి వచ్చినప్పుడు, అల్లాహ్‌పై భారం మోపు. నిశ్చయంగా అల్లాహ్ తనను నమ్ముకున్న వారిని ప్రేమిస్తాడు." (ఖుర్ఆన్ 3 : 159)**

అలాగే ప్రజల నమాజులకు సారథ్యం వహించే ఇమాములు కూడా నమాజులో తమను అనుసరించే ముక్తదీలకు ఎలాంటి ఇబ్బంది, కష్టం కలగకుండా జాగ్రత్తపడాలి. ఈ విషయంలో ఇమాములు వివేకంతో పాటు దయాదాక్షిణ్యాలను కూడా ప్రదర్శించాల్సిన అవసరం ఉంటుంది.

ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "మీలో ఎవరయినా ప్రజలకు ఇమామత్ చేసినప్పుడు వారు ఖిరాత్‌ను తగ్గించాలి. ఎందుకంటే వెనుక నమాజ్ చేసేవారిలో పిల్లలు, వృద్ధులు, బలహీనులు, అవసరం మీద వెళ్లవలసినవారూ ఉంటారు." మరో

సందర్భంగా ముఆజ్ (రజి) ఒకానొక సామూహిక నమాజులో సుదీర్ఘమైన ఖుర్‌ఆన్ పారాయణం చేశారని తెలుసుకొని ఆయన ముఆజ్ (రజి)ని ఉద్దేశించి, "ఏంటి ముఆజ్! నమాజీలకు పరీక్ష పెడుతున్నావా? నమాజీలకు పరీక్ష పెడుతున్నావా?" అంటూ ఆయన్ని సున్నితంగా మందలించారు.

అలాగే ఒకసారి ఉస్మాన్ బిన్ అబూ అస్సఖఫీ (రజి) దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి, "దైవప్రవక్తా! నన్ను మా తెగప్రజల కొరకు నమాజుసారధి (ఇమాము)గా నియమించరూ?!" అని కోరారు. అందుకాయన బదులిస్తూ, "సరే! నేను నిన్ను నీ ప్రజలకు ఇమాముగా నియమిస్తున్నాను. అయితే నీవు వారిలో అందరికంటే బలహీనుడైన వానిని దృష్టిలో పెట్టుకొని నమాజు చేయించాలి సుమా!" అని చెప్పారు.

ధర్మాన్ని ప్రచారం చేసే ఒక "సందేశ ప్రదాత" (దాయీ) మృదువైన భాషతో, సున్నితమైన సంభాషణతో ప్రజలను ఇస్లాం ధర్మం వైపుకు ఆహ్వానించాలి. ధర్మం విషయంలో వారు వెలిబుచ్చే సందేహాలను శ్రద్ధగా వినాలి. వారు కోరే వివరణలను చక్కగా అర్థమయ్యే రీతిలో వారికి వివరించాలి. మాటల ద్వారాగాని, చేతల ద్వారా గాని వారి మనసు నొచ్చుకోకుండా జాగ్రత్తపడాలి. వారిని సాదరంగా ఇస్లాం వైపుకు ఆహ్వానించాలి. గౌరవించాలి. దైవధిక్కారులనైనా సరే అగౌరవపరచరాదని, పదిమందిలో వారిని తూలనాడరాదని ఇస్లాం బోధిస్తోంది. కరడుగట్టిన దైవవిరోధుల తోనూ కదు మృదువుగా వ్యవహరించాలని చెప్పింది. అందుకు ఉదాహరణ ప్రవక్త మూసా (అ)కు మరియు దైవవిరోధి, నిరంకుశ చక్రవర్తి అయిన ఫిరౌన్‌కు మధ్య జరిగిన సంఘటన. ఫిరౌన్‌తో మాట్లాడవలసి వచ్చినప్పుడు అత్యుత్తమ రీతిలో అతన్ని రుజుమార్గం వైపుకు ఆహ్వానించాలని మూసా, హారూన్ (అ) ప్రవక్త ద్వయానికి అల్లాహ్ తరపున ఆదేశమయింది.

> **"వాడితో కాస్త మృదువుగా మాట్లాడండి - బహుశా వాడు అర్థం చేసుకో వచ్చు లేదా భయపడవచ్చు."** **(ఖుర్‌ఆన్ 20 : 44)**

దివ్య ఖుర్‌ఆన్‌లోనే మరో చోట ఇలా చెప్పబడింది:

> **" నీ ప్రభువు మార్గం వైపు జనులను వివేకంతోనూ, చక్కని ఉపదేశంతోనూ పిలువు. అత్యుత్తమ రీతిలో వారితో సంభాషణ జరుపు. నిశ్చయంగా తన మార్గం నుంచి తప్పిన వారెవరో నీ ప్రభువుకు బాగా తెలుసు. సన్మార్గాన ఉన్న వారెవరో కూడా ఆయనకు బాగా తెలుసు." (ఖుర్‌ఆన్ 16 : 125)**



పిల్లలకు తల్లిదండ్రుల కరుణ కావాలి. సంతానానికి ఏ విధంగా శిక్షణ ఇవ్వాలన్న సంగతి ఇంతకు ముందు (18 వ పాఠంలో) కూడా ప్రస్తావనకు వచ్చింది. తల్లిదండ్రుల కరుణా వాత్సల్యాలు పిల్లల్లో రుజువర్తనను, విధేయతా భావాన్ని పెంపొం దిస్తాయి. వారిలో భద్రతా భావాన్ని కలుగజేస్తాయి. దీనికి భిన్నంగా సాధారణంగా ప్రజల్లో ఉండే కరకు వైఖరి స్వయానా వారినే నిరాశా నిస్పృహలకు గురి చేస్తుంది. అందుకేనేమో ప్రవక్త (స) అన్నారు: "ఏ వస్తువులోనయినా మృదుత్వం ఉంటే అది ఆ వస్తువును హృద్యంగా మలుస్తుంది. మరి ఆ మృదుత్వమే కరువైతే అది అంద వికారంగా తయారవుతుంది."

ఆకలి బాధతో కడుపును మల మల మాడ్చుకునే ఓ ఉపవాసుల్లారా! దారిద్ర్యంతో, పేదరికంతో మీలాగా అన్నానికి అలమటించే అభాగ్య జీవులు మీ పరిసర ప్రాంతాల్లోనే కొన్ని వేల సంఖ్యలో ఉన్నారని తెలుసుకోండి. మరి వారికి అన్నదానం చేయటానికి మీలో ముందుకు వచ్చేవారు ఎవరూ లేరా? ఉపవాసం వల్ల దాహంతో నాలుక పిడచకట్టుకు పోతున్న ఓ ఉపవాసీ! కరవు కాటకాల మూలంగా నీ పరిసరాల్లోనే గుక్కెడు నీళ్లు దొరక్క గొంతెండి పోతున్న బడుగు జీవులు వేల సంఖ్యలో ఉన్నారన్న సంగతి తెలుసా నీకు?! మరి వారి దాహార్తిని తీర్చేందుకు కార్యోన్ముఖులయ్యే కారుణ్య స్వభావులు మనలో ఎవరూ లేరా? అందమైన వస్త్రాలు ధరించే ఓ ఉపవాసీ! తమ శరీరాన్ని పూర్తిగా కప్పుకునేందుకు సరిపడ దుస్తులు కూడా లేని నగ్న శరీరాలు నీ చుట్టు పక్కల తిరుగుతుండటం నువ్వెప్పుడూ గమనించలేదా? మరి వారికి వస్త్ర దానం చేయటానికి ముందుకు వచ్చే సౌభాగ్యవంతులే మనలో లేరా?!

ఓ అల్లాహ్! మమ్మల్ని నీ కరుణాఛాయల్లోకి తీసుకో. నీ అపార కృపతో మమ్మల్ని క్షమించు. మా మీద దయజూపు. నీ అనంత కరుణతో మా తప్పిదాలను, పాపాలను మన్నించు.

## పాఠం 22

# రమజాన్‌లో మన సంప్రదాయాలను మళ్ళీ వికసించనిద్దాం

ఇస్లామీయ రాజ్యానికి తిరుగులేని నాయకులు, ఆదర్శమూర్తి, సర్వ జన ఆదరణీయులు అంతిమ దైవప్రవక్తే (స). అయన్ని అనుసరిస్తేనే మనకు సుఖశాంతులు ప్రాప్తమవుతాయి. ఆయన అడుగుజాడల్లో నడిస్తేనే మనకు సిరిసంపదలు కలుగుతాయి. పరమ ప్రభువు, అత్యంత శక్తిమంతుడు అయిన అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

> **"ఈ సందేశహరుణ్ణి, నిరక్షరాసి అయిన ఈ ప్రవక్తను అనుసరించేవారు (కరుణించబడతారు) అతని ప్రస్తావన తమ వద్ద ఉన్న తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో లిఖితపూర్వకంగా లభిస్తుంది. ఆ ప్రవక్త మంచిని చెయ్యమని వారికి ఆదేశిస్తాడు. చెడుల నుంచి వారిస్తాడు. పరిశుద్ధమైన వస్తువులను ధర్మ సమ్మతంగా ప్రకటిస్తాడు. అశుద్ధమైన వాటిని నిషిద్ధంగా ఖరారు చేస్తాడు. వారిపై ఉన్న బరువు లను దించుతాడు. వారికి వేయబడి వున్న సంకెళ్లను (విప్పుతాడు). కనుక ఎవరు ఈ ప్రవక్తను విశ్వసించి, అతనికి ఆదరువుగా నిలుస్తారో, తోడ్పాటునందిస్తారో, ఇంకా అతనితోపాటు పంపబడిన జ్యోతిని అనుసరిస్తారో వారే సాఫల్యం పొందేవారు." (ఖుర్‌ఆన్ 7 : 157)**

ఈ లోకంలో ప్రవక్త (స) ప్రభవనం తర్వాత ఇక ఆయన్ను అనుసరించిన వారు మాత్రమే స్వర్గంలో ప్రవేశించగలరు. ఆయన సంప్రదాయాలు నేటి ప్రపంచ ప్రజల కొరకు నూహ్ పడవ లాంటివి. తెలుసు కదా! నూహ్ ప్రవక్త కాలంలో యావత్ ప్రపంచంలో విజృంభించిన జలప్రళయం నుంచి కేవలం పడవలోకి ఎక్కినవారు మాత్రమే బతికి బట్టకట్ట గలిగారు. అలాగే ఈ రోజు ప్రపంచ మానవులందరికీ అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు, ఆయన సంప్రదాయాలే శరణ్యం. ఆయన సంప్రదాయాల నావను ఆశ్రయించినవారు మాత్రమే ఈ లోకంలో సురక్షితంగా ఉండగలుగుతారు. ఒక్క ప్రవక్త (స) జీవితమే లోకులందరికీ ఆదర్శం. అల్లాహ్ ఇలా ప్రకటించాడు:



> **"నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది – అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు." (ఖుర్‌ఆన్ 33 : 21)**

ఒకసారి ప్రవక్త (స) తన అనుచరులను ఉద్దేశించి ఇలా ప్రబోధించారు: "మీరు నా సంప్రదాయాన్ని, ఇంకా సన్మార్గం పొందిన, సజ్జనులైన ఖలీఫాల విధానాన్ని అనుసరించాలి. వాటిని మీరు దంతాలతోనైనా సరే (ఆఖరి సమయం వరకు) గట్టిగా పట్టుకోండి. ధర్మంలో కొత్త పోకడలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ప్రతి బిద్అత్ (కొత్తపోకడ) మార్గభ్రష్టతే." మరో సందర్భంలో ఆయన ఇంకా ఇలా అన్నారు: "ఎవరైనా మా ఈ ధర్మంలో లేని కొత్త విషయాన్ని ప్రవేశపెడితే అది త్రోసిపుచ్చదగినది."

తన సందేశహరుడు ముహమ్మద్ (స)ను అనుసరించటం ఎంత ముఖ్యమో తెలుపుతూ దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> **"అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఏ వ్యవహారంలోనయినా ఒక నిర్ణయం చేసిన తరువాత విశ్వాసులైన ఏ పురుషునికి గాని, స్త్రీకి గానీ తమకు వర్తించే ఆ వ్యవహారంలో ఎలాంటి స్వయం నిర్ణయాధికారం మిగిలి ఉండదు. ఒకవేళ ఎవరైనా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే అతను స్పష్టమైన అపమార్గానికి లోనైనట్లే (జాగ్రత్త!)" (ఖుర్‌ఆన్ 33: 36)**

దివ్య ఖుర్‌ఆన్‌లోనే మరో అధ్యాయంలో ప్రజలు తన ముందు, తన ప్రవక్త ముందు ఎలా మసలుకోవాలో అల్లాహ్ చాలా స్పష్టంగా తెలియపరిచాడు :

> **"విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను మించిపోకండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు." (ఖుర్‌ఆన్ 49 : 1)**

రమజాన్ మాసం అనేది మన మనసుల్లో , మన ఇళ్ళల్లో, మన సమాజంలో స్వచ్ఛమైన ఇస్లామీయ సంప్రదాయాలను పెంపొందించుకునే కారుణ్య మాసం.

దైనందిన జీవితానికి సంబంధించి ప్రవక్త (స) బోధించిన పనులు ముస్లింలు ఎల్లప్పుడూ చేస్తూనే ఉండాలి. శుభప్రదమైన రమజాన్ మాసంలో వాటిని ఇంకా శ్రద్ధగా పాటించాలి. అటువంటి దైనందిన సంప్రదాయాల కోవకు చెందిన కొన్ని కార్యాలు ఇమామ్ ముస్లింతో పాటు బుఖారీ, ఇబ్నె మాజా, అబూదావూద్, తిర్మిజీ,

నసాయీ లాంటి పలువురు పండితులు క్రోడీకరించిన హదీసుల్లో ప్రస్తావనకు వచ్చాయి. దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: పది విషయాలు మానవ సహజ మైనవి. 1) మీసాలు కత్తిరించటం, 2) గడ్డం పెంచటం, 3) ముక్కుని నీటితో శుభ్రపరచుకోవటం, 4) గోళ్లు కత్తిరించటం, 5) వ్రేళ్ల మధ్య భాగాలను కడుక్కోవటం, 6) చంకలోని వెంట్రుకల్ని తొలగించటం, 7) నాభి క్రింది వెంట్రుకలు తీసివేయటం, 8) నీటిని పొదుపుగా ఉపయోగించటం మొదలగునవి.

మనిషి తన దేహం క్రింది భాగంలో ధరించే లుంగీ మొదలగు వస్త్రాలను నేలమీద ఈడ్చుకుంటూ తిరగటాన్ని దైవప్రవక్త (స) వారించిన సంగతి కూడా నిజమే. ఇమామ్ ముస్లిం క్రోడీకరించిన హదీసు గ్రంథంలో దీని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారని ఉంది: "గర్వం కొద్దీ తన క్రింది వస్త్రాన్ని నేల మీద ఈడ్చుకుంటూ తిరిగేవాని వంక అల్లాహ్ (కారుణ్య దృష్టితో) చూడడు." ఇంకో సందర్భంగా దైవప్రవక్త (స) "గిలకల క్రిందికి వ్రేలాడేది నరకానికి వెళ్తుంది" అని కూడా హెచ్చరించి ఉన్నారు.

దైవప్రవక్త (స) మరెన్నో విషయాలను కూడా వారించినట్లు చాలా దృఢమైన హదీసులు ధృవపరుస్తున్నాయి. ముస్లిం, అబూ దావూద్, తిర్మిజీ గ్రంథాల్లో నమోదై ఉన్న ఒక హదీసులో అనస్ (రజి) కథనం ప్రకారం మనిషి నిలబడి పానీయం త్రాగటాన్ని దైవప్రవక్త (స) వారించారు. అలాగే బుఖారీ గ్రంథంలో నమోదై ఉన్న ఒక హదీసులో ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం (ఎవరికయినా అభివాదం తెలియజేయ వలసినప్పుడు, గౌరవం ఇవ్వదలచినప్పుడు మనిషి లేచి నిలబడి ఆ తర్వాత తన స్థానంలో కూర్చోవడాన్ని దైవప్రవక్త (స) వారించి ఉన్నారు. అలాగే నసాయీ గ్రంథంలో నమోదై ఉన్న ఒక హదీసులో జాబిర్ (రజి) కథనం ప్రకారం పురుషుడు తన మర్మాంగాన్ని కుడి చేత్తో తాకటాన్ని, స్త్రీ పాదరక్షలు ధరించి నడవటాన్ని, దుస్తులను తలక్రిందులుగా ధరించటాన్ని, మర్మాంగాలపై వస్త్రం తొలగి పోయేలా కాళ్లు మడచి కూర్చోవటాన్ని దైవప్రవక్త (స) వారించారు.

అబూ సయీద్ (రజి) కథనాన్ని ఇమామ్ అహ్మద్ తన గ్రంథంలో క్రోడీకరించారు. దాని ప్రకారం పురుషుడు స్త్రీ బూట్లు గాని, చెప్పులు గాని ధరించి నడవటాన్ని దైవప్రవక్త (స) వారించారు. సహ్ల్ బిన్ సయీద్ కథనం ప్రకారం పానీయం త్రాగే పాత్రలోకి శ్వాస విడవటాన్ని దైవప్రవక్త (స) వారించారు (తబ్రానీ). అనస్ (రజి) కథనం ప్రకారం వెండి బంగారు పాత్రల్లో తినటాన్ని, త్రాగటాన్ని దైవప్రవక్త (స) వారించారు (నసాయి). అహ్మద్ మరియు నసాయి ఉభయులూ క్రోడీకరించిన ఒక



హదీసు ప్రకారం బంగారాన్ని, పట్టును ధరించటం పురుషుల కొరకు నిషిద్ధంగా, స్త్రీల కొరకు ధర్మ సమ్మతంగా ఖరారు చేశారు దైవప్రవక్త (స).

ఇక నమాజుల విషయానికి వస్తే, ఉషోదయం తర్వాత చేసే ఫజ్ర్ నమాజుకు - సూర్యోదయానికి మధ్య మరో నమాజు చేయటాన్ని, అలాగే అస్ర్ నమాజుకు - సూర్యాస్తమయానికి మధ్య మరో నమాజు చేయటాన్ని దైవప్రవక్త (స) వారించి ఉన్నారు. బుఖారి, ముస్లిం ఉభయ పండితులూ తమ తమ గ్రంథాల్లో ఈ హదీసును నమోదు చేశారు. అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ప్రజలు సమాధుల ఎదురుగా నమాజు చేయటాన్ని కూడా వారించి ఉన్నారు. ఇబ్నె హిబ్బాన్ పండితులు ఈ హదీసును క్రోడీకరించారు. ఆధారాల రీత్యా ఈ హదీసు దృఢమైనది. అలాగే రాత్రి వేళ చేసే ఇషా నమాజుకు ముందు పడుకోవటాన్ని సైతం దైవప్రవక్త (స) వారించారు.

ప్రవక్త (స) వారించిన మరికొన్ని విషయాలు:

- మరణించినవారిపై ఏడ్చి పెడబొబ్బలు పెట్టటం (అబూ దావూద్ - ఇది ప్రామాణికమైన హదీసు)
- తలలోని తెల్ల వెంట్రుకలను పీకేయటం (తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజా - ప్రామాణికం)
- ప్రత్యేకించి శుక్రవారమే ఉపవాసం పాటించటం (బుఖారి, ముస్లిం)
- మిగులు జలాలను అమ్ముకోవటం (ముస్లిం)
- పచ్చ పొడిపించుకోవటం (అహ్మద్ - ప్రామాణికం)

దైవప్రవక్త (స) పండ్లు తోముకోవటానికి ఒక చిన్న పనుదోము పుల్ల (మిస్వాక్)ను ఉపయోగించేవారు. స్థిరమైన ఇస్లామీయ సంప్రదాయాల్లో ఇదీ ఒకటి. "నా అనుచర సమాజం (లేక నా ) ప్రజలు ఇబ్బందికి లోనవుతారనే భయం గనక నాకు లేకపోయినట్లయితే నేను వారిని వుజూ చేసిన ప్రతి సారీ (వేరొక ఉల్లేఖనం ప్రకారం ప్రతి నమాజు సమయంలోనూ) మిస్వాక్ చేయాలని ఆదేశించి ఉండేవాణ్ణి" అని దైవప్రవక్త (స) చెబుతుండేవారు. "మిస్వాక్ ద్వారా నోరు శుభ్రమవుతుంది. దైవప్రసన్నత లభిస్తుంది" అని కూడా ఆయన ప్రబోధిస్తుండేవారు.

దైవప్రవక్త (స) సంప్రదాయాల్లో ముఖ్యమైనవి మరికొన్ని ప్రస్తావించదలచు కుంటే, మనిషి మస్జిద్‌లోకి ప్రవేశించినప్పుడు మస్జిద్ గౌరవార్థం రెండు రకాతుల నమాజు చేసిగాని కూర్చోరాదు. అలాగే మస్జిద్‌లోకి కుడికాలు పెట్టి ప్రవేశించాలి. మస్జిద్ నుండి వెడలినప్పుడు ముందు ఎడమ కాలు బయట పెట్టాలి. పాద రక్షలు తొడిగినప్పుడు ముందు కుడికాలు పాదరక్ష తొడగాలి. విడిచినప్పుడు ఎడమకాలు పాదరక్ష ముందుగా విడవాలి. ఎవరి ఇంటికైనా వెళితే మూడు సార్లు తలుపు తట్టి లేక సలాం చేసి ఇంటి యజమాని అనుమతి గ్రహించాలి. అనుమతి లభించని పక్షంలో లోనికి ప్రవేశించరాదు. ఇక వారికి ఇబ్బంది కలిగించకుండా తిరిగి వెళ్ళి పోవాలి. ఇది ఒక ప్రామాణికమైన హదీసు ద్వారా రూఢీ అయిన విషయం. ఈ హదీసులన్నీ నిత్య జీవితంలో పాటించవలసిన విషయాలు. దైనందిన సంప్రదాయాలు.

ఓ అల్లాహ్! ప్రవక్త (స) మార్గాన్ని అనుసరించే, అవలంబించే, ఇంకా దాన్ని పరిరక్షించే సౌభాగ్యాన్ని మాకు ప్రసాదించు.



# పాఠం 23

# రమజాన్ సందర్భంగా ముస్లిం మహిళకు ఓ ఉత్తరం

సహనంతో, వినయ విధేయతలతో ఉండే ముస్లిం స్త్రీలను సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ ప్రశంసించాడు. తాను ఆజ్ఞాపించిన రీతిలో వారు తమ శీలసంపదను పరిరక్షించుకుంటారని వారిని కొనియాడాడు. సదాచార సంపన్నులైన ముస్లిం పురుషుల లక్షణాలను తెలుపుతూ దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**"మీలో పనిచేసేవారి పనిని - వారు పురుషులైనా సరే, స్త్రీలయినాసరే - నేను వృథా చేయను. మీరు పరస్పరం ఒకే కోవకు చెందినవారు."**

**(ఖుర్‌ఆన్ 3 : 195)**

ఓ ముస్లిం ముఁవతుల్లారా! రమజాన్ మాసం సందర్భంగా మీకో సంతోష వార్త! ఈ పవిత్ర మాసం మళ్ళీ మొదలైన ఆనంద సమయంలో మీ అందరికీ నా శుభాభి నందనలు. మనందరి కొరకు ఈ నెల క్షమాభిక్షకు, నిజమైన పశ్చాత్తాపానికి నెలవు కావాలని కోరుకుంటున్నాను. ఓ చెల్లీ! ఈ శుభ సమయంలో మా నుంచి గులాబీ పుష్ప గుచ్ఛాల వంటి పట్టుమని ఈ పది సలహాలను స్వీకరించవూ?!

**మొదటిది:** ముస్లిం స్త్రీ అల్లాహ్‌ను తన ప్రభువుగా, ముహమ్మద్ (స)ను అల్లాహ్ ప్రవక్తగా, ఇస్లాంను తన జీవన సంవిధానంగా విశ్వసిస్తుంది. ఆమె తన విశ్వాసాన్ని తన మాటల ద్వారా, చేతల ద్వారా, నమ్మకాల ద్వారా వ్యక్తపరుస్తుంది. అల్లాహ్ ఆగ్రహం నుంచి తప్పించుకుంటూ, ఆయన విధించే శిక్షల పట్ల భీతిభావాన్ని వ్యక్తం చేస్తూ, ఆయన ఆజ్ఞల ఉల్లంఘన వల్ల కలిగే విపరీత పరిణామాలకు భయ పడుతూ జీవితం గడుపుతుంది.

**రెండవది:** ముస్లిం మహిళ రోజుకు ఐదుసార్లు నియమానుసారం"వుజూ" చేసుకొని నమాజును ఆచరిస్తుంది. ఎలాంటి వృత్తి అయినా, వినోదమైనా ఆమె దృష్టిని నమాజు నుంచి మళ్ళించజాలదు. నమాజులు మనిషిని అశ్లీలత నుంచి, దుష్కార్యాల నుంచి తప్పకుండా ఆపుతాయి. దైవ ధిక్కారం నుంచి రక్షణకు పెట్టని కోట లాంటివి నమాజులు, ప్రార్థనలు. కనుక ఆమె వ్యక్తిత్వంలో నమాజుల, ప్రార్థనల ప్రభావం చాలా స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది.

**మూడవది :** ముస్లిం నారీ ఎల్లప్పుడూ పరదా ధరించి ఉంటుంది. పరదా పాటింపును ఆమె ఇస్లాం ధర్మం తనకిచ్చిన గౌరవంగా భావిస్తుంది. ఇంటి నుంచి బయటికి వెళ్లినప్పుడల్లా ఆమె పరదా ధరించి అల్లాహ్ రక్షణను కోరుకుంటుంది. తన శీల సంపదకు రక్షణ కలిగించి, తనలో పరిశుద్ధతను పెంచి పోషించి, తన మాన మర్యాదలను కాపాడే పరదాను ఆమె తన పాలిట ఒక అల్లాహ్ వరంగా భావిస్తుంది. అందుకు అల్లాహ్‌కు మనసారా కృతజ్ఞతలు తెలియజేసుకుంటుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు సుమా!

**"ఓ ప్రవక్తా! తమపై నుంచి తమ దుప్పట్లను (క్రిందికి) వ్రేలాడేలా కప్పుకోమని నీ భార్యలకు, నీ కుమార్తెలకు, విశ్వాసులైన స్త్రీలకు చెప్పు. తద్వారా వారు చాలా తొందరగా (మర్యాదస్తులుగా) గుర్తించబడి, వేధింపుకు గురికాకుండా ఉంటారు. అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు."**

**(ఖుర్‌ఆన్ 33 : 59)**

**నాల్గవది :** ముస్లిం వనిత అనునిత్యం తన భర్తకు విధేయురాలై ఉండాలని ఎంతో తహతహలాడుతూ ఉంటుంది. ఆమె అతని పట్ల మృదువుగా, కరుణామయిగా ఉంటుంది. తన భర్తను మంచి పనులు చేయమని ప్రోత్సహిస్తూ ఉంటుంది. అవసర మైన సలహాలు ఇస్తూ అన్ని వేళలా అతన్ని వెన్ను తట్టి నడిపిస్తూ ఉంటుంది. ఏమైనా తన భర్త ముందు బిగ్గరగా మాట్లాడదు. భర్త పట్ల ఆమెలో కరకుదనం అసలే ఉండదు. పైగా అతనితో మృదువుగా, మధుర స్వరంతో మాట్లాడుతుంది. "రోజూ ఐదు పూటలా నమాజులు చేస్తూ, రమజాన్ నెలలో ఉపవాసాలు పాటిస్తూ, తన భర్తకు విధేయురాలై ఉండే మహిళ, తప్పక తన ప్రభువు (తయారు చేసి ఉంచిన) స్వర్గానికి వెళ్తుంది" అని ప్రవక్త (స) ప్రవచించారు.

**అయిదవది :** ముస్లిం స్త్రీ తన సంతానాన్ని అల్లాహ్‌కు విధేయులుగా మలు స్తుంది. ఆ మార్గంలోనే వారిని పెంచి పెద్ద చేస్తుంది. చక్కటి ఇస్లామీయ సిద్ధాంతాలు రంగరించిన ఉగ్గుపాలతో వారిని పోషిస్తుంది. వారికి మంచి ఆధ్యాత్మిక పోషణను అందజేస్తుంది. వారి హృదయాల్లో అల్లాహ్ పట్ల, అల్లాహ్ ప్రవక్త (స) పట్ల అమితమైన ప్రేమాభిమానాలను నూరిపోస్తుంది. దైవధిక్కారం, దుర్నడతలు వారిలో చోటు చేసుకోకుండా అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. పసితనంలోనే వారికి చక్కటి క్రమశిక్షణను గరుపుతుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు సుమా!

**"ఓ విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుటుంబీకుల్ని అగ్ని బారినుండి**



**కాపాడుకోండి. (ఆ అగ్ని ఎటువంటిదంటే) మనుషులు, రాళ్లు దాని ఇంధనం కానున్నారు. దానిపై కర్కశులు, బలిష్టులు అయిన దూతలు నియమితులై ఉన్నారు. అల్లాహ్ ఆజ్ఞలను పాలించటంలో వారు ఏమాత్రం అలక్ష్యం చేయరు. పైగా వారికి జారీ చేయబడిన ఆజ్ఞలను వారు ఖచ్చితంగా పాలిస్తారు."** **(ఖుర్‌ఆన్ 66 : 6)**

**ఆరవది :** ముస్లిం మహిళ ఎట్టి పరిస్థితిలోనూ పర పురుషులతో కలసి ఒంటరిగా ఉండదు. "ఒక ముస్లిం మహిళ ఎన్నడూ మహ్రమ్ కాని (తనతో పెండ్లికి అర్హుడైన) వ్యక్తితో పాటు ఒంటరిగా ఉండదు. ఒకవేళ ఉంటే వారి వెంట మూడో వ్యక్తిగా షైతాన్ కూడా ఉంటాడు" అని దైవప్రవక్త (స) హెచ్చరించి ఉన్నారు. అలాగే ముస్లిం మహిళ తన వెంట మహ్రమ్ పురుషుడు ఉంటేగాని వేరే ఎక్కడికీ ప్రయాణాలు చేయదు. అవసరం లేకుండా ఆమె మార్కెట్లలో, జన సమ్మర్ద ప్రదేశాల్లో తిరుగుతూ కనిపించదు. ఒకవేళ బయటికి వెళ్లే అవసరం ఏర్పడితే ఒంటి నిండా దుస్తులు ధరించి హుందాగా వెళుతుంది.

**ఏడవది:** మగవారికి ప్రత్యేకమైన విషయాలలో ముస్లిం స్త్రీ మగవారిని అనుకరించదు. "స్త్రీలను అనుకరించే పురుషులను, పురుషులను అనుకరించే స్త్రీలను అల్లాహ్ శపించాడ"ని దైవప్రవక్త (స) హెచ్చరించారు. అలాగే వస్త్రధారణలోగాని, ఫ్యాషన్‌లలో గాని, పోలికలలో గాని ముస్లిం మహిళ అవిశ్వాస స్త్రీలను (కాఫిర్ వనితలను) అస్సలు అనుకరించదు. "ఒకరు ఇంకొకరిని అనుకరిస్తే, వారు తాము అనుకరించిన వారి కోవలోనే పరిగణించబడతారు" అన్న దైవప్రవక్త (స) ప్రవచనం తాను ఎట్టి పరిస్థితుల్లోనూ మరచిపోదు.

**ఎనిమిదవది :** ముస్లిం మహిళ తన మంచి మాటలతో, మృదు భాషణలతో తోటి మహిళల్ని కూడా అల్లాహ్ ధర్మం వైపు ఆహ్వానిస్తుంది. ఇరుగు పొరుగు వారి ఇండ్లను సందర్శిస్తుంది. టెలిఫోన్ ద్వారా గాని, ఇస్లామీయ సాహిత్య పుస్తకాలు, క్యాసెట్లు పంచటం ద్వారా గాని వారందరితో సాన్నిహిత్యం పెంచుకుంటుంది. ఇతరు లకు హితబోధ చేసే ముందు తానుగా ఆ విషయాలను ఆచరించి చూపుతుంది. వారందరికి ఆదర్శంగా నిలుస్తుంది. అల్లాహ్ ఆగ్రహ జ్వాలల నుండి, పరలోక శిక్షల నుండి తన్ను తాను రక్షించుకోవటమే గాకుండా, ఇతర సోదరీమణులను కూడా రక్షిస్తుంది. "అల్లాహ్ నీ ద్వారా ఏ ఒక్క వ్యక్తికైనా ఇస్లాం వైపు మార్గం చూపితే అది నీ పాలిట ఒక బిడారు మోయగలిగినంత సంపద కన్నా మేలైనది" అన్న దైవప్రవక్త (స) ప్రియ వచనాన్ని ఆమె నిత్యం గుర్తుంచుకుంటుంది.

**తొమ్మిదవది :** ముస్లిం మహిళ అనుమానాస్పద విషయాల నుంచి, అవాంఛనీయ కోరికల నుంచి తన హృదయాన్ని కాపాడుకుంటుంది. అంతేకాదు, తన కళ్లను, చెవులను సయితం అశ్లీలం నుంచి, సంగీతం నుంచి, ఇంకా శరీర అవయవాలను దుష్కర్మల నుంచి దూరంగా ఉంచుతుంది. ఇటువంటి విషయాలకు దూరంగా ఉండటమే "దైవభీతి" (తఖ్వా) అన్న సంగతి ఆమెకు బాగా తెలుసు. దైవప్రవక్త (స) తన అనుచర సమాజ మహిళలకు సలహా ఇస్తూ, "బిడియస్తులై ఉండండి. అల్లాహ్ ముందు వీలైనంత ఎక్కువగా వ్రీడా భావాన్ని కలిగి ఉండండి. అల్లాహ్ ముందు నిజమైన వ్రీడాభావం కలిగినవారు తమ తలను దానికి తెలిసిన విషయాలన్నిటితో సహా, తమ కడుపును అందులో ఉన్న విషయాలన్నిటితో సహా పరిరక్షించుకుంటారు. ప్రాపంచికమైన కష్టాలను, బాధలను గుర్తుపెట్టుకునేవారు ఐహిక సుఖసంతోషాలను త్యజిస్తారు" అని చెప్పారు.

పదవది: పగలైనా, రాత్రైనా ముస్లిం స్త్రీ తన విలువైన సమయాన్ని వృథా చేయదు. పరోక్ష నింద, పరదూషణ, చాడీలు, అశ్రద్ధ, నిర్లక్ష్యం మొదలైన గర్హనీయమైన పనులు అస్సలు చేయదు. అల్లాహ్ ఇలా ఉపదేశిస్తున్నాడు:

**"ఎవరు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసుకున్నారో, ఎవరినయితే ప్రాపంచిక జీవితం మోసపుచ్చిందో వారికి దూరంగా ఉండు. అయితే ఈ ఖుర్‌ఆను ద్వారా వారికి ఉపదేశం మాత్రం చేస్తూ ఉండు."**

**(ఖుర్‌ఆన్ 6 : 70)**

తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకున్నవారి పరిస్థితిని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా వివరించాడు:

**"అల్లాహ్‌ను కలుసుకోవలసి ఉందనే విషయాన్ని ధిక్కరించినవారు నిశ్చయంగా నష్టానికి గురయ్యారు. ఆఖరికి ఆ నిర్ధారిత సమయం అకస్మాత్తుగా వచ్చిపడినప్పుడు, "అయ్యో! ఈ విషయాన్ని మేము ఎంత నిర్లక్ష్యం చేశాం!" అని బాధపడతారు. వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందంటే, వారు తమ బరువులను తమ వీపులపై మోస్తూ ఉంటారు. తెలుసుకోండి! వారు మోసే బరువు చాలా చెడ్డది." (ఖుర్‌ఆన్ 6 : 31)**

ఓ అల్లాహ్! ముస్లిం యువతులను నీకిష్టమైన, నీవు అనుగ్రహించే మార్గంలో నడిపించు. వారి అంతరంగాలను స్వచ్ఛమైన విశ్వాసాలతో అలంకరించు.



# పాఠం 24 రమజాన్ నెలలో ముస్లిం పండితులు పాటించవలసిన కొన్ని విషయాలు

అంతిమ దైవ గ్రంథమైన దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు:

**"మీ సమాజం (లేక మతధర్మం) వాస్తవానికి ఒకే సమాజం (ఒకే మతధర్మం). నేను మీ అందరి ప్రభువును. కనుక మీరు నన్నే ఆరాధించండి.""**

**(ఖుర్‌ఆన్ 21 : 92)**

మరో చోట ఇలా అనబడింది:

**"విశ్వాసులు (ముస్లింలు) అన్నదమ్ములు (అన్న సంగతిని మరువకండి). కనుక మీ అన్నదమ్ముల మధ్య సర్దుబాటుకు ప్రయత్నించండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి – తద్వారా మీరు కరుణించబడవచ్చు."**

**(ఖుర్‌ఆన్ 49 : 10)**

ముస్లింల పరస్పర సంబంధాన్ని ఒక ప్రముఖ హదీసు ప్రకారం దైవప్రవక్త (స) ఇలా వివరిచారు: "విశ్వాసులు పరస్పరం అభిమానించుకోవటంలో, కనికరించుకోవటంలో, ప్రేమా వాత్సల్యాలతో మెలగటంలో ఒక దేహం లాంటి వారు. దేహంలో ఒక అవయవానికి బాధ కలిగినప్పుడు మొత్తం దేహం ఆ జబ్బుతో, ఆ బాధతో మూలుగుతుంది."

నేడు ముస్లింలు రమజాన్ మాసంను అవిధేయతా పూర్వకమైన పనుల్లో, తగాదాలు సంక్షోభాలలో గడిపేస్తున్నారు.

నేడు ప్రపంచంలో దురాశతో కూడిన పెట్టుబడిదారి విధానం పెచ్చరిల్లుతోంది. ఇది ఇస్లామీయ ప్రపంచంపై మేథోపరంగా దాడిచేసి విపరీతమైన తన శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోంది. ఒక పథకం ప్రకారం ముస్లిం సమాజంలో మత్తు పానీయాలను, స్త్రీలోలత్వాన్ని, అశ్లీలతను వ్యాపింపజేస్తోంది. ముస్లిం యువతను విలాసాల్లో నిద్రపుచ్చుతోంది. నిరుపమాన ఐకమత్యం పరిఢవిల్లవలసిన ముస్లిం సమాజంలోనే

మెల్లిగా కలతలను పెంచి పోషిస్తోంది. అధర్మ మనోరంజకాలను ముస్లింలపై ఆయుధాలుగా ప్రయోగిస్తోంది.

మరో వైపు సెక్యులరిజమ్ (లౌకికవాదం) ధార్మికతకు, ప్రాపంచికతకు మధ్య అసమంజసమైన అడ్డుగోడను నిలపటానికి పూర్తి శక్తియుక్తుల్ని ఒడ్డి కృషి చేస్తోంది. మతం మానవుల మధ్య విభజనకు మూలమనే దుష్ట నినాదంతో ఇస్లాం ధర్మాన్ని మనిషి జీవిత పరిధి నుంచే తొలగించాలని విఫల ప్రయత్నాలు చేస్తోంది. వాస్తవానికి సెక్యులరిజమ్ అనేది ఒక నాస్తిక భావన. మానవ జీవన సంవిధానంలో మతాల ప్రాముఖ్యతను తగ్గించేందుకు, ముఖ్యంగా ఇస్లాం ధర్మానికి మనిషి జీవితం మీద ఎలాంటి ప్రమేయం లేకుండా చేసేందుకు కంకణం కట్టుకున్న ఓ విచార ధారే సెక్యుల రిజమ్.

ఇక ఇస్లాంతో సహా అన్ని మతాలను సర్వ నాశనం చేసేందుకు యూద లాబీలో పురుడు పోసుకున్నదే "ఫ్రీమసాన్రీ" (అంతర్జాతీయ వ్యవస్థ). ఇది పైకి ప్రపంచ ప్రజలందరిని ఏకం చేసేదిలా కనిపిస్తుంది. కాని లోపాయికారిగా దానికంటూ సొంత విధానాలున్నాయి. అది ప్రపంచం మీద తనకు తోచిన విధి నిషేధాలను అమలు పరుస్తుంది. సొంత జాతీయ చిహ్నాలకు ప్రాచుర్యం కల్పించుకుంటుంది. దానికి సంబంధించిన అతి కొద్ది మంది మాత్రమే మొత్తం ప్రపంచం మీద పెత్తనం చెలాయిస్తారు. చాపక్రింద నీరులా దీని ప్రభావం మొత్తం ప్రపంచంలో వ్యాపిస్తూ పోతోంది. నిజానికిది గ్లోబు మీద యూదుల ఆధిపత్య దాహమని ఎల్లరూ గమనించాలి.

దాని మూలంగా ప్రపంచ వ్యాప్తంగా నేడు ముస్లిం సమాజం తీవ్ర కష్టాల నెదుర్కొంటోంది:

- పాలస్తీనా ప్రాంతం మన కళ్ల ముందరే అన్యాయంగా దురాక్రమణకు గురైంది. బైతుల్ ముకద్దిస్ (అల్ అఖ్సా మస్జిద్) కసాయి చేతుల్లో "బందీ"గా ఉంది. నిత్యం వృద్ధులు, స్త్రీలు, పిల్లలు, హత్యలకు, అత్యాచారాలకు గురౌతున్నారు. నిరంతరం జాతి నిర్మూలనా కార్యక్రమాలు ముస్లింలపై దాడికి తెగబడుతూనే ఉన్నాయి. పాలస్తీనా విముక్తి పొంది మళ్ళీ ముస్లింలకు దక్కాలంటే ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వంటి ఉక్కు మనిషి, సలావుద్దీన్ వంటి నిరుపమాన సాహసి, ఇబ్నె తైమియా వంటి నిష్ఠాగరిష్ఠులు ముస్లింలలో మళ్ళీ పుట్టాలి.



- ముస్లిం స్త్రీ తన బిడియం, స్వచ్ఛత, ధర్మం మొదలగు విషయాల్లో ఎన్నో సంఘర్షణలకు లోనవుతోంది. స్వచ్ఛందంగా పరదా పాటించుకునే స్వేచ్ఛ కోసం సమాజంతో పోరాడవలసి వస్తోంది.
- వినాశకర విధానాలు, షైతానీ ఆకర్షణలు, విశృంఖల లైంగిక ఆనందాలు మొదలగు భ్రష్ట కార్యాలకు బానిసగా మారి మన యువ శక్తి నిర్వీర్యమయి పోతోంది.
- నలువైపుల నుంచి మత మార్పిడులు ఇస్లాంలోకి చొచ్చుకు వస్తున్నాయి.
- అల్లాహ్ రక్షణ పొందిన వారు తప్ప మిగిలిన ముస్లింలందరూ అంతఃకలహాలతో అతలాకుతలమై విభిన్న వర్గాలుగా చీలిపోయారు.

ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నతమైన, ఉత్కృష్టమైన ఆశయ సిద్ధికై ముస్లింలు తమ భావాలను, సిద్ధాంతాలను, తమ ఆయురారోగ్యాలను, సిరిసంపదలను రుజుమార్గంలో సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి ముస్లిం తోటి ముస్లిం సోదరులకు ఇలాంటి ప్రమాదాలను గురించి అవగాహన కలిగించి వారిలో చైతన్యాన్ని రగిలించాలి. ముస్లిం సమాజంలో ఐక్యతను పెంపొందించే ప్రయత్నాలను అలుపూ సొలుపూ లేకుండా ఎల్లప్పుడూ చేస్తుండాలి. ముస్లింల పరస్పర ఘర్షణలు, అంతఃస్పర్ధలు ప్రపంచంలోని వివిధ మాధ్యమాల పతాక శీర్షికలయ్యే పరిస్థితులు ముస్లింల ఓటమికి కారణమవుతాయి. ఒకవేళ దురదృష్టవశాత్తూ అటువంటి పరిస్థితులు ఎదురైనా ముస్లింలు నిరాశ చెందరాదు. నీరు గారి పోరాదు. ఎందుకంటే ప్రతి ముస్లింలోనూ మంచి అనేది తప్పక ఉంటుంది.

నేడు ప్రపంచంలో ముస్లింల గురించి ఎన్నో వదంతులు వ్యాపింపజేయ బడుతున్నాయి. శక్తియుక్తులు గల ముస్లిం స్త్రీ పురుషులు ఇటువంటి వదంతుల్ని అడ్డుకోవాలి. అలా చేయలేకపోతే కనీసం ఇస్లాం ధర్మం కోసం పాటుపడుతున్న వారికి తమ వంతు పూర్తి సహకారం అందించాలి. ప్రతి నమాజు తర్వాత, ముఖ్యంగా ఉషోదయ ఘడియల్లో, ప్రార్థనలు స్వీకృతిని పొందే ఇతర సమయాల్లో ముస్లింల విజయం కోసం అల్లాహ్‌ను వేడుకోవాలి. మన వల్ల జరిగిన పొరబాట్లు, తప్పులు, పాపాల వలనే మనకు ఆపదలు, ఉపద్రవాలు కలుగుతున్నాయని గ్రహించాలి. మనలో దైవభీతిని, వినయ విధేయతలను పెంపొందించమని సర్వ శక్తిమంతుడైన అల్లాహ్‌ను అనునిత్యం వేడుకుంటూ ఉండాలి.

**"(ఏమిటీ?) మీపై ఆపదరాగానే - దీనికన్నా రెండింతలుగా మీరు వారిపై విరుచుకుపడి ఉండి కూడా - ఇదెక్కడి నుంచి వచ్చిపడిందని అంటారా? "ఇది చేజేతులా మీరు కొనితెచ్చుకున్నదే" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. నిశ్చయంగా అల్లాహ్ ప్రతి దానినీ చేయగల సమర్థుడు."**

**(ఖుర్ఆన్ 3 : 165)**

పూర్వకాలంలో ఇస్లామీయ సామ్రాజ్యం ఈ రమజాన్ మాసంలోనే ఎన్నో విజయాలను తన సొంతం చేసుకుంది. కాని ఆ తర్వాత ముస్లింలు తమ అసలు పనిని విస్మరించి ప్రాపంచిక భోగభాగ్యాలలో మునిగిపోవటం వల్ల ఆ శుభ మాసంలోనే దుఃఖాలు, యుద్ధాలు, హత్యలు, అనైక్యత, జాతి వినాశనం వంటి చేదు అనుభవాలు వారికి ఎదురవుతున్నాయి. అయితే నిరుత్సాహ పడవలసిన విషయం ఏమీ లేదు. ముస్లింలు తమ భవిష్యత్తు గురించి ఎన్నటికీ నిరాశకు లోనుకారు. అల్లాహ్ వైపుకు మరలితే మళ్ళీ వారు తప్పక విజయం సాధిస్తారు.

**"విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు గనక అల్లాహ్‌కు సాయం చేస్తే ఆయన మీకు సాయం చేస్తాడు. మీ పాదాలకు నిలకడను ఇస్తాడు."**

**(ఖుర్ఆన్ 47 : 7)**

**"అల్లాహ్ మీ కొరకు దీనిని శుభవార్తగానూ, ఇంకా మీ మనోనిబ్బరం కోసం జరిగే ఏర్పాటుగానూ చేశాడు. యదార్థానికి అసలు సహాయం మాత్రం అల్లాహ్ తరఫు నుంచి లభించేదే. ఆయన సర్వాధిక్యుడు, వివేచనాపరుడు."**

**(ఖుర్ఆన్ 3 : 126)**

**"అల్లాహ్‌యే గనక మీకు తోడ్పాటు నందిస్తే ఇక మిమ్మల్ని ఎవరూ జయించ లేరు. ఒకవేళ ఆయనే గనక మిమ్మల్ని విడిచిపెట్టేస్తే, తరువాత మీకు సహాయపడ గలవాడెవడు? కాబట్టి విశ్వసించిన వారు సదా అల్లాహ్‌నే నమ్ముకోవాలి."**

**(ఖుర్ఆన్ 3 : 160)**

ఓ అల్లాహ్! నువ్వు మాకు చేసిన వాగ్దానం ప్రకారం మాకు సహాయం అందించు. మా ప్రభూ! మా పాదాలను స్థిరపరచు. అవిశ్వాసులకు ప్రతికూలంగా మాకు గొప్ప గెలుపును ప్రసాదించు.



# పాఠం 25
# రమజాన్ ఘోషణ - ముస్లిం సమయ పాలన

తీర్పు దినాన అల్లాహ్‌కూ - ప్రపంచంలో నిర్లక్ష్య ధోరణిని అవలంబించిన సత్య తిరస్కారులకు మధ్య జరిగే సంభాషణను, సంవాదాన్ని దివ్య ఖుర్ఆన్ ఆసక్తికర మైన రీతిలో ఇలా ప్రస్తావించింది:

**"మీరు ఎన్ని సంవత్సరాల పాటు భూలోకంలో ఉండి ఉంటారు?" అని (అల్లాహ్) వారిని అడుగుతాడు. "ఒక రోజో లేక ఒక రోజుకన్నా తక్కువ సమయమో ఉండి ఉంటాము. కావాలంటే లెక్కించేవారిని అడగండి" అని వారంటారు. అల్లాహ్ అంటాడు : "నిజంగానే మీరు చాలా కొద్ది సమయమే అక్కడ ఉన్నారు. ఈ సంగతిని మీరు ముందే గ్రహిస్తే ఎంత బావుండేది! "మేము మిమ్మల్ని ఏదో ఆషామాషీగా (అర్థరహితంగా) పుట్టించామనీ, మీరు మా దగ్గరకు మరలిరావటం అనేది జరగని పని అని అనుకున్నారా?" అల్లాహ్‌యే నిజమైన సార్వభౌముడు. ఆయన మహోన్నతుడు. ఆయన తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడు. మహోన్నత పీఠానికి ఆయనే అధిపతి. (ఖుర్ఆన్ 23 : 112 - 116)**

"జీవితం క్షణభంగురం. నిర్లక్ష్యంతో దాన్ని మరింత చిన్నదిగా చేసుకోవద్దు" అని చమత్కరించారు మన పూర్వీకుల్లోని ఓ సదాచార సంపన్నులు. ఇది పరమ సత్యం. నిర్లక్ష్యం కాలాన్ని క్షీణింపజేస్తుంది. రాత్రులను తినేస్తుంది. "రెండు వరాలు న్నాయి. చాలామంది వాటి విషయంలో మోసపోతుంటారు. అవి ఒకటి, ఆరోగ్యం. రెండు ఖాళీ సమయం" అని దైవప్రవక్త (స) ప్రబోధించి ఉన్నారు. చాలామంది ఆరోగ్యవంతులై ఉండి కూడా తమ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోలేక పోతుంటారు. ఎంతో విలువైన సమయాన్ని వృథా కార్యకలాపాల్లో గడిపేస్తుంటారు. ఆ విధంగా వారి జీవితాలు తమకూ పనికి రావు. వేరెవరికీ ప్రయోజనం చేకూర్చవు. "ప్రతి ఫల దినాన మనిషి నాలుగు ప్రశ్నలకు సమాధానం చెప్పేంత వరకూ అతని పాదాలు కదలటానికి కూడా వీలుండద"ని దైవప్రవక్త (స) హెచ్చరించి ఉన్నారు. ఆ

నాలుగు ప్రశ్నల్లో, "నీవు నీ జీవిత కాలాన్ని ఏయే పనుల్లో గడిపావు?" అన్న ప్రశ్న కూడా ఉంది.

నిజానికి జీవితం ఒక నిధి లాంటిది. మరి ఈ నిధిని అల్లాహ్ విధేయతలో ఖర్చుచేసి, పరిశుద్ధ హృదయంతో అల్లాహ్ వద్దకు తిరిగి వెళ్ళిన వారికి మాత్రమే పరలోకపు నిధులు ప్రాప్తమవుతాయి. ఆ రోజు ప్రాపంచిక సిరిసంపదలేవీ మనిషికి పనికిరావు. అతని సంతానం అతన్ని దైవశిక్షల నుంచి కాపాడటానికి అడ్డు రాదు. కనుక ఇహలోకంలో జీవితకాల నిధిని నిర్లక్ష్యంగా ఖర్చు చేసి దైవధిక్కారానికి పాల్పడిన వారిని ఆ రోజున నిరాశా నిస్పృహలు కమ్ముకుంటాయి. అక్కడ వారు ఎంత పశ్చాత్తాపపడినా ప్రయోజనం ఉండదు. అప్పుడు వారు, "అయ్యో, మా పాడుగాను! మేము మా జీవితాలను ఎంత నిర్లక్ష్యం చేశాము?!" అని వాపోతారు.

మనిషి పాలిట రేయింబవళ్లు ఒక విధంగా వాహనాల్లాంటివి. అవి మనిషిని అంతులేని సంతోషాల వైపుకు గాని, నష్టాల వైపుకు గాని మోసుకొని వెళ్తుంటాయి. సదాచార సంపన్నులైన మన పూర్వీకులు తమ సమయం వృధా పనుల్లో ఖర్చు కాకుండా ఎంతో జాగ్రత్తపడేవారు. దీనికి సంబంధించి చరిత్రలో కొన్ని అపూర్వమైన కథనాలున్నాయి. ఉదాహరణకు జునైద్ బిన్ ముహమ్మద్ మరణశయ్యపై ఉండి కూడా ఖుర్ఆన్ పఠనాన్ని కొనసాగించేవారు. అది చూసి ఆయన కుమారులు, "నాన్నగారూ! మీరు అంత శ్రమ తీసుకోవద్దు" అని కోరారు. అందుకాయన, "(దైవమార్గంలో) నా కంటే ఎక్కువ శ్రమించే వ్యక్తి మరొకరు ఉండాలా?" అంటూ తన కుమారుల కోరికను సున్నితంగా తిరస్కరించేవారు.

అల్ అస్వద్ బిన్ యజీద్ రాత్రిలో చాలా భాగం నమాజ్ చేస్తూనే ఉండే వారు. ఆయన శ్రేయోభిలాషులు కొందరు ఆయనకు, "రాత్రివేళ కాసేపయినా విశ్రాంతి తీసుకోండి" అని సలహా ఇచ్చారు. అందుకాయన, " నేను అలాంటి విశ్రాంతి కోసమే వెతుకున్నానండీ! (పరలోకంలో)!" అని సమాధానమిచ్చారు.

సుఫ్యాన్ సౌరీ (రహ్మలై) ఒకసారి పవిత్ర మస్జిద్‌లో కూర్చొని ప్రజలతో మాట్లాతున్నారు. ఉన్నట్టుండి ఆయన ఒక్కసారిగా లేచి నించున్నారు. ఏదో విలువైన సంపద పోగొట్టుకున్నట్టు ఆందోళన చెందుతూ, "మనం ఇక్కడ కూర్చొని మాట్లాడు కుంటున్నాం. అటు 'రోజు' తన పని తాను చేసుకుంటూ వెళ్ళిపోతోంది" అన్నారు.

సదాచార సంపన్నులైన మన పూర్వీకులు తమ రేయింబవళ్ళ సమయాన్ని



ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకునేవారు. నమాజులకు, ఖుర్ఆన్ పారాయణానికి, దైవధ్యానానికి, దైవనామ స్మరణకు, జ్ఞాన సముపార్జనకు, దైనందిన కార్యక్రమాలకు, నిద్రకు మొదలగు వాటికి వేర్వేరు సమయాలను కేటాయించుకునేవారు. అయితే వారి కార్యక్రమ పట్టికలో మనో ఉల్లాసానికి ఎలాంటి కాల కేటాయింపూ ఉండేది కాదు.

తర్వాతి తరాల వారు మాత్రం వృధా కాలక్షేప ఆపదలో సులువుగా చిక్కు కున్నారు. అల్లాహ్ అనుగ్రహం పొందిన అతి కొద్ది మాత్రమే ఈ ఉపద్రవానికి దూరంగా ఉన్నారు. మిగతా వారందరూ అతి నిద్ర, సోమరితనం, నిర్లక్ష్యం, భోగ లాలస, పనికిమాలిన సభలు, వ్యర్ధ సమావేశాలు, సంగీత కచేరీలు మొదలగు దైవ అవిధేయతా పనుల్లో మునిగిపోయారు.

సమయ పాలనను అలవర్చుకోవటానికి దోహదపడే విషయాల్లో అయిదు పూటల నమాజులు అతి ముఖ్యమైనవి. మహోన్నతుడైన అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఈ విషయాన్ని ఇలా ధృవీకరిస్తున్నాడు:

**"నిస్సందేహంగా నమాజును నిర్ధారిత వేళల్లో చేయటం విశ్వాసులకు విధిగా చేయబడింది."** **(ఖుర్ఆన్ 4 : 103)**

ముస్లింలు తమ విలువైన సమయాన్ని నిర్ణీత పద్ధతిలో పెట్టుబడిగా పెట్టి అల్లాహ్‌కు చేరువ అవుతారు. అందుకు శిక్షణా కాలమే రమజాన్ మాసం. విచారకర మైన విషయం ఏమిటంటే కొంతమందికి అసలు ఉపవాసం అంటే ఏమిటో కూడా తెలియదు. వారు బంగారం లాంటి తమ జీవితాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. పగటి పూట గాఢనిద్రలో గడిపేస్తున్నారు. రాత్రి వేళల్లో పనికిరాని జాగారం చేస్తున్నారు.

ఓ అల్లాహ్! ఓ సకల లోక ప్రభువా! మా జీవితాలను పరిరక్షించు. నీ మార్గంలో మా పాదాలను స్థిరపరచు. ఎల్లప్పుడూ నీకు విధేయులై జీవించే సద్బుద్ధిని ప్రసాదించు.

పాఠం 26

# ప్రేమ, సోదరభావాలు వెల్లివిరిసే శుభమాసం రమజాన్

ప్రవక్త (స) ప్రవచించినట్టు ముస్లింలందరూ ఒకే శరీరం, ఒకే అంశం. అవయవాలు వేరైనా వారందరి హృదయం మాత్రం ఒక్కటే. ఇస్లాం ధర్మం ముస్లిం లందరిని సమైక్యపరుస్తుంది. వారందరి మధ్య సోదర భావాన్ని పెంపొందిస్తుంది. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> **"వారి హృదయాలలో పరస్పరం ప్రేమానురాగాలను పొందుపరచినది కూడా ఆయనే. భూమిలో వున్న సమస్తాన్నీ ఖర్చుపెట్టినా నువ్వు పరస్పరం వారి హృదయాలను కలపలేకపోయేవాడవు. అల్లాహ్‌యే వారి మనసులను కలిపాడు. నిశ్చయంగా ఆయన సర్వాధిక్యుడు, వివేచనాశీలి."**
>
> **(ఖుర్ఆన్ 8 : 63)**

ముస్లింలను కలిపినది భాష, రంగు, రక్తం, జాతి లేదా దేశం ఎంతమాత్రం కాదు. **"లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదు ర్రసూలుల్లాహ్"** (అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త)" అనే ఒక చిన్న మాట మాత్రమే ప్రపంచంలోని ముస్లింలందరినీ ఒకే గొడుగు క్రిందికి చేర్చింది. ముస్లింల మధ్య భేదానికి, హెచ్చు తగ్గులకు రెండే రెండు ప్రాతిపదికలు. ఒకటి, దైవభీతి (తఖ్వా). రెండవది, జ్ఞానం.

> **"ఓ మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ద్వారా సృష్టించాము. మరి మీ (పరస్పర) పరిచయం కోసం మిమ్మల్ని వివిధ వర్గాలుగా, తెగలుగా చేశాము. యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువగా భయభక్తులు గలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువగా ఆదరణీయుడు. నిశ్చ యంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అప్రమత్తుడు." (ఖుర్ఆన్ 49 : 13)**

దైవప్రవక్త (స) ప్రజలను ఇస్లాం ధర్మం వైపుకు పిలిచారు. నిజానికి అది విశ్వ ప్రభువైన అల్లాహ్ తన ప్రవక్త చేత మానవాళికి ఇచ్చిన పిలుపు. అప్పుడు ఒక నీగ్రో బానిస అల్లాహ్ పిలుపుకు బదులు పలికారు. "ఓ ప్రభూ! నేను నీ సన్నిధిలో హాజ



రయ్యాను" అంటూ వచ్చి ఇస్లాం స్వీకరించారు. ఆయన మరెవరో కాదు, ఎంతో శుభప్రదమైన ప్రవక్త హయాంలో ప్రజలను నమాజుకై పిలిచే అధికారిక స్థానం చేజిక్కించుకున్న బిలాల్ (రజి). సత్యాన్వేషణలో దేశాటనం చేస్తూ చివరికి ఇస్లాం చెంత చేరిన సల్మాన్ (రజి) ఓ పారశీక దేశస్థులు. దైవప్రవక్త (స) ఆయన్ని తన కుటుంబ సభ్యునిగా పేర్కొన్నారు. అలాగే రోము దేశస్థులైన సుహైబ్ (రజి), "అల్లాహ్ అందరికంటే గొప్పవాడు, అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు" అంటూ నినదిస్తూ వచ్చి ఇస్లాంలో చేరారు. భాష, రంగు, రక్తం, జాతి, దేశం ఏదీ ఆయన్ని ఇస్లాంలో చేరకుండా అడ్డుకోలేదు. మరి దీనికి భిన్నంగా దైవప్రవక్త (స)కు భౌగోళికంగా ఎంతో సన్నిహితులైన మక్కా నగర వాసులను చూడండి. ఖురైషు తెగవారైన అబూ జహల్, వలీద్ బిన్ ముగీరా వంటి నాయకమన్యులు ఇస్లాం సౌభాగ్యానికి నోచుకోక అధ్వాన్న స్థితికి గురయ్యారు. జాత్యహంకారం, వేర్పాటువాదం సత్యం ముందు వారి మెడల్ని వంచకుండా చేశాయి.

దైవప్రవక్త (స) తన వంశం వారిని ఉద్దేశించి, "ఓ హాషిమ్ వంశస్థులారా! ప్రళయ దినాన ప్రజలు తాము చేసుకున్న కర్మలను వెంటబెట్టుకొని వస్తారు. మరి మీరు వంశానుక్రమాన్ని వెంటబెట్టుకొని వస్తారా?" అని తరచూ మందలిస్తుండేవారు. మరో హదీసు ప్రకారం ఆయన, "ఆచరణ రీత్యా వెనుకబడిన వ్యక్తి తన వంశం పేరు మీద ముందుకెళ్ళలేడు" అని హెచ్చరించారు.

వాస్తవానికి సత్య సంధత, సత్ప్రవర్తన, మంచి నడవడిక మొదలగు సద్గుణాలు కలిగిన వ్యక్తులు సభ్యులుగా గల సౌభ్రాతృత్వ సమాజమే ముస్లిం సమాజం. ఇస్లాం అనేది ఒక ప్రత్యేక జాతికో లేక ప్రజలకో చెందిన పేరు కారు. అరబ్బులు, భారతీ యులు, టర్కీవారు, పాకిస్తానీయులు, ఆఫ్రికన్‌లు ఒక్కరేమిటి సమస్త మానవులకు చెందినది ఇస్లాం ధర్మం. ఇస్లాం ధర్మ మొదటి ఖలీఫా అబూ బక్ర్ (రజి) అరబ్ దేశంలోని ఖురైషు తెగవారు. బిలాల్ (రజి) ఇథియోపియాకు చెందిన నీగ్రో జాతి వారు. సుహైబ్ (రజి) రోమన్ దేశస్థులు. సల్మాన్ (రజి) పర్షియా ప్రాంతవాసి. ముహమ్మద్ బిన్ తుగ్లక్ టర్కీ దేశీయుడు. విశ్వకవి ఇక్బాల్ భారతీయుడు. సలావుద్దీన్ అయ్యూబీ ఇరాక్ దేశంలోని కుర్ద్ ప్రాంతానికి చెందినవారు. మరి వీరందరిని ఏకం చేసిన సిద్ధాంతం ఒక్కటే. అదే "అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు, ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త" అన్న సిద్ధాంతం.

మహోన్నతమైన ఈ ఐకమత్య భావన రమజాన్ మాసంలో ముస్లిం

సమాజంలో అతి స్పష్టంగా గోచరిస్తుంది. ముస్లింలందరికి రమజాన్ మాసం ఒక్కటే. అందులో ఉపవాసాల విధింపు అందరికీ సమానమే. నమాజు కోసం ముస్లింలందరూ తిరిగే దిక్కు కూడా ఒక్కటే. నమాజ్ చేసే విధానమూ ఒక్కటే. ముస్లింలంతా ప్రతి నమాజు సమయంలో ఒకని సారథ్యంలో సామూహికంగా నమాజు చేస్తారు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"మీరు నమాజులను నెలకొల్పండి, జకాతును ఇవ్వండి, (నా సన్నిధిలో) రుకూ చేసే వారితో పాటు మీరూ రుకూ చేయండి." (ఖుర్ఆన్ 2 : 43)**

**"అల్లాహ్ సమక్షంలో వినమ్రులై నిలబడండి." (ఖుర్ఆన్ 2 : 238)**

ఉపవాసాల గురించి ఇలా ఆదేశిస్తున్నాడు:

**"ఓ విశ్వసించిన వారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించ బడింది – మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది."**

**(ఖుర్ఆన్ 2 : 183)**

అలాగే ముస్లింలందరికీ హజ్ యాత్ర ఒక్కటే. దాని సమయం ఒక్కటే, స్థలమూ ఒక్కటే. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవీయబడింది:

**"(హజ్ యాత్ర సందర్భంగా) మీరు గనక మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషిస్తే అందులో తప్పేమీ లేదు. మీరు అరఫాత్ నుండి తిరిగి వస్తున్నప్పుడు 'మష్అరె హరామ్' వద్ద దైవనామాన్ని స్మరించండి – ఆయన సూచించిన విధంగానే ఆయన నామస్మరణ చేయండి. ఇంతకు మునుపైతే మీరు దారి తప్పి ఉండేవారు." (ఖుర్ఆన్ 2 : 198)**

ముస్లిం సమాజం విభిన్న మత వర్గాలుగా విడిపోకుండా ఉండేందుకు అల్లాహ్ ఇలా ఉపదేశిస్తున్నాడు:

**"అల్లాహ్ త్రాడును అందరూ కలసి గట్టిగా పట్టుకోండి. చీలిపోకండి. అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి-అప్పుడు మీరు ఒండొకరికి శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలలో పరస్పరం ప్రేమానురాగాలను సృజించాడు. దాంతో ఆయన అనుగ్రహం వల్ల మీరు ఒకరి కొకరు అన్నదమ్ములుగా మారారు." (ఖుర్ఆన్ 3 : 103)**

మరో చోట ఇలా అంటున్నాడు:

**"తమ వద్దకు స్పష్టమయిన నిదర్శనాలు వచ్చేసిన తరువాత కూడా వర్గాలుగా**



**విడిపోయి, విభేదించుకున్న వారి మాదిరిగా మీరు తయారవకండి. మహాశిక్ష ఉన్నది ఇటువంటివారి కోసమే." (ఖుర్ఆన్ 3 : 105)**

ముస్లిం సమాజం వర్గాలుగా విడిపోకుండా, ముఠాలుగా చీలిపోకుండా సంఘటితంగా ఉండేందుకు ఓ మంచి కార్యాచరణ సూత్రం, దైవప్రవక్త (స) వారి ఒకానొక ప్రవచనంలో పొందుపరచబడింది. "పరస్పరం అణకువతో వ్యవహరిం చాలనీ, ఎవరూ ఎవరి మీదా గొప్పలు చెప్పుకోరాదనీ, ఎవరూ ఎవరి మీదా అత్యాచారానికి దిగరాదనీ అల్లాహ్ నన్ను వహీ ద్వారా ఆదేశించాడు" అని ఆయన ప్రవచించారు. మరొక సందర్భంగా ఆయన, "విశ్వాసులంతా ఒకే గోడలోని ఇటుక ల్లాంటి వారు. ఒకరికి మరొకరి ద్వారా బలం చేకూరుతూ ఉంటుంది" అని కూడా అన్నారు. ఆయన ఇంకా ఇలా ప్రబోధించారు: "ఒక ముస్లిం తోటి ముస్లింకు సోదరుడు. అతను తన సోదరునిపై దౌర్జన్యం చేయడు. అతన్ని నిస్సహాయుడిగా చేసి శత్రువుకి) అప్పగించడు. అతనితో అబద్ధం చెప్పడు. అతన్ని అల్పుడిగా భావించడు. ఒకడు తన తోటి ముస్లిం సోదరుణ్ణి అల్పుడిగా భావిస్తున్నాడంటే, అతని ఆ ఒక్క భావన చాలు, అతడు చెడ్డవాడని చెప్పటానికి! ఒక ముస్లిం ధన, మాన ప్రాణాలు తోటి ముస్లిం కొరకు నిషిద్ధం (గౌరవప్రదం) గా చేయబడ్డాయి."

అల్లాహ్ ప్రసన్నత కోరి తన తోటి ముస్లిం సోదరుని బాగోగులు పట్టించు కోవటం, తరచూ అతన్ని సందర్శిస్తూ ఉండటం కనీస సోదర బాధ్యత. వ్యాధిగ్రస్తుడైన ముస్లింను పరామర్శించటం, తోటి ముస్లింను కలసినప్పుడల్లా నవ్వుతూ పలకరిం చటం, ఒకరినొకరు సలాం చేసుకోవటం, తుమ్మిన ముస్లిం వ్యక్తి కోసం ప్రార్థించటం, ఇతరుల ఆహ్వానాన్ని అంగీకరించటం, కష్టాలలో ఉన్న వ్యక్తికి సహాయపడటం, మంచి సలహాలు ఇచ్చి సరైన మార్గంలో నడిపించటం – ఇవన్నీ ఒక ముస్లింకు మరో ముస్లిం మీద ఉండే హక్కులు, బాధ్యతలు. ఇలాంటి హక్కులు, బాధ్యతలు ఇంకా చాలా ఉన్నాయి. ఈ భూమ్మీద ఉన్న ప్రతి ముస్లిం విశ్వాసపరంగా, ఖుర్ఆన్ చట్ట ప్రకారంగా నీ సోదరుడే. పరమ ప్రభువైన అల్లాహ్ తన అంతిమ ప్రవక్త (స) ద్వారా మనకు అందించిన ధర్మం, జీవన సంవిధానం ఇదే సుమా!

ఓ అల్లాహ్! కరుణ చూపే వారందరిలో కెల్లా మహా కరుణా ప్రదాతా! మా హృదయాలను సంఘటిత పరచు. మమ్మల్ని ఏకం చెయి.

# పాఠం 27 ప్రజలను ఇస్లాం వైపుకు ఆహ్వానించేందుకు అనువైన వసంతం రమజాన్

ప్రవక్తలందరి జీవిత లక్ష్యం, అల్లాహ్ సందేశహరులందరి జీవన ధ్యేయం ఒక్కటే, ఇస్లాంను వ్యాపింపజేయటం. బోధకుడు, ప్రబోధకుడు కాని ప్రవక్త, వారిలో ఒక్కరు కూడా లేరు. ప్రతీ ప్రవక్త తన కాలపు ప్రజలకు, "అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు" అనే బోధించారు. "మా ప్రబోధనలకు ప్రతిఫలంగా మీ నుంచి మేము ఏమీ ఆశించటం లేదు" అనేవారు. వారందరూ ప్రజలను రుజుమార్గం వైపు ఆహ్వానించినవారే.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**" నీ ప్రభువు మార్గం వైపు జనులను వివేకంతోనూ, చక్కని ఉపదేశంతోనూ పిలువు. అత్యుత్తమ రీతిలో వారితో సంభాషణ జరుపు. నిశ్చయంగా తన మార్గం నుంచి తప్పిన వారెవరో నీ ప్రభువుకు బాగా తెలుసు. సన్మార్గాన ఉన్న వారెవరో కూడా ఆయనకు బాగా తెలుసు."**

**(ఖుర్ఆన్ 16 : 125)**

ప్రవక్త (స)ను అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు:

**"(ఓ ప్రవక్తా!) నువ్వు వాళ్ళకు చెప్పేయి : 'నా మార్గమైతే ఇదే. నేనూ, నా అనుయాయులూ పూర్తి అవగాహనతో, దృఢ నమ్మకంతో అల్లాహ్ వైపుకు పిలుస్తున్నాము. అల్లాహ్ పరమ పవిత్రుడు. నేను, అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించే (షిర్క్ చేసే) వారిలోని వాణ్ణి కాను."** **(ఖుర్ఆన్ 12 : 108)**

జ్ఞానంతో సత్కార్యాలు చేస్తూ ఉండాలని అల్లాహ్ తన దాసులను ఆజ్ఞాపిస్తున్నాడు:

**"అల్లాహ్ వైపు (జనులను) పిలుస్తూ, సత్కార్యాలు చేస్తూ 'నేను విధేయుల (ముస్లింల)లో ఒకడను' అని పలికేవాని మాటకంటే మంచిమాట మరెవరిది కాగలదు?"** **(ఖుర్ఆన్ 41 : 33)**



ప్రజలను ఇస్లాం వైపుకు ఆహ్వానించటానికి ఐదు విషయాలు కావాలి. మరి ఆ ఆహ్వానానికీ ఐదు-పద్ధతులున్నాయి. ఇంకా వాటి ద్వారా కలిగే ఫలితాలు కూడా ఐదు రకాలు.

ముందుగా ఇస్లాం వైపు ఆహ్వానించటానికి అవసరమైన ఐదు విషయాలేమిటో తెలుసుకుందాం.

**మొదటిది:** అల్లాహ్ ఎడల సత్యసంధత, నిష్కపటం. ఆయన అనుగ్రహాన్ని కోరుకోవటం. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా చెప్పబడింది:

**"వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలనీ, ఏకాగ్రచిత్తులై – నమాజును నెలకొల్పాలనీ, జకాత్‌ను ఇస్తూ ఉండాలని మాత్రమే వారికి ఆదేశించబడింది."** **(ఖుర్ఆన్ 98 : 5)**

అదీగాక, "ముగ్గురితో నరకాగ్ని రాజేయబడుతుంది. వారిలో ఒకడు, ప్రజల చేత గొప్ప విద్యావంతుడు అని అనిపించుకోవటం కోసం విద్యను అభ్యసించినవాడు" అని దైవప్రవక్త (స) భవిష్యద్వాణి పలికి ఉన్నారు.

రెండవది: చెప్పింది చేయటం. ఒక వ్యక్తి మాటలకు, చేతలకు మధ్య పొంతన లేకపోవటం ఎంతో చింతించవలసిన విషయం. అలాంటి వారిని గర్హిస్తూ అల్లాహ్ తన గ్రంథంలో ఇలా అంటున్నాడు:

**"ప్రజలకైతే మీరు మంచిని గురించి ఆదేశిస్తారు, కాని మీ స్వయాన్ని మరచిపోతారే?! చూడబోతే మీరు గ్రంథ పారాయణం చేస్తారాయె. మరి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా మీకు లేదా?"** **(ఖుర్ఆన్ 2 : 44)**

**మూడవది :** విజ్ఞతతో, వివేచనంతో ప్రజలకు అల్లాహ్ సందేశం అందజేయటం. అత్యంత క్రూరుడు, నిరంకుశ మహారాజు అయిన ఫిరౌన్‌కు సత్య సందేశం చేరవేసినప్పుడు కూడా ఈ పద్ధతినే పాటించమని మూసా, హారూన్ ప్రవక్త ద్వయానికి అల్లాహ్ సూచించాడు:

**"వాడితో కాస్త మృదువుగా మాట్లాడండి – బహుశా వాడు అర్థం చేసుకోవచ్చు లేదా భయపడవచ్చు."** **(ఖుర్ఆన్ 20 : 44)**

ముహమ్మద్ ప్రవక్త (స)ను సైతం అల్లాహ్ ఇలా హెచ్చరించాడు:

**" (ఓ ప్రవక్తా!) అల్లాహ్ దయవల్లనే నీవు వారి యెడల మృదు మనస్కుడవయ్యావు. ఒకవేళ నువ్వే గనక కర్కశుడవు, కఠిన మనస్కుడవు అయివుంటే**

**వారంతా నీ దగ్గరి నుంచి వెళ్ళిపోయేవారు. కనుక నువ్వు వారిపట్ల మన్నింపుల వైఖరిని అవలంబించు, వారి క్షమాపణ కోసం (దైవాన్ని) వేడుకో. కార్యనిర్వహణలో వారిని సంప్రదిస్తూ ఉండు."**

**(ఖుర్ఆన్ 3 : 159)**

ఈ దృక్పథంతోనే దైవప్రవక్త (స) తన అనుచరులకు, "విషయాలను సులభ తరం చేయండి. వాటిని కష్టతరం చేయకండి. ప్రజలకు సంతోషవార్తలు ఇవ్వండి. వారిని పారిపోయేట్టు చేయకండి" అని సూచించారు.

**నాల్గవది :** ప్రజలకు ఇస్లాం సందేశం అందించటానికి అంచెలంచెలుగా ఓ క్రమబద్ధమైన విధానాన్ని అనుసరించాలి. ప్రవక్త (స) పాటించినట్టు, ముఖ్యమైన విషయాలను అవసర ప్రాతిపదికన మొదట ప్రారంభించి, అవసరానికి అనుగుణంగా ఒక దాని తర్వాత మరొకదాన్ని పద్ధతి ప్రకారం చేయాలి. తన సహచరులైన ముఆజ్‌ను ఎమన్ దేశానికి పంపుతున్నప్పుడు ప్రవక్త (స) ఈ విషయాన్ని చాలా స్పష్టంగా వివరించారు: "యమన్‌లో నీకు గ్రంథప్రజలు (యూదులు, క్రైస్తవులు) తారసపడతారు. మొదట నువ్వు వారిని 'అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడనీ, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అనే విషయం వైపు ఆహ్వానించు. వారు గనక దానికి అనుకూలంగా స్పందిస్తే, అల్లాహ్ వారిని ప్రతిరోజూ 5 పర్యాయాలు ప్రార్థనలు చేయమని ఆదేశించాడని ఉపదేశించు."

**అయిదవది :** ప్రతి ఒక్కరినీ (ప్రతి వర్గాన్నీ) వారి మనసులను ఆకట్టుకునే రీతిలో సంబోధించాలి. పట్టణ ప్రజలకు ఓ పద్ధతిలోనూ, పల్లె ప్రజలకు మరో పద్ధతిలోనూ ఉపదేశించాలి. సంచార జాతులకు మరో ప్రత్యేక రీతిలో ఉద్బోధించాలి. వివేకవంతులకు, తక్కువ చదువుకున్నవారికి వారి వారి స్థాయిలకనుగుణంగా ప్రబోధించాలి. విషయాన్ని బాగా కూలంకషంగా చర్చిస్తేగాని కొందరి బుర్రకెక్కదు. కొందరికి కాస్త వినమ్రంగా చెబితే చాలు, వారు ధర్మానికి దాసోహమంటారు.

**"ఆయన తాను కోరిన వారికి విజ్ఞతా వివేచనలను ప్రసాదిస్తాడు. ఎవరికి విజ్ఞతా వివేచనలు వొసగబడ్డాయో అతనికి ఎన్నో మేళ్లు వొసగబడినట్లే. హితబోధను బుద్ధిమంతులు తప్ప మరొకరు గ్రహించరు."**

**(ఖుర్ఆన్ 2 : 269)**



## ఇస్లాం సందేశ ప్రచారంలో ఐదు విధానాలు

మొదటిది : ప్రతి వ్యక్తీ తన పరిధిలో వ్యక్తిగతంగా ఎంతమేరకు ఇస్లాం సందేశ ప్రచారం చేయగలడో అంత చేయటం.

రెండవది : బహిరంగ సభలు, సమావేశాల్లో జనం ముందు ప్రసంగించటం

మూడవది : విద్యార్థులకు వివిధ అంశాలపై పండితుల చేత పాఠాలు చెప్పించటం. వివిధ శాస్త్రాల్లో నిపుణులు మాత్రమే ఈ పని చేయగలరు.

నాల్గవది : రచనల ద్వారా, ఉత్తరాల ద్వారా, వివిధ ప్రచురణల ద్వారా ప్రజలకు మార్గదర్శనం చేయటం.

అయిదవది : సత్య ధర్మ వ్యాప్తి కోసం ఆధునిక సమాచార సాధనాలను ఉపయోగించటం.

## ఐదు ఫలితాలు

మొదటిది : ధర్మ ప్రచార రంగానికి మూల పురుషులు ప్రవక్తలు. ప్రజలకు మొదటిసారి సత్యవెలుగును ప్రసాదించిన కాంతివనరులు. దైవ సందేశహరులు. మానవులను తొలిసారి అల్లాహ్ ఆరాధన కోసం పిలిచిన ఆద్యులు వారు. కనుక సందేశ ప్రదాత (దాయీ)లు వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుంటారు.

రెండవది : ప్రజలకు మంచిని ప్రబోధించేవారు సృష్టిలోని జీవరాసుల ఆశీస్సులు పొందుతారు. రుజుమార్గం వైపు పిలిచేవారి శ్రేయస్సు కోసం సముద్రంలోని తిమింగలాలు కూడా ప్రార్థిస్తాయి.

మూడవది : రుజుమార్గ ఆహ్వానితు (మద్‌వూ)లకు సమానంగా ఆహ్వానకులు (దాయీలు) కూడా అల్లాహ్ తరఫున పుణ్యం పొందుతారు. "మంచి వైపుకు దారి చూపించిన వ్యక్తికి, దానిని అనుసరించిన వానికి సమానంగా పుణ్యం లభిస్తుంది" అని దైవప్రవక్త (స) ప్రవచించారు.

నాల్గవది : ఒకప్పుడు మంచి వైపుకు పిలువబడినవాడు ఇస్లాంలోకి వచ్చిన తర్వాత క్రమంగా తాను కూడా ఇతరుల్ని మంచివైపుకు పిలిచే

ప్రబోధకునిగా ఎదగుతాడు. ఇతరులు తనను చెడు వైపుకు ఆహ్వానిస్తున్నప్పటికీ ఏమాత్రం ప్రభావితం కాడు. పైగా అతనే తన మంచితనంతో ఇతరులను ప్రభావితం చేయగలుగుతాడు.

అయిదవది : మంచివైపుకు పిలిచే ప్రబోధకుడు ప్రజల అభిమానానికి పాత్రుడై క్రమంగా నాయక శిఖామణిగా ఎదగుతాడు. అటువంటి సదాచార సంపన్నుల గురించి వివరిస్తూ, వారు తనను ఇలా వేడుకుంటూ ఉంటారని అల్లాహ్ తన అంతిమ గ్రంథంలో ప్రస్తావించాడు:

**“వారు ఇలా ప్రార్థిస్తూ ఉంటారు : ‘ఓ మా ప్రభూ! నువ్వు మా భార్యల ద్వారా, మా సంతానం ద్వారా మా కళ్లకు చలువను ప్రసాదించు. మమ్మల్ని దైవభక్తిపరుల (ముత్తఖీన్‌ల)కు నాయకునిగా చేయి.” (ఖుర్‌ఆన్ 25 : 74)**

రమజాన్ నెలలో మంచివైపుకు పిలిచేవారి భావాలు, భావనలు జాగృతమవుతాయి. వారి నాలుకలు చురుకుగా పని చేయనారంభిస్తాయి. వారి కలములు నిరంతరం రాసుకుంటూ పోతుంటాయి. వారి ఉపదేశాలు వినేందుకు సభలు, సమావేశాలు వారిని ఆహ్వానిస్తూ ఉంటాయి. మరి తమ విద్యాజ్ఞానాలను సత్య ధర్మం వైపుకు పిలిచే మార్గంలో వినియోగించి అల్లాహ్ నుండి బహుమానాలు పొందగలిగే అదృష్టవంతులు ముందుకు రావాలి.

ఓ అల్లాహ్! మాలో లాభదాయక జ్ఞానాన్ని వికాసమొందించు. ఇస్లాం ధర్మాన్ని అర్థం చేసుకునే శక్తినీ, సత్కార్యాలు చేసే సద్బుద్ధినీ మాకు అనుగ్రహించు.



## పాఠం 28

# ఉపవాసి ప్రార్థనలు నిరాకరించబడవు

ఉపవాసి ప్రార్థనలు ఆమోదించబడతాయనీ, ఎన్నడూ నిరాకరణకు గురికావని ప్రవక్త (స) ప్రవచించారు. ఎందుకంటే ఒక ఉపవాసి గతంలో తన వల్ల జరిగిన పాపాలపై ఎల్లప్పుడూ పశ్చాత్తాపంతో ఉంటాడు. తనలోని మూర్ఖపు మొండితనాన్ని జయిస్తాడు. క్రూరమైన, అత్యంత తీవ్రమైన తన కోరికలను స్వయంగానే కట్టడి చేసుకుంటాడు. వినయవిధేయతలతో అల్లాహ్‌ను ఆరాధిస్తూ, ఆయన ముందు శిరసావహిస్తాడు. అల్లాహ్ ఆజ్ఞల్ని పాటిస్తాడు. అల్లాహ్ పట్ల భయభక్తులను కలిగి వుంటాడు. ఆయన ప్రసన్నత కోసం అన్నపానీయాలను త్యజిస్తాడు. నిగ్రహంతో ఉంటాడు. భూమ్యాకాశాల ప్రభువు ఇచ్చిన ఒక్క ఆజ్ఞకే తన కోరికలను అణగదొక్కుకుంటాడు. “ప్రార్థన కూడా ఆరాధనే” అని ప్రవక్త (స) చెప్పి ఉన్నారు. కనుక ఏ దాసుడైనా ఎక్కువగా ప్రార్థనలు చేస్తున్నాడంటే, అతను అల్లాహ్‌కు సన్నిహితంగా ఉన్నాడనీ, అల్లాహ్ మీద అతనికి అపారమైన నమ్మకం ఉందనీ అర్థం.

ఒకసారి ప్రవక్త సహచరులు, “దైవప్రవక్తా! మన ప్రభువు, మనం రహస్యంగా చెప్పినా వినగలిగేంత దగ్గరలో ఉన్నాడా? లేక గట్టిగా అరిస్తే గాని వినలేనంత దూరంలో ఉన్నాడా?” అని ప్రవక్త (స)ను అడిగారు. అప్పుడు పరమ ప్రభువైన అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ క్రింది వాక్యాలను అవతరింపజేశాడు:

**“(ఓ ప్రవక్తా!) నా దాసులు నా గురించి నిన్ను అడిగితే, నేను (వారికి) అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచే వాడు నన్ను ఎప్పుడు పిలిచినా నేను అతని పిలుపును ఆలకించి ఆమోదిస్తానని (నువ్వు వారికి చెప్పు). కాబట్టి వారు కూడా నా ఆదేశాన్ని శిరసావహించాలి, నన్ను విశ్వసించాలి (ఈ విషయం నీవు వారికి తెలియజేయి). తద్వారానే వారు సన్మార్గ భాగ్యం పొందగల్గుతారు.” (ఖుర్‌ఆన్ 2 : 186)**

దీని గురించి తన సహచరులకు వివరిస్తూ దైవప్రవక్త (స) , "మీరు ఎవరిని మొర పెట్టుకుంటున్నారో ఆయన చెవిటివాడూ కాదు, కనిపెట్టనివాడు కూడా కాదు. మీరు మొర పెట్టుకుంటున్న ప్రభువు సర్వం వినేవాడు, అన్నీ కనిపెట్టుకొని ఉన్నవాడు. మీ ఒంటెల మెడల కన్నా ఆయన మీకు చేరువలో ఉన్నాడు" అని చెప్పారు. ప్రార్థన ఒక పొడవైన త్రాడు లాంటిది. అల్లాహ్‌కు - ఆయన దాసులకు మధ్య ఉండే ఆధ్యాత్మిక అనుబంధం ప్రార్థన (దుఆ). అందుకనే, దైవప్రవక్త (స) "ప్రార్థన (దుఆ) వల్ల ఎవరూ వినాశానికి గురికారు" అని ప్రకటించారు. అనంత కరుణామయుడైన అల్లాహ్ తన దాసులు తనను మాత్రమే ప్రార్థించాలని సూచించటానికి కారణమూ అదే!

**"మీరు మీ ప్రభువును కడు దీనంగా వేడుకోండి. గోప్యంగా కూడా విన్నవించుకోండి. హద్దు మీరిపోయే వారిని ఆయన సుతరామూ ఇష్టపడడు."**
**(ఖుర్ఆన్ 7 : 55)**

మరో చోట ఇలా సెలవీయబడింది:

**"మరి మీ ప్రభువు ఏమంటున్నాడంటే, "మీరు నన్నే ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను ఆమోదిస్తాను. నా దాస్యం పట్ల గర్వాహంకారం ప్రదర్శించేవారు త్వరలోనే అవమానితులై నరకంలో ప్రవేశించటం తథ్యం."**
**(ఖుర్ఆన్ 40 : 60)**

మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రార్థన శ్రేష్ఠతను గురించి వివరిస్తూ ఇలా చెప్పారు: "(ప్రతిరోజూ) రాత్రి, చివరి మూడవ భాగంలో మన ప్రభువు భూమికి సమీపాన ఉన్న ఆకాశానికి దిగి వచ్చి, 'అర్థించేవారెవరైనా ఉన్నారా, నేను వారికి ప్రసాదిస్తాను. నన్ను పిలిచేవారెవరైనా ఉన్నారా? నేను వారి పిలుపుకు జవాబు పలుకుతాను. మన్నింపును వేడుకునే వారెవరైనా ఉన్నారా, నేను వారికి మన్నింపును అనుగ్రహిస్తాను' అని ప్రకటిస్తూ ఉంటాడు."

రమజాన్ మాసం దాసుల ప్రార్థనలు, వేడుకోళ్ళు, పశ్చాత్తాప(తౌబా)లు స్వీకృతిని పొందే శుభప్రదమైన మాసం. దాహంతో పెదాలు ఎండిపోయిన ఓ ఉపవాసీ! దప్పికతో నాలుక పిడచకట్టుకు పోతున్న ఓ ఉపవాసీ!! ఆకలితో నకనకలాడే కడుపుతో దైవప్రీతి కోసం బాధను భరిస్తున్న ఓ ఉపవాసీ!!! త్వరగా నీ ప్రభువును



ప్రార్థించు. మాటిమాటికీ ప్రార్థించు. పదేపదే ప్రార్థించు. అత్యంత దీనంగా ప్రార్థించు. సదాచార సంపన్నులైన తన దాసుల గురించి పరమ ప్రభువు ఏమని పలికాడో సదా నీ మనసులో మెదలుతూ ఉండాలి సుమా!

**"ఈ సద్వర్తనులు సత్కార్యాల కోసం వేగిరపడేవారు. ఆశతోనూ, భయంతోనూ మమ్మల్ని వేడుకునేవారు. మా ముందు అశక్తతను, అణకువను కనబరచేవారు."**
**(ఖుర్ఆన్ 21 : 90)**

"ప్రార్థన" (దుఆ)కు కొన్ని నియమాలున్నాయి. ఉపవాసం ఉండే ప్రతి వ్యక్తి తప్పకుండా తెలుసుకోదగిన విషయాలవి. దుఆ చేసేటప్పుడు అల్లాహ్ కరుణపై, ఆయన ఔదార్యంపై అకుంఠిత విశ్వాసాన్ని, స్థిర నమ్మకాన్ని కలిగి వుండటం ఆ నియమాల్లో ఒకటి. "ఓ ప్రభూ! నీవు కోరుకుంటే నన్ను క్షమించు" అని అనరాదు. పైగా నిరంతరం, అలసిపోకుండా అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉండాలి. ఎందుకంటే దాసుల ప్రార్థనను స్వీకరించేలా అల్లాహ్‌ను ఒత్తిడి చేసే శక్తి ఏదీ లేదు అని దైవప్రవక్త (స) ప్రవచించి ఉన్నారు. దుఆ ప్రారంభంలో, మధ్యలో, చివర్లో దాసుడు అల్లాహ్‌ను ప్రస్తుతించటం, అత్యంత ఆదరణీయులైన అల్లాహ్ సందేశహరులు ముహమ్మద్ (స)పై దేవుని కరుణాకటాక్షాలు వర్షించాలని కోరుకోవటం మరొక నియమం. ప్రార్థనలు స్వీకృతిని పొందే వేళలను కూడా దాసుడు తెలుసుకొని ఉండాలి. రాత్రిలో చివరి మూడవ భాగం, సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేస్తున్నప్పుడు, నమాజు పిలుపు (అజాన్)కు - నమాజు ప్రారంభ ప్రకటన (ఇఖామత్)కు మధ్య గల సమయం, విధి (ఫర్జ్) నమాజుల అనంతరం, శుక్రవారం నాటి చివరి ఘడియలు, అస్ర్ నమాజ్ తరువాతి సమయం, అరఫాత్ రోజు - ఇవీ ప్రార్థనలు స్వీకృతిని పొందే వేళలు. మరి ప్రార్థనలో కవితా ధోరణి కూడా ఉండరాదు సుమా! అలాగే, పాపం చేసే అవకాశం కల్పించమనో లేక తన బంధువులకు చెడు జరగాలనో ప్రార్థన చేయరాదు.

ఓ ఉపవాసీ! సూర్యాస్తమయానికి ముందు వచ్చే ఘడియలు ప్రార్థన కోసం రోజులో అత్యంత శ్రేష్టమైన ఘడియలని తెలుసుకో. ఆకలి దప్పులు తీవ్ర రూపం దాల్చే ఉపవాస దీక్షా విరమణ (ఇఫ్తార్) సమయంలో నువ్వు దుఆ చెయ్యాలనే తపనతో నిరంతరంగా వేడుకుంటూ ఉండు. అలాగే ఉషోదయానికి ముందు కూడా అలాంటి ఒక ఘడియ ఉందనీ తెలుసుకో. నీవు నిరుపేదవు, అల్లాహ్ శ్రీమంతుడు. నీవు

బలహీనుడవు, అల్లాహ్ సర్వ శక్తిమంతుడు. నీ జీవితం క్షణభంగురం, కాని ఆయన శాశ్వతుడు, అన్ని అవసరాలకు అతీతుడు అని తెలుసుకొని నీ పరలోక శ్రేయస్సు కోసం అల్లాహ్‌ను ప్రార్థించుకో.

ప్రవక్తల పితామహుడైన ఇబ్రాహీం (అలైహిస్సలామ్) ఇలా ప్రార్థించారు:

**"నా ప్రభూ! నన్ను నమాజును నెలకొల్పేవానిగా చెయ్యి. నా సంతతి నుండి కూడా (ఈ వ్యవస్థను నెలకొల్పే వారిని నిలబెట్టు). ప్రభూ! నా ప్రార్థనను ఆమోదించు. మా ప్రభూ! నన్నూ, నా తల్లిదండ్రులను, విశ్వాసులను లెక్క తేల్చే రోజున క్షమించు." (ఖుర్ఆన్ 14 : 40,41)**

మూసాప్రవక్త (అలైహిస్సలామ్) ఇలా ప్రార్థించారు:

**" "ఓ నా ప్రభూ! నా కోసం నా ఛాతీ (మనసు)ని విశాలమైనదిగా చేయి." (ఖుర్ఆన్ 20 : 25)**

సులైమాన్ ప్రవక్త (అలైహి) ఇలా ప్రార్థించారు:

**"ప్రభూ! నన్ను మన్నించు. నాకు తప్ప ఇతరులెవరి వల్లా కాని సామ్రాజ్యాన్ని నాకు ప్రసాదించు. నిశ్చయంగా నీవు గొప్ప ప్రదాతవు." (ఖుర్ఆన్ 38 : 35)**

ఒక ప్రామాణికమైన హదీసు ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించారు: "ఓ సకల లోక పరిపోషకా! జిబ్రయీల్, మీకాయీల్, ఇస్రాఫీల్ దూతలకు ప్రభువా! భూమ్యాకాశాల నిర్మాతా! నీ దాసులు విభేదించే విషయాల్లో నువ్వు మాత్రమే అంతిమ తీర్మానం చేయగలవు. నువ్వు నీ అనుమతితో నన్ను సత్యం వైపు నడిపించు. సన్మార్గం వైపు నడిపించేవాడివి నీవే."

## 'దుఆ' చేయటం వల్ల నాలుగు లాభాలున్నాయి

**మొదటిది** : అత్యంత శక్తివంతుడైన అల్లాహ్‌నే ఆరాధించాలనీ, ఆయనకే వినయ విధేయతలు చూపాలనీ, ఆయననే విశ్వసించాలనీ దాసులు బాగా అర్థం చేసుకోగలుగుతారు.

**రెండవది** : మంచిని ప్రసాదించటం లేక చెడును తొలగించటం ద్వారా దాసుల విన్నపాలకు జవాబు ఇవ్వటం అనేది అల్లాహ్ తప్ప వేరెవ్వరి శక్తి సామర్థ్యాల పరిధిలోకీ రాదు. దుఆ చేసేటప్పుడు దాసుడు ఈ వాస్తవాన్ని గ్రహిస్తాడు.



**మూడవది** : దాసుడు కోరుకున్నదీ, యాచించినదీ అల్లాహ్ ఈ ప్రపంచంలోనే అతనికి ప్రసాదిస్తాడు. లేకపోతే పరలోక జీవితం కోసం దాన్ని భద్రంగా దాచి ఉంచుతాడు. ఈ విధానం దాసుల కొరకు అత్యంత శ్రేయస్కరమైనది, పరలోక జీవితం రీత్యా అత్యంత ప్రయోజనకరమైనదీను.

**నాల్గవది** : ప్రతి విషయాన్ని నేరుగా అల్లాహ్ దగ్గర్నుంచి అర్థించే అవకాశం లభిస్తే, ఇక ఇతరులపై ఆధారపడవలసిన అవసరం ఏముంటుంది? వేరెవరి ప్రసన్నత కోసమూ దాసులు వేచి చూడనక్కర లేదు.

ఓ మా ప్రభూ! ఇహపరాలు రెండింటిలోనూ మాకు మంచిని ప్రసాదించు. నరకాగ్ని శిక్షల నుండి మమ్మల్ని రక్షించు. ఓ ప్రభూ! రుజుమార్గం చూపిన తర్వాత మా హృదయాలను మళ్ళీ భ్రష్టత్వం వైపు మరలేటట్టు చేయకు. నీ వద్ద నుంచి మాకు కారుణ్యాన్ని అనుగ్రహించు. నిశ్చయంగా నీవే శుభప్రదాతవు.

# పాఠం 29 ఉపవాస దీక్షకులకు కానుకలు

ఉపవాస దీక్షకులకు ఇహపరలోకాల్లో లభించబోయే బహుమతులు, కానుకలను వివరించే దైవప్రవక్త (స) ప్రవచనాలెన్నో ఉన్నాయి. వాటిని మీ ముందు ఉంచటమే, నేను మీకివ్వగల అతి గొప్ప బహుమతిగా భావిస్తున్నాను. పరలోకంలో పుణ్యానికి, శుభానికి సంబంధించి ప్రస్తావించబడిన, ప్రతి ఒక్కరూ అనుసరించదగ్గ హదీసులవి. ఈ ప్రవచనాలన్నీ సుఖసంతోషాలకు ద్వారాలనీ, ఇహపరలోకాలలో సకల శుభాలకు మార్గ దర్శకాలనీ తెలుసుకోండి.

ఓ ఉపవాసులారా! ఈ ప్రవచనాలను మీ మనో మస్తిష్కాలలో భద్రపరచుకోండి. వాటిని ఖచ్చితంగా ఆచరణలో పెట్టండి. "అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దేవుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. విశ్వ సామ్రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయనకే. ఆయన ప్రతి వస్తువుపై అధికారం కలిగివున్నాడు' అని ఉదయం పూట పలికిన వ్యక్తికి ఇస్మాయీల్ సంతతికి చెందిన ఒక బానిసకు స్వేచ్ఛ ప్రసాదించినంత పుణ్యం లభిస్తుంది. పది సత్కార్యాలు అతని పేర వ్రాయబడతాయి. ఇంకా అతని కర్మల పత్రం నుంచి పది పాపాలు చెరిపివేయబడతాయి. అతను పది స్థానాలు పైకెదుగుతాడు. సాయంత్రం వరకూ షైతాన్ బారి నుంచి సురక్షితంగా ఉంటాడు. ఒకవేళ అతను ఈ వచనాలు సాయంత్రం పూట పఠిస్తే, మర్నాడు ఉదయం వరకూ అతనికి పై పుణ్యఫలాలన్నీ లభిస్తాయి" అని దైవప్రవక్త (స) ప్రబోధించారు. (అహ్మద్, అబూ దావూద్, ఇబ్నెమాజా – సహీహ్)

దైవప్రవక్త (స) ఇంకా ఇలా ప్రబోధించారు: ఉదయం గాని, సాయంత్రం గాని ఎవయినా ఈ ప్రార్థనా వచనాలు పఠించి, కాకతాళీయంగా అదే రోజు వారు చనిపోయినట్లయితే వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. ఆ ప్రార్థనా వచనాలు ఇవి: "ఓ అల్లాహ్ నీవే నా ప్రభువు. నీవు తప్ప ఆరాధ్య దేవుడు మరొకడు లేడు. నువ్వు నన్ను పుట్టించావు. నేను నీ దాసుణ్ణి. నేను నా శక్తికి తగినట్టుగా నీ నిర్ణయానికి, నీ వాగ్దానానికి కట్టుబడి ఉన్నాను. నేను చేసిన పనుల కీడు బారి నుంచి నీ శరణు



కోరుతున్నాను. నాపై నీ అనుగ్రహాన్ని అంగీకరిస్తున్నాను. నా పాపాలను ఒప్పుకుంటున్నాను. నన్ను క్షమించు. నిజంగా నీవు తప్ప పాపాలను మరెవరూ క్షమించలేరు. (అహ్మద్, అబూ దావూద్, నసాయి, ఇబ్నె మాజ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ – సహీహ్, బుఖారీ గ్రంథంలోనూ ఇటువంటిదే మరో ఉల్లేఖనం ఉంది.)

దైవప్రవక్త (స) ఇంకా ఇలా ఉపదేశించారు: ఎవరయితే ఉదయం మరియు సాయంత్రం వందసార్లు, "మహోన్నతుడైన అల్లాహ్ పవిత్రుడు, స్తోత్రం ఆయనకే" అని పఠిస్తారో, ప్రళయ దినాన (దేవుని సన్నిధికి) వచ్చేవారిలో వారి కంటే గొప్పవారు మరెవరూ ఉండరు, వారిలాగా లేక అంతకంటే ఎక్కువ సార్లు పఠించినవారు తప్ప. (ముస్లిం, అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ)

"మహోన్నతుడైన అల్లాహ్ పవిత్రుడు, స్తోత్రం ఆయనకే" అని ఎవరయితే పఠిస్తారో వారికోసం స్వర్గంలో ఒక ఖర్జూర చెట్టు నాటబడుతుంది. (తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ – సహీహ్)

ఒకే రోజులో వందసార్లు, "అల్లాహ్ పవిత్రుడు, స్తోత్రం ఆయనకే" అని ఎవరయితే పఠిస్తారో వారి పాపాలు సముద్రపు అలలకు సమానంగా ఉన్నా సరే అవి క్షమించబడతాయి. (బుఖారీ, ముస్లిం)

ఖుర్ఆన్‌లోని పది వాక్యాలను చదివి ఆచరించినవాడు నిర్లక్ష్యం చేసేవారి కోవలో పరిగణించబడడు. వంద వాక్యాలను చదివి ఆచరించినవాడు 'విధేయుల్లో' లెక్కించబడతాడు. ఇంకా వెయ్యి వాక్యాలను చదివి ఆచరించినవాడు మహా భాగ్యవంతునిగా భావించబడతాడు. (అబూ దావూద్, ఇబ్నె హిబ్బాన్ – సహీహ్)

"అల్లాహ్ పేరుతో. ఆయన పేరు ఉండగా భూమ్యాకాశాల్లోని ఏ వస్తువూ నష్టం కలిగించజాలదు. ఆయన అన్నీ వినేవాడూ, సర్వం తెలిసినవాడు" – ఈ ప్రార్థనా వచనాలను ఉదయం, సాయంత్రం మూడుసార్లు పఠించిన వ్యక్తికి ఆకస్మిక ఆపదలేవీ రావు. (అబూ దావూద్, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ – సహీహ్)

"నేను అల్లాహ్ యొక్క సమగ్ర వచనాల శరణులోకి వస్తున్నాను. ఆయన సృష్టించిన అన్ని ప్రాణుల కీడు నుంచి" అని సాయంత్రం వేళ మూడు సార్లు ఈ ప్రార్థనా వచనాలు పఠించిన వ్యక్తికి ఆ రాత్రి విషజంతువు కాటు నష్టం కలిగించజాలదు. (తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ – సహీహ్)

ఎవరైతే ఇంటి నుంచి బయలుదేరే సమయంలో, "అల్లాహ్ పేరుతో. నేను

ఆయన్నే నమ్ముకున్నాను. అల్లాహ్‌కు తప్ప శక్తి సామర్థ్యాలు వేరెవరికీ లేవు" అని అంటారో వారితో, " నువ్వు తృప్తి చెందావు. ముందు జాగ్రత్త తీసుకున్నావు" అని చెప్పబడుతుంది. ఇక షైతాను వారి నుంచి పారిపోతాడు.

(తిర్మిజీ, అబూ దావూద్, ఇబ్నె హిబ్బాన్, ఇబ్నె సున్నీ – సహీహ్)

అజాన్ పిలుపు విన్న తరువాత "అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దేవుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు సాటి ఎవరూ లేరు. ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త, అల్లాహ్ సందేశహరులు. నేను అల్లాహ్‌ను ప్రభువుగా, ముహమ్మద్ (స)ను ప్రవక్తగా, ఇస్లాంను ధర్మంగా సంతోషంతో స్వీకరించాను" అని ఎవరయితే ధృవీకరిస్తారో, వారి పాపాలన్నీ క్షమించబడతాయి. (ముస్లిం, మరి ఐదుగురు)

ఇఖ్‌లాస్ సూరాను పది సార్లు పఠించిన వ్యక్తి కోసం అల్లాహ్ స్వర్గంలో ఒక ఇంటిని నిర్మిస్తాడు. (అహ్మద్ – సహీహ్)

శుక్రవారం రోజు కహఫ్ సూరా పఠించిన వారి కోసం ఒక జ్యోతి వెలిగించ బడుతుంది. అది మరుసటి శుక్రవారం వరకూ ఉంటుంది.

(హాకిమ్, బైహఖీ – సహీహ్)

ప్రతి ఫర్జ్ (విధి) నమాజు అనంతరం (బఖర్రా సూరాలో ఉన్న) 'ఆయతుల్ కుర్సీ' పఠించే వ్యక్తిని స్వర్గ ప్రవేశం నుంచి ఏ విషయమూ అడ్డుకొనజాలదు. (ఇబ్నె హిబ్బాన్, నసాయి – సహీహ్)

ఇఖ్లాస్ సూరా పారాయణం చేస్తే మూడో వంతు ఖుర్ఆన్ పారాయణం చేసినట్లుగా పరిగణించబడుతుంది. (అహ్మద్, నసాయీ, తిర్మిజీ – సహీహ్)

పైన పేర్కొనబడిన ప్రవచనాలన్నిటినీ ముహమ్మద్ (స) వారి పుష్ప గుచ్ఛం అనుకోండి. మేము ఈ పుష్ప గుచ్ఛాన్ని ఉపవాస దీక్షకులకు కానుకగా ఇస్తున్నాం.

ఓ అల్లాహ్! నిన్ను ధ్యానించటంలో మాకు సహాయపడు. ఉత్తమ రీతిలో నీకు కృతజ్ఞతలు తెలియజేసే లాగా, నిన్ను ఆరాధించే లాగా మాకు తోడ్పడు.



పాఠం 30

# రేపే ఈద్ - ఉపవాస దీక్ష విరమణ పండుగ

రేపే ఈద్. ఇవాళ రాత్రి తెల్లారితే రేపు ముస్లింలంతా పండుగ జరుపు కుంటారు. ఈద్ లేక పండుగ అంటే ఏమిటి? అది ఎట్లా ఉంటుంది? కొత్త బట్టలు వేసుకోవటం పండుగ కాదు. తన సిరి సంపదలు చూసుకొని మురిసిపోయే వ్యక్తికీ ఇది పండుగ కాదు. తీర్పుదినానికి, పరలోక న్యాయ సింహాసనాధిపతి అయిన అల్లాహ్‌కు భయపడుతూ జీవితం గడిపేవారిదే ఈ పండుగ.

ఈద్ అంటే సంగీతం, నృత్యాలు కావు. తమాషా ఆటపాటలు కావు. అది వ్యర్థ మనోరంజకం కాదు. ఆటవిక ఆనందం అసలే కాదు. పండుగ అంటే కరుణా మయుడైన అల్లాహ్ పట్ల కృతజ్ఞతలు తెలియజేయటం, ఆయన ప్రసాదించిన వరాలను గుర్తించటం, ప్రభువు కరుణానుగ్రహాలను ప్రదర్శించటం, విశ్వాసుల నమ్మకాలను స్థిరపరచటం, ఇస్లాం ధర్మాన్ని బలపరచటం, ఇస్లాం శత్రువులు కల్పించే అడ్డంకులను అవలీలగా తొలగించుకోవటం.

## పండుగ రోజు కార్యక్రమాలు

ప్రతి ముస్లిం ఫిత్ర్ పండుగ నమాజుకు ముందు కొంత అల్పాహారం తీసు కోవాలి. అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం అది ఉపవాస దీక్ష విరమణ సమయంలో తినే ఖర్జూర పండే కావచ్చు. ఇకపోతే, రమజాన్ నెలలో ఉపవాస దీక్ష విరమణ సమయంలో జరిగిన తప్పులకు, పొరబాట్లకు బదులుగా ఈ రోజు నిరుపేదలకు "జకాతుల్ ఫిత్ర్" దానం చెల్లించాలి. ఇది పేదల్లో సంతోషాన్ని తెస్తుంది. ముస్లింలలో పరస్పరం దయ, సహకార గుణాలను పెంపొందిస్తుంది. హృదయాలను శుద్ధి చేస్తుంది. వారిలో పిసినారితనాన్ని అరికడుతుంది.

కొత్త బట్టలు ధరించటం, అత్తరు పూసుకోవటం పండుగ నాటి కార్యక్రమా లలో అంతర్భాగమే. అల్లాహ్ కారుణ్యాన్ని అర్థం చేసుకునే సాధనమే పండుగ. అల్లాహ్ అత్యంత సుందరుడు. సౌందర్యాన్ని ఆయన ఇష్టపడతాడు. కనుక సౌందర్యమూ పండుగలో అంతర్భాగమే! అల్లాహ్ అనుగ్రహాలను ప్రదర్శించే సమయమే ఈ

పండుగ. " అల్లాహ్ తన దాసునికి అనుగ్రహం ప్రసాదించినప్పుడు ఆ మనిషిపై తన అనుగ్రహం తాలూకు ప్రభావం కనిపించటాన్ని ఆయన ఇష్టపడతాడు" అని దైవప్రవక్త (స) ప్రవచించి ఉన్నారు. పండుగ ఒకరినొకరు కలుసుకునే సమయం. అభినందనలు తెలుపుకునే సందర్భం. పరస్పరం ప్రేమాభిమానాలు పంచుకునే శుభఘడియ. కనుక పండుగ రోజు బంధుమిత్రులతో సంబంధాలు నెలకొల్పాలి. తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలు చూపాలి. పేదల పట్ల దయ కనబరచాలి. పొరుగువారి పట్ల సానుభూతి కలిగిఉండాలి. ఇస్లామీయ పండుగ ఈ విషయాలన్నిటినీ తన అనుయాయులకు పదే పదే ప్రబోధిస్తుంది.

ఇస్లామీయ పరిధుల్లో ఉంటూ ఆనంద సంబరాలను జరుపుకోవాలని ముస్లింల పండుగ మనకు బోధిస్తుంది. ఇస్లామీయ పరిమితులకు లోబడి యధేచ్ఛగా ఆహ్లాదాన్ని అనుభవించమంటుంది. వినయ విధేయతలు నిండిన క్రీడలను, ఇతరులకు ఏమాత్రం హాని కలిగించని ఆటల్ని ఆనందించమంటుంది. ఇతరుల పట్ల వెటకారం కాని నవ్వుల పువ్వుల్ని కురిపించమంటుంది. ధార్మిక పరిమితులను గౌరవిస్తూ విహార సంతోషాన్నీ ఆస్వాదించమంటుంది. సృజనాత్మకతను పెంచే కథలు విని హర్షించమంటుంది. "గొప్ప సమీకరణ దిన"మైన పరలోక ప్రతిఫల దినాన్ని తలపించే మహత్తర సందర్భం ఇది. వేలాది మంది ధనవంతుల్ని, పేదవారిని, పెద్దలను, పిన్నలను, పాలకులను, పాలితులను, ఆనందంలో ఉన్నవారిని, బాధలు అనుభవిస్తున్నవారిని ఒక చోట చేరుస్తుంది పండుగ రోజు.

ఈద్ అనేది అల్లాహ్ తరపున బహుమతులు అందుకునే రోజు. పరిపూర్ణ విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో ఉపవాసాలు పాటించినవారికి, పండుగ ఓ గొప్ప బహుమానం. ఘనమైన విజయం. మహా కానుక. దీనికి భిన్నంగా ఉపవాస సమయంలో పాపాలు చేసి, అల్లాహ్ హద్దులను అతిక్రమించి, ఆయన ఆజ్ఞల్ని నిర్లక్ష్యం చేసినవారు తమ తప్పు తెలుసుకొని పశ్చాత్తాప పడవలసిన దినమూ ఇదే. మరి అది ఎంత తీవ్రమైన నష్టమో కదా?!

పండుగ రోజున నమాజు ముగించుకొని తిరిగివచ్చేవారిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఒకరు, ఆ రోజు అల్లాహ్ తరపున బహుమతులు పొంది ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకునేవారు. పరమ ప్రభువైన అల్లాహ్ ఇటువంటి వారిని ఉద్దేశించి, "వెళ్లండి, నేను మిమ్మల్ని క్షమించాను. మీరు నేనంటే ఇష్టపడ్డారు. నేనూ మీరంటే ఇష్టపడ్డాను" అని అంటాడు.



ఇక రెండవ వర్గంవారు రమజాన్ మాసపు సర్వశుభాలూ పోగొట్టుకున్న నిరాశామూర్తులు. వీరు నష్టాలతో, పరితాపంతో, అన్నీ కోల్పోయి అసంతృప్తులై తిరిగి వస్తారు.

ఒకానొక పండుగ రోజు ఒక ప్రజాసముదాయం వ్యర్థ కార్యకలాపాల్లో మునిగి ఉంది. ఒక దైవభీతి పరాయణుడు వారిని గమనించి, "మీరు గనక రమజాన్ మాసం మంచి విధంగా గడిపి ఉంటే, అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపే విధానం ఇది కాదు. మరొకవేళ రమజాన్ మాసాన్ని మీరు అనవసర కార్యకలాపాల్లో గడిపి ఉంటే, కరుణామయుడైన అల్లాహ్ ఎదుట పశ్చాత్తాప పడవలసిన తీరు కూడా ఇది కాదు సుమా!" అని వారికి బోధపరచాడు.

కొంతమంది అరఫాత్ ప్రాంతం నుంచి తమ గుర్రాలపై, ఒంటెలపై పరుగులు తీస్తున్నారు. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ వారిని చూసి, "గుర్రాలు లేక ఒంటెలపై స్వారీ చేసి పరుగు పందెంలో గెలిచినవారు విజేతలు కారు. ఎవరి పాపాలయితే మన్నించబడ్డాయో వారే నిజమైన విజేతలు" అని చెప్పారు.

ఓ ముస్లిం! గత సంవత్సరం నీతోపాటు ఈద్ నమాజ్ చేసిన వారిని కాస్త గుర్తుకు తెచ్చుకో. వారిలో నీ తాతలు, తండ్రులు, నీవు ప్రేమించినవారు, నీ బంధు మిత్రులూ ఉన్నారు కదూ?! వారందరూ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఏమై పోయారు? రేపు నీకు బహుమతి ఇవ్వబడనుంది. రేపు నీ కర్మల పత్రంలో నీ ఆచరణకు పరిపూర్ణ ప్రతిఫలం రాయబడుతుంది. అందులో కేవలం మంచి మాత్రమే నమోదు చేయబడేందుకు గట్టిగా కృషి చేయి సుమా! అల్లాహ్ అనుగ్రహాన్ని, ఆయన మన్నింపును, ఆయన క్షమాభిక్షను పొందగలిగే రేపటి గొప్ప పండుగ దినం కోసం ఎదురు చూడు మరి!

**"ప్రతి ప్రాణీ మృత్యువు రుచి చూడ వలసిందే. ప్రళయదినాన మీరు అందరూ మీ కర్మల పూర్తి ఫలితాన్ని పొందుతారు. అప్పుడు ఎవడు నరకాగ్ని నుంచి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశం కల్పించబడతాడో అతడు నిశ్చయంగా సఫలీకృతుడయ్యాడు. ప్రాపంచిక జీవితమైతే ఒక మాయావస్తువు తప్ప మరేమీ కాదు కదా!"** **(ఖుర్ఆన్ 3 : 185)**

# ముగింపు

ఓ ఉపవాసీ! అల్లాహ్ శాంతి, ఆయన అనుగ్రహం, ఆయన కారుణ్యం నీపై ఉండాలని కోరుకుంటున్నాను. తన మీద విశ్వాసం ఉంచేవారికి ఎలాంటి నష్టం కలుగకుండా కాపాడే అల్లాహ్‌కు నేను నిన్ను అప్పగిస్తున్నాను. నీ ఉపవాసాలు, రాత్రివేళల్లో నీవు చేసిన ప్రార్థనలు నీ పాలిట శుభకరం కావాలని కోరుకుంటున్నాను. ఇక నీ శ్రమఫలాన్ని ఆనందంగా అనుభవించు. సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ తన గ్రంథంలో ఇలా అంటున్నాడు:

**"అయితే ముందు నుంచే మా వద్ద ఎవరి కొరకు మేలు ఖరారై ఉందో వారంతా నరకానికి దూరంగానే ఉంచబడతారు. వారు నరకం సవ్వడి కూడా వినరు. తమ మనసు మెచ్చిన సుఖవిలాసాల మధ్య వారు శాశ్వతంగా ఉంటారు." (ఖుర్‌ఆన్ 21 : 101,102)**

అల్లాహ్ నిన్నూ, నన్నూ విశ్వాసులుగా పరిగణించి మనం చేసిన సత్కార్యాలను స్వీకరించాలని కడు దీనంగా వేడుకుంటున్నాను. నిశ్చయంగా అల్లాహ్ అన్నీ తెలిసిన వాడు.

ప్రవక్త (స)పై, ఆయన కుటుంబీకులపై, ఆయన అనుయాయులందరిపై అల్లాహ్ శాంతీ కారుణ్యాలను కురిపించుగాక!